

సృజన

సృజన

1983 జూన్ సంచిక | శ్రీశ్రీ | అనుబంధం

తుది పయనం : తొలి విజయం

ఊగరా, ఊగరా, ఊగరా!
ఉరికొయ్య అందుకొని ఊగరా!
ఉరికొయ్య అంటుకొని ఊగరా!
ఉయ్యాలలాగ బాగా ఊగరా!
సోదరా, సోదరా, సోదరా!
చావన్నది నీకు లేనేలేదురా!
వీరుడా! ధీరుడా! శూరుడా! ॥ఊగరా॥
ఉక్కు మనిషివి నువ్వు, ఉగ్రనరసింహుడివి!
ఒక్క దెబ్బకు దిక్కు దిక్కులే పగిలించి,
అశ్వరథ శరభలూ, అట్టహాసాలతో
అడవి అడవంతాను పిడుగులే కురిశావు!
అందుకే ॥ఊగరా॥

బరిసెలూ, కొడవళ్ళే పాశుపతాస్త్రాలు,
గురి తప్పనిది నీది శ్రీరామబాణమే!
నీవిల్లు గాండీవం, నీయిల్లు భూలోకం
నీ గోళ్ళు గొడ్డళ్ళు, ఈ ప్రజలు నీ వాళ్ళు
అందుకే, ॥ఊగరా॥

ఎండనక, వాననక – తిండి సరిగ్గా తినక,
ఉన్నచోట ఉండకుండ ఊళ్ళన్నీ చుట్టేవు!
పగబట్టిన, పడగెత్తిన పాములాగ బుసకొట్టి
ప్రజావంచకాధములకు సమాధులే కట్టేవు
అందుకే, ॥ఊగరా॥

నువు వేసిన కత్తిగంట్లు గంటల్లా మోగేయి!
నువు వేసిన పొలికేకలు మంటల్లా రేగేయి
బుద్ధి తక్కువ గాడిదలకు పొటాసియం సైనేడువి!
అభిమానుల గుండెల్లో ఆరిపోని హైలైటువి!
తొత్తుకొడుకు లెవ్వరికీ దొరక్కుండ తిరిగేవు!
కత్తి దూసి కామాంధుల కుత్తుకలే తరిగేవు!
పేద ప్రజానీకానికి, పీడితులకు, తాడితులకు
చేదోడుగ, వాదోడుగ, సైదోడుగ మెలిగేవు

అందుకే ఉగరా, ఉగరా, ఉగరా!
ఎన్నటికీ ఆరనిదీ కాగడా!

పువ్వులాంటి యవ్వనాన్ని నిగ్గబట్టి నిలిచావు!
నిప్పులాంటి నిజాయితీ నెత్తికెత్తి నడిచావు!
కార్యదీక్ష కదిలిస్తే కదనానికి దూకేవు!
పద్మవ్యూహంలోని అభిమన్యుడి వైనావు!

అందుకే, ॥ఉగరా॥

నెత్తురు కార్చిన కళ్ళే నిప్పులు చెరుగుతాయి!
వంకర టింకర రాళ్ళే గుళ్ళయి ఎగురుతాయి!
శ్రీకాకుళం అడవుల్లో చీమలు పాముని చంపుతాయి!
సింహాద్రి శిఖరంమీద చిలుకలు పిల్లిని చెండుతాయి!
స్వాతంత్ర్యపు మారుపేరు సామ్యవాదమే, సత్యం!
చావులేని ఆ సత్యం జ్వలిస్తుంది అనునిత్యం!
సామ్యవాద రథసారధి మార్క్సు చూపెనదె తీరం!
తూర్పుదిక్కు మందారం! ఆర్పరాని అంగారం!

ఉగరా, ఉగరా, ఉగరా!
ఎన్నటికీ వాలనిదీ బావుటా!

మూంచాలను కొలుస్తారు, మల్లమ్మను తలుస్తారు,
ఝాన్సీ లక్ష్మిబాయికి బాష్పధార విడుస్తారు,

సరోజినీదేవి ఫోటో పటంకట్టి పొగుడుతారు,
పంచాది నిర్మలంటే భయంపుట్టి వణుకుతారు!
తెల్లవాడు నిన్ననాడు భగత్సింగు అన్నాడు!
నల్లవాడు నువ్వునేడు నక్సలైటు వన్నాడు!
ఎల్లవారు నిన్ను రేపు వేగుచుక్క అంటారు!
అల్లూరికి వారసుడా! శ్రీశ్రీ కవిత్వ లాలసుడా!


ఊగరా, ఊగరా, ఊగరా!
నువ్వూగుతుంటే శత్రువులకి గాభరా

నీ ధాటికి అడ్డులేదు నీ త్యాగం వృధాకాదు!
నీ ఆదర్శం ఎపుడూ నీతోనే ఆగిపోదు!
ఇది ప్రపంచ పర్యాప్తం - జనశక్తికి పరమాప్తం!
ఈ పోరాటం అంతిమ విజయంతోనే సమాప్తం!

ఏ దేశంలోనైనా ఏకాకివి కావు నీవు!
వీర వియత్నాంలోన విజయగీతి పాడినావు!
అదిగదిగో, బాంగ్లాలో అగ్గివాన కురుస్తోంది!
ఇదిగిదిగో సిలోన్‌లోను ఎర్రసేన కదుల్తోంది!
ఇది ప్రపంచ కుగ్రామం! ఇది గ్లోబల్ సంగ్రామం
ఎడతెగనిది సంక్షోభం! ముందున్నది సంక్షేమం!

ఉప్పెనలా ఉవ్వెత్తుగ యువశక్తి లేచింది!
ప్రతినపట్టి తొడలుకొట్టి, తిరుగుబాటు చేసింది!
హింసకు ప్రతిహింసతో ఎదురుదెబ్బ తీసింది!
పాపాత్ముల ప్రాణాలకు పరమాణువు బాంబులాగ
ఒక మాటగ, ఒక బాటగ, ఒక పాటగ సాగింది!
ఇంక్విలాబ్ ఇంక్విలాబ్ జిందాబాద్!
జిందాబాద్ జిందాబాద్ ఇంక్విలాబ్!
ఇంక్విలాబ్ జిందాబాద్!
ఇంక్విలాబ్ జిందాబాద్!
ఇంక్విలాబ్ జిందాబాద్!

(1971)



"మహాప్రస్థానం" [illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
"[illegible]" అంటున్నారు.

"మహాప్రస్థానం" [illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]!

శ్రీ శ్రీ

"తొలియవ్వనాన్ని పునర్జీవిస్తూ" శ్రీ శ్రీ సజీవంగా వుంటాడు

తెలుగుదేశపు తూర్పు సముద్రం ముక్క
కేవలం నా కన్నీటి చుక్క!
అడవులమీద ఆకాశం తొంగిచూస్తున్నప్పుడు
కొండల్లో ప్రతిధ్వనిస్తుంది నా గుండెల చప్పుడు
తెలుగుదేశంలో ఎక్కడవున్నా నేను
నా తొలియావనాన్ని పునర్జీవిస్తాను

(మట్టిపులి 1975)

ఆ కన్నీటి చుక్క, అందులో ప్రతిఫలించిన 'బాధాసర్పదష్టుల' 'గుండె నెత్తురుల తర్పణ'తో 'కొత్తటానిక్' అయింది - తెలుగు కవిత్వానికే కాదు, తెలుగు నాట పోరాటశక్తులకు కూడ.

ఆ తూర్పు సముద్రం ముక్క ఆ గీతం రాసే నాటికే శ్రీకాకుళ కెరటమైంది. ఆ 'విప్లవకెరటమే' ఆయనను 'విరసంలోకి ప్రాడ్ చేసింది' (ఎత్తుకపోయింది. ముప్పైఏళ్ళ చెరబండరాజుతో, పదహారు పద్దెనిమిదేళ్ళ రాడికల్ పిల్లలతో తెలుగు ఉగాదినాడు 'ప్రపంచ తెలుగు సభల'ను బహిష్కరించి, ప్రతిఘటించి తెలుగుదేశం రాజధాని అక్రమ పోలీసు నిర్బంధంలో ఆ గుండెల చప్పుడు తన తొలియావనాన్ని పునర్జీవించింది.

అది ఏభై ఏళ్ళక్రితం 'భువనఘోషకు వెర్రిగొంతుక విచ్చి' మ్రోగిన నాటినుంచీ అలసటలేకుండా అడవులమీద ఆకాశం తొంగి చూసినపుడల్లా ప్రతిధ్వనిస్తూనే వున్నది. ఈ అర్ధశతాబ్దపు తెలుగు సామాజిక, సాంస్కృతిక మలుపుల దగ్గర ప్రతిచోటా ఈ తొలియావనం పునర్జీవించింది.

ఆ సందర్భాలు అన్నీ భాషవల్ల తెలుగుదేశానికి సంబంధించినవే తప్ప అవన్నీ భువనఘోషలే. అపుడల్లా ఆ యావనశక్తి ('ఈ ప్రపంచం మీదే. మాది కూడ. కాని మరీ ముఖ్యంగా మీది') కెరటమై పైకి లేచింది. బావుటాయై పిలిచింది.

ఈ శతాబ్దపు మూడో దశాబ్దంలోని మలుపుల గురించి శ్రీ శ్రీయే చెప్పుకున్నాడు. '....ఇన్ని యిన్ని ప్రవాహాలమధ్య నా మహాప్రస్థాన గీతాలు కూడా ప్రవహించాయి' '....ఇపుడు ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే, మహాప్రస్థాన గీతాలలోని మార్క్సిస్టు స్ఫూర్తీ సామాజిక స్పృహా యాదృచ్ఛికాలు కావని స్పష్టంగా తెలుస్తోంది.'

ఈ శతాబ్దపు మూడు నాలుగు దశాబ్దాలు మొదలుకొని ఆరో దశాబ్దందాకా ముప్పై ఏళ్ళపాటు యువకుల సాహిత్యాభిరుచికి మాత్రమేకాక కమ్యూనిజంపట్ల ఆకర్షణకు, అభినివేశానికి కూడ 'మహాప్రస్థానం' ఊపిరిపోసింది.

తెలంగాణా రైతాంగ సాయుధపోరాటానికి బాసటగా శ్రీ శ్రీ లేడు కాని తెలంగాణా పోరాటాన్ని చిత్రిస్తూ, కీర్తిస్తూ వచ్చిన అన్ని కావ్యాలకన్నా, ఆ ఉద్యమంలో వున్న విప్లవకారులను, ప్రజాతంత్రవాదులను, ప్రజలను 'మరో ప్రపంచం' వైపు కదిలించింది 'మహాప్రస్థానం' గీతాలే.

విశాలాంధ్రలో ప్రజారాజ్యం కోసం కలలుగన్న కలమే కాదు అహరహం ఆ ఉద్యమంలో భాగమైన స్వరం గనుకనే తెలుగు అనే పలకరింతే ఆయనకాక పులకరింత అయింది.

కవిత్వంలోంచి కమ్యూనిజంలోకి వచ్చిన శ్రీ శ్రీ - సాహిత్య 'ప్రతిష్ఠ'కోసం కమ్యూనిజంపై కత్తికట్టిన 'ప్రజాస్వామ్య' వాదులపై, కళాసౌందర్యవాదులపై 1955 ఆంధ్రా మధ్యంతర ఎన్నికల్లో చేసిన పోరాటం పదనును ఇవ్వాల్టి అవసరం మళ్ళీ అందుకోవాల్సే వున్నది.

శ్రీ శ్రీ ఎప్పుడు ఏ ఉద్యమంలో ఉన్నాడు గనుక తెలంగాణా విమోచనోద్యమంలో లేడని తప్పు పట్టడం - అని ప్రశ్నించిన వాళ్ళకు 1955, '64 దృష్టికి రాకపోవచ్చు.

దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ప్రకటించుకున్న రాజ్యాంగం అమలులోకి వచ్చాక రాజకీయ ప్రత్యర్థులను చట్టబద్ధంగా మూక ఉమ్మడిగా అరెస్టుచేసిన తొలి సందర్భం - 1964 - సాకు - భారతదేశంపై చైనా దాడి - భయం - దేశంలో కమ్యూనిస్టులు అంతర్యుద్ధం తేవటానికి సన్నాహాలు చేస్తున్నారని - పౌరహక్కుల పరిరక్షణ కొరకు శ్రీ శ్రీ రంగంలోకి దిగాడు.

నక్సల్బరీ - శ్రీకాకుళ రైతాంగ సాయుధపోరాటం ప్రారంభం అయ్యాక విప్లవకారులపై పోలీసుల హత్యాకాండను ఖండించి విప్లవ కార్యకర్తలను విడిపించుకోవాల్సిన అవసరం ప్రజాతంత్ర ఉద్యమానికి ఏర్పడింది. అప్పుడు శ్రీ శ్రీ మళ్ళీ చెరబండరాజంత నవయువకుడయ్యాడు.

తెలుగుదేశంలో వున్న 'అభ్యుదయ' సాహిత్య విమర్శకాగ్రేసరులకు దిగంబర కవితా ఉద్యమం కళ్ళను ప్రేమించటంగా కనిపిస్తే మద్రాసులో ఉన్న శ్రీ శ్రీకి 'చెరచబడ్డ గీతాన్ని' జాతి జనులకోసం అనువది చాల్సిన స్వచ్ఛమైన స్వేచ్ఛా వాయువు అనిపించింది.

అభ్యుదయ రచయితల సంఘం అభ్యుదయాంశ కోల్పోయిందని గుర్తించగానే అందులోని ఎరుపును త్యాగాల ఒరుపును తెచ్చుకున్న విరసంలోకి వచ్చాడు శ్రీ శ్రీ. విరసం నాయకుడాయన. విరసం నాయకత్వంలో నడచిన కెరటం ఆయన. గొప్పలకు విరసం మెప్పుపొందీ, తప్పులకు విరసం ముందు క్షమాపణలు చెప్పుకున్నాడాయన.

ఇవ్వాళ తెలుగునేల నాలుగు చెరగులా నాగేటిచాళ్ళ వెంట, లోహయంత్రాల కోరలు తోమే చోట, జైళ్ళయిన విద్యాలయాల్లో, 'పాఠశాల'లైన కారాగారాల్లో, పల్లెల్లో పట్టణాల్లో, సూర్యకాంతిలా విస్తరిస్తున్న ప్రజాకళారూపాలకు బాటవేసిన నరుడైన భాస్కరుణ్ణి (నరుడో! భాస్కరుడా!) రవి గాంచనిచో కాంచిన కవి శ్రీ శ్రీ.

ఇంకక్కడినుంచీ విప్లవ సాంస్కృతికోద్యమం శ్రీ శ్రీని నడిపించింది. విరసం వెంట, ప్రజాతంత్ర ఉద్యమం వెంట-వెంటనే కాదు ముందట శ్రీ శ్రీ విప్లవ కేతనమై నడిచాడు.

యిప్లవం యాడుందిరా
ఆడనే నీ కూడుందిరా
నీ గూడుందిరా
యిప్లవం యాడుందిరా - నీ
గుండెలోనె కూకుందిరా - మన
కళ్ళలోనే దాగుందిరా

అని సేద్యగాడిని, కూలీని, హమాలీని, విద్యార్థిని

యిప్లవం యేమందిరా
మనిసికొ్కకటే సావందిరా
కట్లు తెంచుక రమ్మందిరా

అని 'మరోప్రస్థా'నానికి నడుం కట్టాడు.

'ఉరికొయ్య అందుకొని, ఉరికొయ్య అంటుకొని' ఊగిన భగత్సింగు కాలం నుంచి, 'సమాజానికి కాలం పెట్టిన అప్పును తన ప్రాణాలతో తీర్చుకున్న' 'భూమ్యా కాశాలు' భూమయ్య కిష్టగౌడ్‌ల దాకా

'చెరిగిపోని వాళ్ళ శిలాశాసనం మీద'
'ఎల్లవారు నిన్న రేపు వేగుచుక్క వంటారు'
అని 'సాక్షిసంతకం చేసిన నక్షత్రం' శ్రీ శ్రీ.

ఈ తొలియౌవనం బాల్యం లేకుండా వచ్చిందా! శ్రీ శ్రీ సద్యో యౌవనుడా! ఈ తొలియౌవనం శ్రీ శ్రీలో పునర్జీవించడమే కాదు నక్సల్బరీ తరమంతా వసంత మేఘమై గర్జించటంలో, తెలుగునేల పులకించి శ్రీకాకుళ ఎర్రపూలవనం విప్లవ సాంస్కృతిక పరిమళాలు వెదజల్లడంలో - వ్యక్తమైన వినూత్న యౌవనంలో ప్రవహించినవి ఏ రక్తాలు, ఏ ఊపిర్లు, ఏ ఉద్యమాలు.

తనమీద, తనకాలం మీద, కలంమీద ప్రభావాల గురించి శ్రీ శ్రీయే చెప్పుకున్నాడు. అదంతా శూన్యం అనే వాళ్ళను శ్రీ శ్రీ మాటల్లోనే 'అంతా మిథ్యంటావా' అని మాత్రమే అడగాల్సి వున్నది.

శ్రీ శ్రీ తర్వాత అంతా శూన్యమే అయితే శ్రీ శ్రీ సాధించిందేమిటి? ఆ యుగకర్త శూన్యయుగాన్ని సృష్టించాడా? "ఆకాశమంత ఎత్తుగా వుండే అతని వీపు 'చాటున' అబద్ధాలతో, స్తోత్రాలతో, వంచనలతో, ఆత్మశ్లాఘనలలో దేశం మీద పడి బతుకుతున్న" పరాన్న భుక్కులు చేస్తున్న 'అనుకూల దుష్ట ప్రచారం' యిది.

పునర్జీవించే శ్రీ శ్రీ తొలియౌవనానికి వారసులైన నక్సల్బరీ తరం ఈ కుట్ర గాలుల నుంచి ఆయన సంతకాన్ని కాపాడుకుంటుంది.

ఇదిగో జాబిల్లీ నువ్వు
సముద్రం మీద సంతకం చేసేటప్పుడు
గాలి దాన్ని చెరిపెయ్యకుండా
కాలమే కాపలా కాస్తుంది
(శరచ్చంద్రిక 1955)

20-6-83 — వరవరరావు

'మహాప్రస్థానం' ఆత్మకథ

లండన్ నగరంలో వెలువడుతున్న "విదేశాంధ్ర ప్రచురణల" నిమిత్తం నా "మహాప్రస్థానం" గీతాలను టేప్ రికార్డు చేసి, నా కంఠధ్వని ఉన్న cassette తో బాటు, నా సొంత దస్తూరిలో అన్ని గీతాలనూ facsimile రూపంలో విడుదల చేసే సందర్భంలో ముందుమాటగా ఏదైనా చెప్పమని ప్రచురణకర్త హోదాలో మిత్రుడు డా॥ జి. కృష్ణమూర్తి నన్నడిగారు. అప్పుడు చలంగారి యోగ్యతా పత్రాన్నే చదివేద్దామనుకున్నాను. "మీ అభిప్రాయాలే వినిపించా"లన్నారు మిత్రులు. "సరే!" అన్నాన్నేను.

....

చలంగారి చేత పని కట్టుకొని ప్రశంసా వాక్యాలు వ్రాయించినవాడు జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి. ఆ రోజుల్లో రుక్కాయి నాకు, అతని మాటల్లోనే, "అనధికార పబ్లిసిటీ ఆఫీసరు"గా పనిచేసేవాడు. నా గీతాలన్నీ ఎక్కడెక్కడ అచ్చయినవో ఒక నోటు బుక్కులో రాసుకునేవాడు. చాలామట్టు కతని కవి కంఠస్థం. ఒక మారతను మా యింటికివచ్చి, అప్పటికి అసంపూర్ణంగా ఉన్న "జగన్నాథుని రథచక్రాలు" చూశాడు. మహాప్రస్థానం గీతాలన్నిటిలోనూ ఏకబిగిని రాయనిది ఇదొక్కటే. "కవితా! ఓ కవితా!" వంటి సుదీర్ఘ గీతాన్ని కూడా ఒకే ఊపులో రాశాను. "వస్తున్నా యొస్తున్నాయ్"కి పేరడీగా "వెళిపోయాయ్ వెళిపోయాయి" అంటూ జరుక్కు "ఆశ్వాసాంతం" రాసి "భారతి"లో అచ్చువేయించాడు. దానితో నాకు తొందర పుట్టి "రథచక్రాలు" పూర్తి చేశాను. మరుసటి నెల "భారతి"లో అది వెలువడింది.

1940ల లోనే "మహాప్రస్థానం" ప్రెస్ కాపీ సిద్ధం చేశాను. జనార్దనరావు మరణవార్త వినగానే ఈ పుస్తకం అతనికే అంకితం అనుకున్నాను. ఆ రోజే (1938లో ఒకరోజు) "తలవంచుకు వెళిపోయావా! నేస్తం" అంటూ అంకిత గీతం సిద్ధం చేశాను. తర్వాత 1950 నాటికిగాని ఈ గ్రంథ ముద్రణ కాలేదు. "నళినీ కుమార్" అనే మిత్రుడు చేసిన ధనసాహాయ్యంతో మొదటి ముద్రణ వెలుగు

చూసింది. అది నా నలభయ్యో ఏట నా మిత్రుడిచ్చిన కానుక. జేమ్స్ జాయిస్ Ulysses కూడా అతని నలభయ్యో ఏట పారిస్‌లో అచ్చయింది.

ఆ తర్వాత "మహాప్రస్థానం" ముద్రణలు విశాలాంధ్ర ప్రచురణల ద్వారా రమారమి ఇరవై సార్లు జరిగాయి. అందుచేత ఇప్పుడు కొత్తగా ఈ లండన్ ముద్రణ యెందుకని నేననుకున్నాను. దీనికి శ్రీ పురిపండావారు చెప్పిన కారణం ఇది: "మహాప్రస్థానం ఈ శతాబ్దంలో తెలుగులో వచ్చిన ఏకైక మహాకావ్యం." ఆయనింకా ఇలా అన్నారు. : "నాకు తెలిసినంతమట్టుకు మరే భారతీయ భాషలోనూ 'కవితా ! ఓ కవితా !' అంత గొప్పగీతం రాలే"దని. ఈ ప్రచురణకు మరో ముఖ్య కారణం ఉంది. ఇది నా సొంత దస్తూరీ. సొంత గొంతుక. కవితా ప్రకాశనంలో ఏ భాషలోనూ, ఎప్పుడూ, ఎక్కడా కనీ వినీ ఎరగని కొత్త పద్ధతి ఇది !

... ...

"మహాప్రస్థానం" గీతాలన్నీ 30 లలో రాశాను. ("నిజంగానే", "గర్జించు రష్యా !" 41లో, "సిడలు" 47లో రాశాను.) 30 నుంచి 40 దాకా సాగిన దశాబ్దాన్ని చరిత్రకారులు Hungry Thirties అంటారు. అప్పుడే అమెరికాలో ప్రారంభమైన ఆర్థిక మాంద్యం ప్రపంచమంతటా వ్యాపించింది. (ఒక్క సామ్యవాద రష్యాలో తప్ప.) ఆ దశాబ్దంలోనే రెండవ ప్రపంచ యుద్ధానికి రిహార్సల్సుగా స్పెయిన్ అంతర్యుద్ధం సాగింది. ఆడెన్, స్పెండర్, డేలూయిస్, డిలాన్ థామస్, జార్జి బార్కర్ మొదలైనవారు గొప్ప రచనలు చేసింది ఆ కాలంలోనే. ఇండియన్ ప్రొగ్రెసివ్ రైటర్స్ మానిఫెస్టో అప్పుడే ఇంగ్లాండు నుంచి వెలువడింది. ఇన్నియిన్ని ప్రవాహాల మధ్య నా మహాప్రస్థాన గీతాలు కూడా ప్రహించాయి.

ఈ వాస్తవాలన్నింటికీ నేను స్పందించినా, ఇలాంటి రచనలను "సామాజిక వాస్తవికత" అంటారనీ, దీనికి వెనుక దన్నుగా "మార్క్సిజం" అనే దార్శనికత ఒకటి వుందనీ అప్పటికి నాకు తెలియదు. ఇప్పుడొక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే, మహాప్రస్థాన గీతాలలోని మార్క్సిస్టు స్ఫూర్తీ సామాజిక స్పృహా యాదృచ్ఛికాలు కావని స్పష్టంగా తెలుస్తోంది.

ఒకటి మాత్రం నిశ్చయం. 1933లో "నేను సైతం ప్రపంచాగ్నికి" ఇత్యాదీ గీతంతో ప్రారంభించి కడసారిగా గ్రాంథిక శైలికీ, గణబద్ధ ఛ్ఛందస్సులకీ గుడ్‌బై కొట్టేశాను. ఇదే గురజాడ అడుగుజాడ. అంతవరకు సుమారు వెయ్యేళ్ళు అవ్యాహతంగా సాగుతూ నలిగిన క్లాసికల్ బండి దారినుంచి గురజాడ తెలుగు కవిత్వానికి ఒక కొత్త మలుపు ఇచ్చాడు. రథాలూ, పల్లకీలూ, గుర్రబ్బళ్ళూ వెళ్ళే దారిని తప్పించి, మోటార్లూ, రైలుబళ్ళూ తిరిగే ఆధునిక యుగానికి తెలుగు కవిత్వాన్ని మళ్ళించాడు. గురజాడ చూపించిన మలుపును నేను మహాప్రస్థాన గీతాలతో మరింత వెడల్పు చేశాను.

ఇది టెక్నిక్‌కు సంబంధించింది. గ్రాంథికంలో రాసే వృత్తాలు రథాల్లాంటివి. పల్లకీల్లాంటివి. గురజాడ వాడుక భాషలో రాయమన్నాడు. మాత్రాఛ్ఛందస్సులను వాడమన్నాడు. నేనందుకే ఉత్సాహంతో, ఉద్రేకంతో ఉద్యమించాను. ఇక విషయంలోకి వస్తే, అందమైన అబద్ధాలలోకన్నా, నిష్ఠురమైన నిజంలోనే మంచి కవిత్వం దర్శనీయమవుతుందని విశ్వసించాను. దీనితో మహాప్రస్థాన గీతాలలో సామాజిక వాస్తవికతకు దర్పణం పట్టడం జరిగింది.

దీని తర్వాత మెట్టు సామ్యవాద వాస్తవికత. దీన్నింకా మనం అందుకోలేదు. అందుకోకుండా పెట్టుబడిదారీ గుంట నక్కలు పెద్దపెద్ద కుట్రలే చేస్తున్నాయి. అందుకు మద్దత్తుగా సాహిత్యంలో క్లాసిసిజం నిలబడింది.

Classicism గురించి Herbert Read ఇలా అన్నాడు. "Classicism let it be said without further preface, represents for us now, and has always represented, the forces of oppression. Classicism is the intellectual counter part of political tyranny. It was so in the ancient world and in the medieval empires; it was renewed to express the dictatorships of the Renaissance and has ever been the official creed of Capitalism."

క్లాసిసిజంతో బాటు జాతీయ దురహంకారము కూడా అభ్యుదయ నిరోధక మైనదే. దీనికి అంతర్జాతీయ దృక్పథమే విరుగుడు. "చీనాలో రిక్షవాలా, చెక్ దేశపు గని పని మనిషీ" అంటూ నేను అంతర్జాతీయ తత్వాన్నే ఆహ్వానించాను. బడుగు దేశాల వారు నా యిల్లు, నాదేశం అనుకుంటే అందులో అసంగుజసం ఏమీలేదు. కాని ఈ భావాలు మరీ ప్రకోపించి వెర్రితలలు వేస్తేనే ప్రమాదం. అప్పుడు నాయిల్లు, నాదేశం అంటే పొరుగింటిని కొల్లగొట్టడమూ, ఇతర దేశాలను దోచుకోవడమూ జరుగుతాయి. సునిశితమైన అంతర్జాతీయ దృష్టిలో ఈ దోపిడిని గుర్తు బట్టి తిప్పి కొట్టడంకంటె మరో మహత్తర కర్తవ్యం మంచి కవిత్వాని కుండబోదని నేనంటాను.

"మహాప్రస్థానం"లో నేను చేసిందంతా సామాజిక రుగ్మతను నిదానించడం మాత్రమే. "ఇదీ మన ప్రపంచం! ఇలా ఉన్నారు ఇచ్చటి ప్రజలు!" అన్నాన్నేను. ఇది సరైన రోగ నిదానమే కాని ఇంతటితో ఆగిపోకూడదు. జబ్బులకు తగ్గ మందు వెదకాలి. పైపై పూతలతో ఈ జబ్బులు కుదరవు. కావలసింది శస్త్రచికిత్స. దాన్నే "విప్లవం" అంటున్నాను.

"మహాప్రస్థానం"లో అభ్యుదయ కవిత్వమూ, విప్లవ బీజాలూ ఉన్నాయి. విప్లవ సాహిత్యం లేదు. "విప్లవ సాహిత్యం" అంటే ఏమిటి ? సామాన్య ప్రజానీకాన్ని విప్లవాచరణ కుద్యుక్తుల్ని చేసే విధంగా సాగేదే!

శ్రీ శ్రీ

(విదేశాంధ్ర ప్రచురణలు, లండన్ "మహాప్రస్థానం"లో రాసిన 'నామాట' నుంచి కొన్ని భాగాలు)



కరువు

కప్పతల్లి కప్పతల్లి కడివెడే నీళ్ళు ॥
ముంతెడు ముంతెడు ముంతెడే నీళ్ళు ॥
దొప్పెడు దొప్పెడు దొప్పెడే నీళ్ళు ॥
చిట్టెడు చిట్టెడు చిట్టెడే నీళ్ళు ॥

నాగళ్ళకు పోయినోళ్ళు నరుక్క చచ్చిరి
వానదేవుడా వర్ష దేవుడా
గుంటుకలకు పోయినోళ్ళు గుద్దుక చచ్చిరి ,, ,,
మోటలకు పోయినోళ్ళు మొత్తుక చచ్చిరి ,, ,,

బీరాయి పువ్వులోలె చిందెలెండిపాయె ,, ,,
శనక్కాయ పువ్వులోలె చెలిమిలెండిపాయె ,, ,,
ఆనిగెకాయ పువ్వులోలె అలుగులెండిపాయె ,, ,,
కట్లాయి పువ్వులోలె కడవలెండిపాయె ,, ,,

(ఒక జానపద గీతం నుంచి)

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

140 మాసపత్రిక జూన్ 1983

ముఖచిత్రం :

ఆంధ్రప్రదేశ్ రైతుకూలీసంఘం మహాసభలు, మే 22, 23, కరీంనగర్

నిర్వహణ :

'సాహితీ మిత్రులు'

సంవత్సర చందా రు. 20 ఈ సంచిక రు. 3

ఎవరి నుండి స్వాతంత్ర్యం?

ఫ్రెంచివిప్లవం చివరిరోజులలో ఓ పెద్దమనిషి "భావాలకు వ్యతిరేకంగా సైన్యాలను పంపడం శుద్ధ నిష్ప్రయోజనం" అన్నాట్ట. ఏ భావాలకు వ్యతిరేకంగా దాడి చేసిన ఏ సైన్యాలను గురించి ఈ మాటన్నాడో తెలియదుగాని ఆయన ఓ గొప్ప చారిత్రక సూత్రాన్ని పరమ మామూలుగా చెప్పేశాడు. కాలం చెల్లిన సమాజంలో చెలరేగే తిరుగుబాటు, విప్లవభావాలే రాబోయే సమాజంలో భౌతికరూపాన్ని తీసుకుంటాయి. ఆ భౌతిక పునాదిని నివారించడం అసాధ్యమయినంత మేరకు ఈ భావాల్ని అణగదొక్కడం వ్యర్థమే. అందుకే ఆ ఫ్రెంచి విప్లవంలోనే బాస్టిల్ కారాగారాన్ని బద్దలుగొడుతూ చెలరేగిన రణన్నినాదాలలో భావప్రకటనా స్వాతంత్ర్యం కూడా ఒకటి. ఆధునిక యుగంలో పత్రికా స్వాతంత్ర్యం ఇందులో ప్రధానమైన భాగం. ఈ నినాదం తర్వాతకాలంలో అనేకఖండాలలో, అనేకదేశాలలో, అనేకానేక విప్లవాలలో, ఉద్యమాలలో ప్రతిధ్వనించింది. మనదేశంలోనే చూస్తే ఎప్పుడో ఈస్టిండియా కంపెనీకాలంలో 1780లో బెంగాల్ గెజిటీర్ అనే మొట్టమొదటి భారతీయ పత్రికను ప్రచురించిన ఇంగ్లీషువాణ్ణి వాళ్ళేజైల్లోపెట్టి పత్రికను నిషేధించినప్పటినుంచి 1947 దాకా భావ ప్రకటనా స్వాతంత్ర్యం ఏదో ఒక రూపంలో ఉద్యమ నినాదంగా కొనసాగింది. అయితే ఫ్రెంచి విప్లవంలో అధికారంలోకి వచ్చిన వర్గాలు దశాబ్దం తిరక్కుండానే పత్రికలపై సెన్సార్‌షిప్ విధిస్తే, 1947లో అధికారంలో కొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగంలో రాసిన నామమాత్ర ప్రాథమిక హక్కులలో కూడ 'పత్రికా స్వాతంత్ర్యం' చేర్చకుండా జాగ్రత్త పడింది.

ప్రాథమిక హక్కుల సంగతటుంచి పత్రికా స్వాతంత్ర్యం పైనే పరిమితులు విధిస్తూ 1948 తర్వాత ప్రభుత్వం అనేకానేక చట్టాలను తయారుచేసి పెట్టుకుంటూ వస్తోంది. ఏ చట్టం, ఎవరికి వ్యతిరేకంగా ఎప్పుడు ఉపయోగించబడుతుందో అని ప్రచురణకర్తలు, పాత్రికేయులు భయపడుతుంటారు గాని, ప్రభుత్వ స్వభావాన్ని అర్థం చేసుకున్న వాళ్ళకి అందులో సందేహం ఏమీలేదు. ఆ మాటకొస్తే ఇన్ని చట్టాలు, పరిమితులు, నిబంధనలు ఉన్నాయన్న విషయం కూడా పత్రికల వాళ్ళకి స్పృహలేదు. అత్యవసర పరిస్థితి వచ్చి మొత్తం పత్రికా ప్రపంచాన్ని ఈస్థితి నుంచి ఒక కుదుపు కుదిపింది. చట్టవిరుద్ధ చర్యల సంగతటుంచి, చట్టబద్ధంగా తమను ఇంతగా బందిఖానాలో ఇరికించ వచ్చునన్న విషయం వాళ్ళకి నెమ్మదిగా అర్థమయింది. ఇటీవలి కాలంలో బీహార్ ప్రెస్‌బిల్ గురించి దేశ వ్యాప్తంగా పాత్రికేయులు కలిసికట్టుగా సంఘర్షించి

చెప్పుకోదగ్గ విజయాన్ని సాధించారు. పత్రికా స్వాతంత్ర్యం గురించి చైతన్యం పెరిగింది. అయితే ఈ చైతన్యం విషయాల్ని గందరగోళపరచకుండా పోలేదు.

ప్రయోజకులందరూ ఐదేళ్ళకోసారి ప్రకటించే అభీష్టంతో అధికారంలోకి వచ్చానని చెప్పుకునే మన ప్రభుత్వాలకి పాలకవర్గాల నుంచి తమ "సర్వస్వతంత్రను"ను పదేపదే ప్రజలకు రుజువు చేసుకోవాల్సిన అవసరం ఒకటేర్పడింది. ప్రజలందరూ తమదిగా విశ్వసించే ప్రభుత్వం ఒకటి అధికార నిర్వహణ చేయడం పాలక వర్గాలకు కూడ అవసరమే. ఈ పరస్పర ప్రయోజనాల పొగలమాటున పత్రికా స్వతంత్ర్యం చిక్కబడిపోయింది.

మనకు సమాచారాన్ని, సాహిత్యాన్ని అందించే క్రమంలో పత్రికలు వాటి యజమానులకు లాభాన్ని కూడ సృష్టించి ఇస్తాయి. (నిజం చెప్పాలంటే వాళ్ళకు లాభాన్ని సృష్టించి ఇచ్చే క్రమంలోనే మనకు సమాచారాన్ని అందజేస్తాయి!). మన దేశంలో 47 శాతం పత్రికలు తొమ్మిది వ్యాపార కుటుంబాల యాజమాన్యంలో ప్రచురితమవుతున్నాయి. ఈ పత్రికలకి అప్పుడు అధికారంలో ఉండే పార్టీ తాత్కాలిక రాజకీయ ప్రయోజనాలకంటె దీర్ఘకాలిక పెట్టుబడి ప్రయోజనాలే ముఖ్యం. ఈ రెండింటికి మధ్య చిలిపి తగాదాలు వచ్చినప్పుడల్లా, అవి విజృంభించి పత్రికా స్వాతంత్ర్యం గురించి ఆందోళన చేస్తుంటాయి. మొత్తంగా పత్రికాప్రపంచం ప్రభుత్వాలనుంచి కోరుకొనే సాత్వంత్ర్యం ఈ ఆందోళనతో కనబడకుండా కలిసిపోయి అనవసరమయిన గందరగోళానికి దారి తీస్తుంది. ఈ 47శాతం కాక మరో 20శాతం పత్రికలు ప్రాంతీయ వ్యాపారగృహాల అధ్వర్యంలో ప్రచురితమవుతున్నాయి. పెద్దింటి ఇంగ్లీషు పత్రికలలో మన కళ్ళని మాయచేసే, 'స్వతంత్రత' ఈప్రాంతీయ పత్రికలలో మనం కళ్ళుపొడుచుకున్నా కనుపించదనుకోండి. అది వేరేసంగతి.

తెలుగులో 'అనన్య సామాన్య ప్రచారం' గల పత్రికలను చూడండి. మనకు ప్రధానంగా మూడు వ్యాపార గృహాలున్నాయి. ఆంధ్రప్రభ గ్రూపు (మూడు ఎడిషన్ల దినపత్రిక, ఒక వారపత్రిక) దేశవ్యాపిత గ్రూపుకు చెందింది. ఈనాడు గ్రూపు (నాలుగు ఎడిషన్ల దినపత్రిక, మూడు మాసపత్రికలు, ఒక సినీపత్రిక), ఆంధ్రజ్యోతి గ్రూపు (దిన, వార, సినీ, బాల, వనితా పత్రికలు ఒక్కొక్కటి) రెండు ప్రాంతీయ వ్యాపారగృహాలకుచెందినవి. ఇందులో ఈనాడు యాజమాన్యానికి పత్రికలేకాక చిట్‌ఫండ్ కంపెనీ, అడ్వర్టయిజ్‌మెంట కంపెనీ, ప్రచురణకంపెనీ, హోటళ్ళు...

యాజమాన్యానికి చక్కెర ఫ్యాక్టరీలు, పొగాకు కంపెనీల్లో వాటాలు, సినిమా డిస్ట్రి బ్యూషన్‌కంపెనీ వగైరాలున్నాయి. కాక ఈనాడు యజమాని పరోక్షంగాను, ఆంధ్ర జ్యోతి యజమాని ప్రత్యక్షంగాను రాజకీయాల్లో ప్రముఖపాత్ర నిర్వహిస్తుంటారు.

ఈ 67శాతం పత్రికలలో పాత్రికేయులనుంచి కంపోజిటర్లదాకా వేలాది మంది జీతగాళ్ళు పనిచేస్తుంటారు. ఇందులో ఎక్కువమంది పాత్రికేయులకి స్వాతం త్ర్యంతో పెద్దపనిలేదు. తాము అలవరచుకున్న జీవితపు అలవాట్లలో, సాంఘిక విలు వలలో, రాజకీయ విశ్వాసాలలో వీళ్ళలో అత్యధికభాగం అసంకల్పితంగానే యాజ మాన్యపు భావజాలానికే చెంది ఉంటారు. వాళ్ళప్రతిభ, పనితనం లాభాలకు అవసరం. అయితే ఇందులో కొందరు ఈ విషయం గుర్తించిన చైతన్యవంతులయిన పాత్రి కేయులు కూడ ఉంటారు. అదుగో, వాళ్ళు తమ మేధస్సుని స్వతంత్రంగా ఉపయోగి స్తేనే పత్రికాస్వాతంత్ర్యం వేరు, పాత్రికేయస్వాతంత్ర్యం వేరు అన్న విషయంస్ఫురి స్తుంది.

ఈ జీతగాళ్ళందరి మీద పెద్ద జీతగాడు "ఎడిటర్ అనేవాడు." ఈ సంపా దకుడికి మొత్తం పత్రికారంగంలో విచిత్రమైన ప్రాముఖ్యత ఉంది. వ్యక్తిగా తనకున్నప్రతిభ, ప్రాచుర్యంతోనే వాడు సాధారణంగా సంపాదకుడవుతాడు. అంత స్తులను ఆరాధించే సామాజిక విలువలు 'వ్యక్తి' కి లేని ప్రాధాన్యతనిచ్చి ఈ రకం నిర్వహణకు మరింత బలాన్నిస్తాయికూడా. ఆ ప్రాముఖ్యత పునాదిమీదే ఈ సంపాద కుడు అప్పుడప్పుడు యాజమాన్యంతో తగువులు పెట్టుకుంటాడు. (కొంతమంది తమ విశ్వాసాలకోసం నిజమయిన సంఘర్షణ చేసేవాళ్ళుంటారుగాని మనదేశంలో పెద్దపత్రి కలలో ఇందుకు ఉదాహరణలు తక్కువే.) ఈ సంపాదకుడి మనసును మూడు గుర్రాలు లాగుతుంటాయి. యాజమాన్యపు వ్యాపార ప్రయోజనాల్ని రక్షిస్తూనే తన జీతమూ భద్రతా రక్షించుకోవాలనేకోరిక, వ్యక్తిగా తన ప్రాముఖ్యత క్షణక్షణంపెంచి పోషించే అహం, సమాజంమీద, సాహిత్యంమీద తనకున్న దృక్పథం. క్రమక్రమంగా ఏరకం సాహిత్యం లాభాల్ని సృష్టించగలవో, ఆరకం సాహిత్యాన్నే తన అభిరుచిచేసు కొని, అందులో తన అహాన్ని ప్రతిష్టించుకొని రెండుగుర్రాల బెడద వదిలించు కుంటాడు. ఆ తర్వాత తనకిందపనిచేసే జీతగాళ్ళలో ఎవరయినా తమమేధస్సుని స్వంతంగా, స్వతంత్రంగా ఉపయోగిస్తే వాడి అహం, అభిరుచి రెండూదెబ్బతింటాయి. సాధారణంగా ఈ జీతగాళ్ళ స్వాతంత్ర్యం యజమాని వ్యాపార ప్రయోజనాలకి కూడా

—[కొరవ 80వ పేజీలో]

స్మృతిగీతం

రుద్రజ్వాల

అమరుడ ఓ కాకుమాను
అరుణారుణ దండమో !
అన్న వెంకటేశ్వరుడా
అనుగుతమ్ముల దండమో !
అనుగుతమ్ముల దండము
నీఅడుగడుగై పున్నము ॥అమ॥

తెల్లదొరలపైకి పిడి
బాకుబల్లెమైలేచీ,
పండనిభూమిపన్నుపై
కొండపులిగ గర్జించీ,
పశులమేత పుల్లరీ
పిడుగులాగ ఎదిరించీ,
వృత్తులవారి వెట్టిపై
ప్రజలదండు నడిపించీ,
తెలంగాణ పోరుజెండ
కొడవలికత్తై మెరిసి
వెంకటగిరి జమీందార్ల
వజవజ వణికించితివా ॥అమ॥

పెదిర్లిపాడు పొత్తిళ్లలో
పొడిచిన సూరీడువై,
చింతగుంపల్లెపల్లె
చేతివేళ్ళ పిడికిలై,
వెలతుర్లవారి పల్లెప్రజల
పలుగు, పారవేటువై,
విఠలాపురి రైతుకూలి
కాడి, మేడి, కర్రవై
వేపగుంటపల్లెలో
ఎగసిన ఏతాపువై
శిస్తుదోచు జమీసేన
చిత్తుచిత్తు జేస్తివా ॥అమ॥

జమీందారి రద్దుచట్టం
జాతరనే భేదించీ,
శంకరమ్మ చెరువునేల
సేద్యమందరికిపంచీ,
కాంగిరేసు నల్లదొరల
కట్టడికసి పనికట్టీ,
కమ్యూనిస్టు పార్టీపిలుపు
కసులంతా నింపుకోని
అజ్ఞాతంలోగూడ
అగ్గిగుండమైమండీ.
భూస్వాముల, పోలీసుల
పక్కలో బాంబువైతివా ॥అమ॥

విద్రోహంపట్టిస్తే
వెన్నువిరిగికూలకా,
పామూర్ పోలీస్‌స్టేషన్లో
బంధించిన బెదరకా,
పచ్చిపుండుగాగొట్టిన
ప్రజలబాటదాటకా,
నేరేడుబల్లి నినుగాల్చిన
పర్గనినదమాపకా,
నింగినేల, కడలి, నదులు
నీరక్తం పాకగా.
నీఊపిరి ఎర్రజెండ
దేశమంతట పరచితివా ॥అమ॥

రక్తనాళప్రవాహం

కె. రాంమోహన్ రాజు

వేలవేల ఉత్తరాలు చిరునామా
కోల్పోయి మూగవిషాదంలో
మునిగిపోయాయి
గడ్డకట్టిన సముద్రంలో చేపల్లా
చూపులు ఒకేచోట ఇరుక్కుపోయాయి

వేయితలల పామూ
వ్యాపారపు కొండచిలువా
కలిసి మెలిసి
దిక్కులేని వాళ్లకోసం
దిక్కుచూపుతున్న వాళ్లన్న దిక్కును
కదుముతున్నై - కరుస్తున్నై

కొవ్వొత్తి కాలుతోంది
దీపాలు ఆరుతున్నై
చుక్కలు వెలుగుతున్నై
నీలోకపు కిటికీ కన్నులు
నిద్రాదేవత గూళ్లకావు
నీరూ నెత్తురూ ఉబికే
వేడినీటి బుగ్గలు

నీవడిగే ప్రశ్నలన్నీ
నీ హృదయపు చింతనిప్ప
లో రేగిన సన్నని జ్వాలలు
గా క్రమిస్తున్నవి
చుట్టూ వెచ్చగా స్నేహంలా
వ్యాపిస్తున్నవి
వెలుగుల దర్వాజా తెరుచుకుని
ఆఖరు చీకటి గొంతుపై అడుగువేసి
నిద్రాసీల సరస్సును ఈదమని
నిశ్శబ్దపు కుటీరం దాటిరమ్మని
పిలుపొక గర్జనగా
అర్థం ఒక మెరుపుగా సాగుతున్నవి

ఖండాలు ఖండాలుగా కాల్చేసినా
తండాలు తండాలుగా పునర్జన్మిస్తున్నవి
మరిచిపోవడానికిది సారామత్తు కాదు
వికసిత విస్ఫోట ఫిరంగాలు!

* * * *

అస్తమయం నుంచి ఉదయం
ప్రతిఓటమి నుంచీ చిటికెడు జీవచింత

మోటబావి వూటలో
నీనడకే పొంగగా
మోటబావి యింజన్లో
నీమాటే మోగగా,
తైదపైరు తలల్లో
నీతలపే తూగగా,

నేలనేల సాయుధమై
నీమార్గం నిలుపగా,
నీధ్యేయం ప్రజారాజ్యం
ప్రతిహింపై సాగగా....
నినుజంపిన యీవ్యవస్థ
నీసిద్దై కూల్చేస్తాం ॥అమ॥

(కనిగిరి తాలూకా, పెదిర్లిపాడులో జన్మించి తెలంగాణ పోరాటంలో అసువులర్పించి, అమరుడైన కా॥ కాకుమను వెంకటేశ్వర్లు స్మారకస్థూప నిర్మాణ సమయంలో)

కాళ్ల క్యాంపస్‌ల నుంచి
కాలువగట్లమీదికి నడిచాయి
వెనక ఖాకీటోపీ ధరించిన
అడ్మినిస్ట్రేషన్ బిల్డింగులు
భీకరంగా నవ్వాయి

తీగలమధ్య ప్రవహించే శబ్దాలు
చెవిలో రహస్యాలు
హోరునవీచిన ఈదురుగాలికి
టెలిగ్రాఫ్ స్తంభం వణికి
వార్తాప్రసారం ఆగిపోయింది
వీధిదీపాలు గూఢచారి కళ్లు
చెట్లగుబుర్లు చూడనివ్వటం లేదు
నీలంలైటుకొమ్ము ధరించిన
జీపుకి దారితెలీక చతికిలబడింది
బానెట్‌మీది అక్షరాలు పళ్లికిలించాయి
నయాగరా వేగం హార్స్‌పవర్‌కీ
పశుబలానికీ అందదు

విజిల్సుమోగి బూట్లుదద్దరిల్లితే
ఊరు కడుపులో విత్తనాల్ని దాచుకుంది
సారా సర్కారుల విస్కీతాగి
ఎర్రిబెట్టె దొర్లలకు విగించిన వాళ్లు
ఊహల అచ్చుయంత్రంలో
తోచిన కథలుపండి విరిసితే
అద్దాలగదులు గాకఅటవై చిల్లల గుడిసెలు
అదరిస్తాయా - ఆలకిస్తాయా!

ఏది రక్తనాళ ప్రవాహవేగమో
ఏది అద్దంలో బింబంలా
చూపిస్తున్నదో అది ప్రేరణ.
ఏది జీవితనదీ లోయల పాయలుగా
ప్రవహిస్తున్నదో అది సంకేతం.
అది గుండెల చలిపొద్దుల
పొడిచిన రోషపు కవిత

1983 జులై సంచిక

చెరబండరాజు సంస్మరణ

సృజనగా వెలువడుతుంది

చెరబండరాజు ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని జులై సృజన ఆయన వ్యక్తిత్వ, జీవిత, సాహిత్య, సాంస్కృతిక సమాలోచనగా, జ్ఞాపకంగా, సంస్మరణగా వెలువడుతుంది. నక్సల్బరీ సాంస్కృతికోద్యమానికి, విరసం సాహిత్యోద్యమానికి ప్రతినిధిగా పదిహేనుసంవత్సరాలు పోరాడినయోధుడు కామ్రేడ్ చెరబండరాజు. ఆయనతోగానీ, ఆయన సాహిత్య, సాంస్కృతికోద్యమాలతోగానీ పరిచయమున్న ఎవరైనా తామెంచుకున్న అంశంపై రాసి త్వరగా పంపవలసిందిగా కోరుతున్నాం.

— 'సాహితీ మిత్రులు'

చర్చావ్యాసం :

యజ్ఞం

గరికిపాటి నిరంజనరావు

యజ్ఞం : సవిమర్శలు :

'యజ్ఞం' కథ నడిపినపద్ధతి, ఒకటి రెండుచోట్ల పాత్రీలచిత్రీణా, సంభాషణలూ, ముఖ్యంగా ముగింపూ కొన్నిసరియైన కారణాలవల్లే విమర్శకు గురిఅయ్యాయి అయినా, రంగనాయకమ్మగారు భావించినట్లుగాక విమర్శకన్నా మెప్పునే ఎక్కువ పొందాల్సిన కథయజ్ఞం, పొందిందికూడా. రంగనాయకమ్మగారు చేసిన విమర్శనాంశాలు కొన్ని న్యాయంగానూ చాలవరకు అసమర్థనీయంగానూవున్నాయి. రంగనాయకమ్మగారేగాక, కా.రా.ని అభిమానించే వ్యాసకర్తలుగూడా యజ్ఞంమీద, కొన్ని విమర్శలు చేశారు. ఈ విమర్శల గూర్చి ముందు ప్రస్తావిస్తాను.

(i) కా.రా. గురించి కె.వి. రమణారెడ్డిగారిలా అంటారు: "ఆయనథయస్థుడు పరిష్కారాలన్నీ తెలిసీ.... స్పష్టంగా వాచ్యంగా దేన్నీచూపరని నావుద్దేశం.... హృదయం నిర్దేశించిన తెన్నున మెదణ్ణి చప్పునవడపరు....మార్పుని గురించి తీర్పుచెప్పరు. అట్లనిదాన్ని మనకీవదలరు.... లోపలతపన, మధ్య సంఘర్షణ దాచిపెట్టుకున్న సముద్రీంలా గంభీరంగా కన్పిస్తారు. ఆయన మనస్సులో అంతర్యుద్ధంసాగుతూనే వున్నట్టనిపిస్తుంది" (కథాయజ్ఞం పేజీలు 60-61). ఇందులో ప్రశంసావిమర్శ రెండూ జోడింపబడ్డాయి బహుశ ఈవిమర్శ ఇతర కథలకంటే యజ్ఞానికే ఎక్కువ వర్తిస్తుంది.

(ii) రంగనాయకమ్మగారన్నట్లు ఒక నవలగా చిత్రీంచవలసిన స్వభావంగల "వస్తువు"ని (యజ్ఞం) కథలో యిమడ్చటంవల్ల చాలా (?) విషయాలు అస్పష్టంగా అయిపోయాయి" (కథా యజ్ఞం పే. 136) ఇదిచాలా న్యాయమైన విమర్శ. కొన్ని కీలకమైనచోట్ల కా.రా పాఠకుల ఆలోచనకి, వూహలకి విషయాన్ని వదిలేశారు. ఉదాహరణకి అప్పలాౣముడి అప్పుగురించి, గోపన్న లాంటి చిన్నవ్యాపారుల ఆర్థిక పతనంగురించి, షావుకార్లకీ పేదరైతుల భూములకీ మధ్యవున్న (చట్టపరమైన సంబంధం) గురించి కొంత వివరణయిస్తే బాగుండేది. అలాగే సుందరపాలెంలో భూమికౌలు వుండాలేదా అనేది పాఠకులు అన్వయించుకోవడం మీద ఆధారపడి వుంటుంది. దీనిగురించి తర్వాత వ్రాస్తాను.

శ్రీపతిగారన్నట్లు, "కథకున్న పరిధి చాలపరిమితం. జీవితాన్ని వడపోసి సంఘర్షణ భాగాన్ని మాత్రమే తీసుకున్నారు. దాంతో జీవితం ఫేడౌట్ అయింది. కథంతా ఒకరాగానికే పరిమితమైపోయింది" (కథాయజ్ఞం పే. 80).

(iii) మరో విమర్శ కూడావుంది. సూరపరాజు రాధాకృష్ణమూర్తిగా రంటారు. "సమాజదౌష్ట్యంపై వెలుగునుగుప్పించీ దాన్ని స్పష్టంగా చూపడంకోసం కా. రా. ఎక్కువగా తన పాత్రల్ని అన్నివర్గాలవారిని ఆదర్శమూర్తులుగా, తప్పుపట్టలేనివారుగా చూపిస్తాడు.... అయితే యీ మంచితనం పెంచిన పాత్రలు ఒక్కచోట అసహజంగా తోస్తాయి. "యజ్ఞం"లో సీతారాముడు తనని చంపవచ్చే ఊరిపెద్దలతో చంప వద్దంటాడు. ఎందుకు? ప్రాణంమీద ప్రేమతో కాదు. "నాకు సావో నెక్కకాదు నన్నుకొడితే మీరు ఉరిలోపడతారు. మీ బిడ్డపాపల వుసురు నాకేలతగలాల?" అంటాడు అట్లాగే అప్పలాముడి అమాయకత్వమూ దొంగముసుగులా కనిపిస్తుంది" (కథా యజ్ఞం పే. 13). అంతేగాక దాదాపు ఉన్మాదస్థితి నుండి సీతారాముడు అంతత్వరిగా సాధారణ మానసికస్థితికి రావడం ఎబ్బెట్టుగావుంది.

(iv) అలాగే ఎర్రియ్యచుట్టం పైనెక్కుతున్నంచోవచ్చే అదృశ్యశక్తినిగూర్చి మాట్లాడుతున్నప్పుడు పాత్రలకిమించిన అవగాహన వుందేమోననీ సందేహం రంగనాయకమ్మగారికే గాక మిగతావారికికూడా కల్గుతుంది. అయితే యిటువంటి సందర్భాలుతక్కువ. రంగనాయకమ్మగారు తన రెండవవ్యాసంలో 75 పేజీల సుదీర్ఘమైన విమర్శ యజ్ఞంమీదచేశారు. తన మొదటివ్యాసంలో అంశాలని విపులీక రించి కొన్ని కొత్త అంశాలుకూడా లేవనెత్తారు. కొంతమంది స'మర్థకులలాగానే, రంగనాయకమ్మగారుకూడా, యజ్ఞంకథలోని ప్రధానచోదకశక్తి (Prime-mover) నీ దానియొక్క చారిత్రిక ప్రాముఖ్యతనీ, శ్రీరాములునాయుడులాంటి ముఖ్యమైన పాత్రల తాత్వికతని అవగాహనచేసుకోవడంలో పొరపడ్డారేమోనని తోస్తుంది. నా విమర్శ ఒక్క రంగనాయకమ్మగారు వ్యాసాలకేగాక కొంతమంది సమర్థకుల అభి ప్రాయాలకుగూడ వర్తిస్తుంది. అయినా చర్చాసదుపాయాలకోసం, రంగనాయకమ్మ గారు రూపొందించిన నాలుగు విమర్శనాంశాల పరిధినే తీసికొందాం. ఆ అంశాలు యివి :

(1) గ్రామాలపరిస్థితి

(2) శ్రీరాములు నాయుడిపాత్ర స్వభావం

(3) అప్పలాగ్రాముడి అప్పుస్వభావం

(4) కథముగింపు

1) గ్రామాలపరిస్థితి : ఈ అంశాలమీద రంగనాయకమ్మగారి ప్రశ్నలిలా వున్నాయి.

(i) యజ్ఞం ఒక్క సుందరపాలెంలోనే ఎలా సాధ్యమయింది ? సుందరపాలేనికివచ్చిన నాగరికత చుట్టుపక్కల వూళ్ళకు ఎందుకుచేరలేదు ? ఇక్కడి షావుకార్లకీ, కామందులకీ అవసరమైనమార్పులు అక్కడివారికి అవసరంలేదా ?

(ii) "శానాకాలంవరకూ ఖూనీలులే"నంత పెద్దమార్పు సుందరపాలెంలో ఎలాసాధ్యమయింది ?

(iii) "గ్రామంలో పేదహరిజనలపై జరిగేహత్యలకీ అత్యాచారాలకీ మానభంగాలకీ ఫ్యూడల్ దోపిడీయే కారణమని చెప్పుకుంటున్నాం ఇప్పటిదాకా. శ్రీరాములు వచ్చి ఆ ఫ్యూడల్ దోపిడీని అరికట్టగలిగాడా ? అంతంచేయగలిగాడా ? మరి ఆ వూళ్ళో అంతకుపూర్వం జరిగేదౌర్జన్యాల్ని ఎలా ఆపగలిగాడు ? ఈ కొత్త శాంతినీ ఐకమత్యాన్నీ ఎలా స్థాపించగలిగాడు ?" (2 వ్యాసాలు, పేజీలు 36-37)

(vi) "ఈవూళ్ళో మార్పులవల్ల పేదహరిజనలకేమీ లాభించకపోతే ఇతర వూళ్ళలో హరిజలు ఎందుకు ఈర్ష్యపడతారు ? ఇతరవూళ్ళలో హరిజలఅసూయే నిజమయితే ఈవూళ్ళో హరిజలకి ఏదోవుపయోగపడే మార్పులుజరిగాయని ఒప్పుకోవాలి. లేదా, యిక్కడ పేదలమేలుకోసం ఏమీ జరగనట్టయితే, యితర వూళ్ళలో హరిజల ఈర్ష్యాసూయల్ని వర్ణించడమైనా వదులుకోవాలి. ఏదో ఒకటి జరగాలి.... రెంటికీ చోటులేదు.... 'హరిజలు' 'హరిజలు' అనడమేగాని హరిజల సహజస్వభావం మీద సదభిప్రాయం లేకపోవడమే ఈ ఈర్ష్యని సృష్టించడం అంటే" (2వ్యాసాలు పేజీలు 37, 39).

పురోగతి - శాంతి :

మొదటి రెండు అంశాలనీ తీసుకుందాం. ముందుగా ఒకచిన్న వివరణ : యజ్ఞంవల్ల సుందరపాలానికి జరిగింది ఆర్థికపురోగతి (Economic growth) గాని ఆర్థికాభివృద్ధి (Economic Development) కాదు. రోడ్లవల్ల, ఎలక్ట్రిసిటీవల్ల, పంపులవల్ల, కోపరేటివ్ గోడవున్లవల్ల గ్రామాదాయమూ తత్ఫలితంగా తలసరి

ఆదాయమూ పెరిగివుండవచ్చు. అంటే ఆర్థికప్రగతి (Economic growth) జరిగిందన్నమాట. కాని అదే సమయంలో, ఆర్థికవ్యత్యాసాలు పెరిగాయి, నిరుద్యోగం పెరిగింది, కూలిజన పేదరైతాంగం అప్పులపాలయింది. రైతులు పేదరికం వైపు నెట్టబడడం జరిగింది, బలహీనవర్గాలు మరింత బలహీనమయ్యాయి. ఆర్థికప్రగతి యొక్క సత్ఫలితాలు అన్నివర్గాలకూ అందలేదు. అంటే గ్రామంలో ఆర్థికాభివృద్ధి జరగలేదు. ఇదీ యజ్ఞఫలం! ఈ యజ్ఞం సుందరపాలెంలో ఎలా సాధ్యమయిందనేది ప్రశ్న. ఈ యజ్ఞం జరిగింది స్వాతంత్ర్యానంతరం. ముఖ్యంగా 1950 తర్వాత శ్రీరాములు నాయుడు బి.యల్ చదువుమాని గ్రామసేవకని సుందరపాలెంలో ప్రవేశించటం నుండి యజ్ఞం ప్రారంభమయింది. ఈ యజ్ఞాన్ని అర్థంచేసికోవాలంటే యజ్ఞానికి పూర్వం అంటే 1950 ముందు- వాస్తవంగా 1910 నుండీ- సుందరపాలెంలోవున్న సాంఘిక ఆర్థికపరిస్థితుల్ని గమనించాలి. సుందరపాలెం యొక్క చరిత్రని ముఖ్యంగా నాలుగు భాగాలుగా విభజించవచ్చు: (i) 1910 నాటి పరిస్థితులు (ii) 1910-20 మధ్య వ్యాపారపు పంటలు రావడంతో ధరలు అనుకూలంగావుండి గ్రామంలో రైతులూ, షావుకార్లూ ఆర్థికంగా బాగుపడటం తర్వాత ఆర్థికపతనం ప్రారంభం కావడమూ. (iii) 1920-50 మధ్య ఆర్థికమాంద్యం (1929-32), రెండవ ప్రపంచయుద్ధం (1939-45) తెచ్చిన ధరల ఎగుడుదిగుళ్ళలో గ్రామంలోని వర్గాల/కులాల సాపేక్షస్థితి మారిపోయి అసమానతలు ఏర్పడటం (iv) 1950-1962 మధ్యవున్న యజ్ఞకాలం.

(i) కథ మొదట్లో : 1910 ప్రాంతాల్లో

అప్పల్రాముడి కథనం ప్రకారం, సుందరపాలెంలో జనాభాసంఖ్య దృష్ట్యా చూస్తే ప్రధానంగా నాలుగుకులాలవారున్నారు : మాలలు, సాలీలు గొల్లలు, కాపులు సాంఘిక రీత్యానేగాక ఆర్థికంగాకూడా ఈ నాలుగుకులాలవారిలోనూ తారతమ్యభేదాలున్నాయి. కొద్దిమందిని మినహాయించి మాలలకి మెట్టభూములుండేవి అప్పల్రాముడి తండ్రి చనిపోయేనాటికి ఆ వుమ్మడికుటుంబానికి 12 ఎకరాల పొలం వుండేది. అప్పల్రాముడి వంతు ఆరెకరాలొచ్చింది. అప్పల్రాముడంటాడు.

“బాబూ, అప్పుడీవూరెలా గుండేదో యిక్కడి బతుకెలాగుండేదో మీరెవ్వరెరుగరు. నాకు తెలిసినకాడికి అందరికీ ఇంతోఅంతో సెక్కాముక్కా వుండేవి. కాపోళ్ళంతా పొలాలుదున్నుకు బతికేవోరు. గొల్లోళ్ళు గొర్రెల్నీ మేకల్నీ కాసు

కుంటూ సిన్నసిన్న మొరకముక్కలు దున్నుకుబతికేవారు. మా మాలోళ్ళకి మెరక ముక్కలెక్కువ. పల్లాలుతక్కువ. మావోళ్ళల్లో ఎవళ్ళో మరీలేనోళ్ళు కంబార్లు గుండేవోరు. అంతింతోళ్ళు కూల్లుసేసుకుంటూ ఖూ(వులుదున్నుకుంటూ బతికేవోరు అప్పట్లో యీపూరు సాలోళ్ళకెవ్వరికీ జరుగుబాటుండేదికాదు. సీ(వసూలొచ్చాక ఆల మగ్గాలు మూలబడిపోయాయి, ఆలరాట్నాలు అటకలెక్కేసినాయి. ఆలుతిండీకి సానా కష్టపడేవోరు" (యజ్ఞం ఇతర కథలు పేజీలు 45, 46).

రైతులంతా వరి, గంటి, చోడి, జొన్న యిలాంటి తిండిగింజలు పండించేవారు "అందరికి తిండుండేది. గుడ్డముక్క లిస్సుండేదికాపు. కాని గోసిముక్క లుండేవి. కలిగినోళ్ళైనా పంచిట్టలు కట్టేవారుకారు. లావోతోలె(వో ఏదైనా మిగిలితే బంగారం కొని పిసరూపిప్పి సేయించి ఆడోళ్ళమెడకి తగిలించేవోరు.... ఆరోజుల్లో ఏ పెద్దనాయురాల్నిసూసినా, సిన్నసిన్నరైతుల ఆడంగుల్ని సూసినా, లచ్చుందేవుల్లా గుండేవోరు, మెడ తిరక్కుండా బంగారాలు, ఏ(పీలేకపోతె నానుపేట పట్టెడన్న మెడనుండేవి.... మా పేదోళ్ళ పెల్లాలుగూడ రెండేసి యీసెలు మూడేసి యీసెలు ఎండిమోసేవారు. అందెలు, కడియాలు, పందలు, మురుగులు, పోచీలు, దండ కడియాలు, బమిడీమువ్వలు పాయలమెలతాళ్ళు, పిల్లలమెలతాళ్ళు ఒడ్డానాలు ఒకటే ఒకటేవిటి ఎన్నోవుండేవి" (యజ్ఞం ఇతరకథలు, పే 47)

ఈ కథనంప్రకారం రైతుస్వామ్యం (Peasant propietor ship)కి దగ్గరగా వున్నస్థితిలో సుందరపాలెం వున్నట్లుతెలుతుంది. వర్గాలులేవు అనిచెప్పడానికి వీలు లేదుకాని, భూమిపరమైన ఆస్తులు (landed-assets) వ్యవసాయదారులందరి చేతుల్లోనూ వున్నాయి, అయితే ప్రబలంగావ్యవసాయం చేసేకులం (dominent cultivating caste) చేతుల్లో మాగాణిపొలాలూ, మిగతా వ్యవసాయదారులచేతుల్లో మెట్టపొలాలూవున్నాయి. మరి యీ ప్రబలంగా వ్యవసాయంచేసేకులం (dominant cultivating caste) (కాపుల)లో భూస్వాములు ("feudal lords") వున్నారా ? వున్నట్లులేరు. ఎందుకంటే అప్పలాప్రముడి కథనంప్రకారం "కాపోళ్ళంతా పొలాలు దున్నుకు బతికేవోరు". పోతే వ్యవసాయంచేయని సాలీలకి పొలాలున్నట్లులేదు. ఎందుకంటే వాళ్ళమగ్గాలు మూలపడగానే కష్టాలపాలయ్యారు. భూమివసతి వుండి వుంటే యింత "కష్టాలు" పడివుండేవాళ్ళు కాదుగదా. పోతే బ్రాహ్మల్లో కొంత మందికి భూమివుండివుంటుంది. ఆ పొలాల్లోమాత్రమే కౌలువుండివుంటుంది. మరి భూవసతిఏమీలేని కొద్దిమంది మాలలూ, భూమికొద్దిగానేవున్న సన్నకారురైతులూ

కూలిపనులకు పోతూవుండాలి. అయితే వారిసంఖ్య బహుతక్కువ అయివుండాలి. మొత్తంగాచూస్తే 1910 నాటి సుందరపాలెం సాంఘిక ఆర్థికస్థితిని భూస్వామ్యం ("feudalism") అనటానికి కథలో ఆధారాలు పెద్దగాలభించవు.

(ii) 1910 - 1920 మధ్యకాలం :

1910 ప్రాంతంలో సుందరపాలేనికి కొత్తగా పొగాకువ్యాపారమూ తర్వాత వ్యాపారపుపంటలూదిగుమతి అయ్యాయి. 'సావుకోర్లు ఆపంటలగురించి పెఱకినచ్చ చెప్పేటరు. పేదోళ్ళు బయపడ్డా పెద్దరైతులు యేసిసూద్దామన్నారు.'

అంతవరకు వస్తువుల అమ్మకంలో డబ్బుచెలామణీ తక్కువగావుండేది. గ్రామీణ ఆర్థికరంగంలో డబ్బుపాత్ర క్రమంగా అధికంకాసాగింది. ఆ లెక్కలు నిరక్షరాస్యులైన జనానికి తెలిసేవిగావు

"దినుసుమార్పిడిలో బోలెడు దగా జరిగిపోతుండేది.... యే దినుసయినా మాపమ్మబోతె రూపాయికైదుకుంచాలు మాంకొనబోతే మూడేకుంచాలు. అదేమాదిరి మాంకొనేటప్పుడు కుంచాలు సిన్నగుండేవి మాపమ్మే ఏలకిపెద్దవైపోయేవి"- అప్పలాస్వాముడు.

వస్తుమార్పిడిలో జరిగిన ఈమోసం మధ్యతరగతి, సన్నకారురైతుల పేదరికానికి (pauperisation) ప్రధమకారణం. బాగుపడింది షావుకార్లు.

"వూళ్ళోసాలీలు సగానికి సగంమంది సావుకోర్లయిపోనారు. మిగిలినోరు ఆరికాడపన్లు సేసుకుంటూ సిన్నసిన్న దుట్టాయాపారాలు సేసుకుంటూ కాలం గడిపేశేవోరు" రైతులు పేదవారుకావడంవల్ల ఈ సావుకార్లకీ భూమి సంక్రమించిందా? సుందరపాలెం లాంటి గ్రామాల ఆర్థికచరిత్రమీద పరిశోధనచేస్తేతప్ప ఈ ప్రశ్నకి జవాబు చెప్పలేం. ఎందుకంటే కథలో ఈ ప్రశ్నకి సమాధానం దొరకదు. అయితే సుందరపాలెం ప్రత్యేక పరిస్థితులగూర్చి కా.రా. కొంతభోగట్టా యిచ్చారు, అప్పలాస్వాముడి ద్వారా.

"ఆరోజుల్లో యీవూరు యిప్పట్లాగే పదిహేనూళ్ళకి సెంటరుగుండేది అయితే వున్నట్టు కనబడేదిగాదు మంగలాపురం, తాగుడుబిల్లి, ఎంకన్నపేట అగ్గరోరం, యిలా యీ యిన్నూళ్ళ వొర్తకపంటలూ యీవూళ్ళో సావుకార్ల దోరానే శెలామణీ అవుతుండేవి".

సెంటరుగా వుండేదీ అంటే, సుందరపాలెం చుట్టుపక్క గ్రామాలకంటే పెద్దదైవుండవచ్చు, తొలిగావ్యాపారాన్ని, వ్యాపారపుపంటల్నీ చేస్తున్న షావుకార్లు, మిగతావూరి షావుకార్లకంటే ఎక్కువ చొరవగానో పరపతిగలవారుగానో వుండి వుండచ్చు, లేదా గ్రాండ్‌ట్రింక్‌రోడ్డుకి దగ్గరలోవున్న మొదటి గ్రామం సుందరపాలెం అయివుండచ్చు. ఏకారణాలవల్లనైనా సుందరపాలెంలో మిగతాగ్రామాలకన్నా ఎక్కువ పురోగతి అవకాశాలు వున్నట్లు తెలుస్తుంది. అయితే ఈ గ్రోత్ - పొటెన్షియల్‌ని వుపయోగించుకొని పురోగతి సాగించడానికి శీఘ్రచోదకసాధనాలు అవసరం. ఈ ఏజెంట్సు వ్యక్తులుగావచ్చు, కొత్తపంటలుగావచ్చు, అంతర్గతనిర్మాణంగావచ్చు, లేదా కొత్తగావచ్చిన సాంకేతికనైపుణ్యంగావచ్చు.

1910-1920 మధ్యకాలంలో పరస్పరం దోహదంచేసికొన్న రెండురకాల ఏజెంట్సువున్నట్లు తెలుస్తుంది.

ఒకటి: కోస్తాఆంధ్ర (దక్షిణజిల్లాలు) అంతటా వ్యవసాయం వ్యాపారీకరణ జరుగుతున్న తరుణంలో ఆ అవకాశాలని పసిగట్టిన సుందరపాలెం షావుకార్లు/ వ్యాపారులు.

రెండు: కొత్తగా ప్రవేశపెట్టబడిన వ్యాపారపు పంటలు. మొదటి అంశం గూర్చిచూద్దాం:

18¨1-92 ఆప్రాంతంలో మద్రాస్‌ని - హౌరానికలుపుతూ రైలుమార్గం ఏర్పడింది. అయితే దానికిముందు మూడున్నర దశాబ్దాలనుండీ అంటే 1855 నుండీ గోదావరీ, కృష్ణా ఆనకట్టవల్ల డెల్టా తదితరప్రాంతాలలో వ్యవసాయ పురోగతిజరిగి ధాన్యపునిలవలు, ప్రత్తి, నూనెగింజలులాంటి వ్యాపారపుపంటల నిలవలు ఏర్పడుతున్నా కాకినాడ ఓడరేవు మినహాయించి ఆ నిలవల్ని దూరప్రాంతాలకి తరలించే రవాణా సదుపాయాలు అంతంతమాత్రంగా వుంటున్నతరుణంలో మధ్యకోస్తా ఆంధ్ర రైతులు, వ్యాపారులూ, వాణిజ్యసంస్థలు (కోకోనాడా చేంబర్ ఆఫ్ కామర్స్) రైలుమార్గంకొరకు పిటీషన్లమీద పిటీషన్లుపెట్టగా ఎట్టకేలకు చివరిదశాబ్దపు ప్రారంభంలో బ్రిటీష్‌ప్రభుత్వం ఈ రైలుమార్గాన్ని ఏర్పరచింది. రైలుమార్గమూ, గ్రాండ్ ట్రింక్ రోడ్డూ కోస్తా. ఆంధ్రలో వ్యాపారపంటల సరఫరాకి ఎంతోతోడ్పడ్డాయి. అంటే 1910 నాటికి సుందరపాలెంలాంటి గ్రామాలకి దూరప్రాంతాలతో వ్యాపారానికి అడ్డుగావున్న రవాణాఅడ్డంకి (transport - bottleneck) తొలగించబడిందన్న మాట. అంతేగాక, నూలుమిల్లుల, బట్టలమిల్లుల పోటీవల్ల తమవృత్తులు బాగాదెబ్బ

తిన్న సాలీలు, షావుకార్లు మధ్యకోస్తాప్రాంతం పొందుతున్న ఆర్థికపురోగతి-ముఖ్యంగా వ్యాపారీకరణమవుతున్న వ్యవసాయముతో ప్రభావితులయి ముందుగా ఆ (పుగాకు) వ్యాపారాన్ని, తర్వాత వ్యాపారపుపంటల్నీ దిగుమతిచేసి. పెద్దరైతులని ప్రోత్సాహపరచి వ్యాపారపంటలని ప్రవేశపెట్టారు. తర్వాత, మధ్యతరగతి, పేద రైతులుకూడ ఈ వలయంలోకి ఈడ్చబడ్డారు.

సుందరపాలెంలో జరుగుతున్న ఈ పంటలమార్పిడే ఇతర గ్రామాల్లోకూడా కొద్దోగొప్పో తేడాతో జరిగివుండాలి. ఆ చుట్టుప్రక్కల వ్యవసాయాలలోగూడా వ్యాపారపంటలు ప్రవేశించివుండాలి. కాని సుందరపాలెం ప్రత్యేకతఏమిటి?

ముందేచెప్పినట్లు, 1920 నాటికి సుందరపాలెం ఒకడుగు ముందుంది. వాస్తవంగా ఆ గ్రామం ఒక వ్యాపారకూడలి (మార్కెట్ టౌన్)గా పెరిగిన పెద్దగ్రామం. 1910-1920 మధ్యకాలంలో వ్యాపారపుపంటలు కొత్తగావచ్చిన 6-7 ఏళ్ళు అటు రైతులకీ, యిటు వ్యాపారస్తులు, షావుకార్లకీ లాభదాయకంగావుండేది.

"తరవాత్తరవాత ధరలుపడిపోవడం, పెరిగిపోవడం ఆరంభించాయి. ఏరు సెనగలుఏసి అవిపండితే, ఆటిధర పడిపోయేది ఆ యాడాది మిరపకాయలధర పెరిగిపోయేది. మిరప బాగాపండినఏడాది, దానికి ధరపలికేదికాదు. పొగాకుజంయ్యే మనీడి. ధరలెప్పుడుపడి ఎప్పుడు నెగిసిపోతాయె తెలిస్తే బావున్ననిపించేదికాని రైతోడి కెప్పుడు అవి తెలిసిసచ్చేవికావు." అప్పలాముడు,

"....పదేళ్ళ గిర్రునతిరిగేశలికి నాయురళ్ళమెడల్లల్లో నగలు సావుకారమ్మలు ఏసుకలిరగడం మొదలెట్టినారు. సావుకోరుబాబులటు గుంటూరు కోవూళ్ళనుండి యిటు బొరంపురం బస్తర్లదాకా యేపారాలమీద తిరగడాలు ఎక్కువైనాయి"

— అప్పలాముడు.

1920 నాటికి సుందరపాలెంలో వర్గతులనాత్మకత (class balances) లో మార్పులువచ్చాయి. రైతురు పేదలుకావడం (Peasent pauperisation) అనేది వస్తుమార్పిడివల్ల, రాయితీలేని పంటలవల్ల జరగడం ప్రారంభమయింది. వ్యవసాయేతర బృందాలు (Non-culti ating గ్రూపులు) ఆర్థికంగాబలపడ్డం మొదలవుతూండగా వ్యవసాయదారుల ఆర్థికపతనం ప్రారంభమయిలేది.

అయితే మాగాణిభూములు ఎక్కువగావున్న కాపులు తమభూముల్ని కాపాడుకొనగల్గారు. మెట్టపొలాలే ఎక్కువగావున్న, గొల్లలూ, మాలలూ ఈ వ్యాపార

పంటల జూదంలో ఆహూతయ్యారు. బహుశా వాళ్ళభూములు పెద్ద మధ్యతరగతి రైతులకు చేరివుంటాయి. పతనమవుతున్న సన్నకారు రైతులేమవుతారు? కంబారులవుతారు. అనే ప్రారంభమయింది.

(iii) 1920-1950 : 20వ శతాబ్దపు మొదటి అర్ధభాగంలో దేశమంతటా వ్యవసాయం క్షీణదశలోవుంది. వుత్పత్తి పెరగలేదు సరిగదా తగ్గుముఖం పట్టింది. 1921 తర్వాత జనాభాసంఖ్య పెరుగుతూవచ్చింది. 1929-32 మధ్య వచ్చిన ఆర్థిక మాంద్యమూ (Great Depression), 1939-45 మధ్య వచ్చిన రెండో ప్రపంచ యుద్ధమూ రైతుల స్థితిని దిగజార్చాయి. అంచేత సుందరపాలెంలో 1920 లో ప్రారంభమయిన రైతులు పేదలుకావడం వుధృతమయి వ్యవసాయకూలీల సంఖ్య పెరగడం సాగింది. ఈ ఆర్థికపతనం 1950 ప్రాంతంలో సుందరపాలెంలోవున్న సాంఘిక అరాచకత్వానికి ప్రాతిపదికఅయి వుంటుంది.

అయితే 1950 ప్రాంతంలోవున్న సుందరపాలెంలోని వ్యవసాయాన్ని ఎలా నిర్వచించాలి? ఫ్యూడలిజమా? సెమీ-ఫ్యూడలిజమా? లేక పెట్టుబడిదారీ విధానంలో వున్నవ్యవసాయమా? ఇవిచాలా చిక్కుప్రశ్నలు. జవాబులంత సులభంగాదు కారణం ఆవ్యవస్థ ఒక కలగూరగంపగా తయారయింది. వ్యవసాయరంగంలో షావుకార్ల ప్రాముఖ్యతపెరిగింది అయితే వాళ్ళకి భూమి చేరిందోలేదో తెలియదు. సన్నకారు రైతులు చితికిపోయి వేతనకూలీలుగా - కంబార్లుగా మారారు. వ్యవసాయరంగంలో 'పెట్టుబడి' ప్రవేశించివుండాలి. ఇలా భూస్వామ్యంవంటి సంబంధాలతోపాటు పెట్టుబడిదారీ సంబంధాలుగూడా సుందరపాలెంలో ప్రవేశించాయి.

(iv) ఇకపోతే 1950 - 62 మధ్యకాలం గూర్చి :

సుందరపాలెం వ్యాపారకూడలి (Market form) గావడం అటుంచి గ్రామ పురోగతినే దృష్టిలో వుంచుకొని ఒక యెమ్మెల్లేగానో లేక ఎంపీగానో తయారవ గల సాంఘిక, ఆర్థిక ప్రాపకం వుండికూడా, పదవీకాంక్షలేని పాతికేళ్ళ యువకుడు శ్రీరాములనాయుడు తన గ్రామంలో మార్పులు తీసికొని రావడానికి తయారయి, తన వ్యవహారదీక్షతో, మాట మంచితనంతో, నిజాయితీతో పాటుపడి, పిన్నలనీ, పెద్దలనీ వుత్తేజపరచి అనేక "అభివృద్ధి" కార్యక్రమాలుచేపట్టాడు. (ఈ "అభివృద్ధి"నీ నేను 'పురోగతి' అన్నాను) ఇదెలా సాధ్యమయింది? నిజాయితీగా వుండి లాభాలివ్వకుండా ఆ గ్రామానికి గవర్నమెంటు సహాయమెలా లభించింది?

శ్రీరాములు నాయుడి ఆకర్షణ :

సుందరపాలెంలో నాయుడు ఒక కెరిస్మాటిక్ లీడర్‌గా తయారయ్యాడు. ఎంచేత ? విద్యవల్ల, వ్యవహారదక్షతవల్ల, సేవాభావంవల్ల, కుల అహంకారం లేకపోవడంవల్ల, డబ్బున్న మేనమామల అండదండలుండటంవల్ల, ముఖ్యంగా సుందరపాలెంలో వున్న ప్రధాన వ్యావసాయిక కులం అంటే కాపుకులం నుంచి రావడంవల్ల, గవర్నమెంటు ఆఫీసర్లవద్ద పలుకుబడి వుండటం వల్ల ఈ ఆకర్షణ వచ్చి వుండాలి.

ఈ ఆకర్షణ చేసే మహాత్యాలూ, పుట్టించే నిర్హేతుకమయిన విశ్వాసాలు మొన్నటిదాకా "అమ్మ"కు నిన్న "అన్న"కు ఓటేసి గెలిపించి, అత్యాశలు పెంచుకున్న, పెంచుకుంటున్న తెలుగువాడికి వేరుగా చెప్పనక్కరలేదు.

అయితే ఆఫీసర్లకు లంచాల సంగతి ? బహుశా సుందరపాలెం ప్రాంతంలో వున్న యెమ్మెల్యే, ఎంపీ శ్రీరాములునాయుడికి సహాయం చెయ్యకపోతే తమ ఉనికికే భంగమనో లేక, నాలుగువందల యిళ్ళున్న సుందరపాలెంలో కనీసం వెయ్యి ఓట్లకు పైగా వున్న ఓట్ బాంక్‌కి తిరుగులేని పెత్తందారుగా వుండటంవల్ల, వాళ్ళ స్వార్థంకోసరమో శ్రీరాములు నాయుడికి సహాయపడమని అధికార్ల మీద ఒత్తిడి తెచ్చివుండవచ్చు. మరోవిషయం. లంచాలు మనదేశంలో అనాదిగా వుంటూ వచ్చినా స్వాతంత్ర్యానంతరం మొదటి దశాబ్దంలో వున్న లంచగొండితనం తర్వాత కాలంతో పోలిస్తే చాలా తక్కువ. తర్వాత్తరవాత లంచగొండితనం పరాకాష్ఠత పొందింది. "Not Accepted" ని "Note Accepted" గా మార్చగల తెలివితేటలు అప్పట్లో మంత్రులకిగాని ఆఫీసర్లకిగాని వుండేవిగావు ! ఆ 'స్వర్ణయుగం' తర్వాత ప్రారంభమైంది !! అంతేగాక, శ్రీరాములునాయుడికి ప్రజల్లో అంత పలుకుబడి లేకపోతే, మంత్రులూ, ముఖ్యమంత్రులూ ప్రజల దర్శనంకోసరం సుందరపాలెం వచ్చివుండేవారు గాదు.

ముందే చెప్పినట్లు ఒక ప్రాంతం పురోగతి చెందాలంటే, సాంఘిక, ఆర్థిక ప్రాతిపదికతోపాటు ఒక కాటలిటిక్ ఏజంటుగూడా అవసరం. సుందరపాలెంలో నాయుడాపాత్ర నిర్వహించాడు. మరి ఇతర గ్రామాల సంగతి ? సుందరపాలెం "పలువురు అనాథలనడుమ పచ్చగాబతికే సనాథగా కన్పిస్తుంది"అని కా. రా. అన్నారంటే మిగతా గ్రామాలు బొత్తిగా 19వ శతాబ్దంలో వున్నాయన్నట్లు గాక ఒక అంశాన్ని నొక్కి-

చెప్పడానికి రచయితకి మామూలుగావున్న సహజమయిన అతిశయోక్తి చేశారనే అనుకోవాలి. మరి, అక్కడ షావుకార్లు లేరా? వాళ్ళకిఅవసరాలు లేవా? రెండూ వుండే వుండాలి. అయితే ఆ గ్రామాలు సుందరపాలేనికి కేవలం ఉపగ్రహాలుగా (ఆర్థిక రంగంలో) వున్నాయి. పైన వివరించిన అనుకూల పరిస్థితులూ, సరియైన నాయకత్వమూ ఆ గ్రామాల్లో వుండివుండవు. ఇందులో అంత ఆశ్చర్య పడవలసిం దేమీ లేదు.

పోతే గ్రామంలో శాంతి ఎలా ఏర్పడింది? ఖూనీలు ఎలా రద్దయాయి? రంగనాయకమ్మగారు, "ఆఁ మళ్ళీ అదేనా?" అనేయకపోతే ఆకర్షణ సంగతే చెబుతాను. 'గాంధీ' సినిమా చూసి వుంటారు. ఒకచోట ఉప్పు కొటార్ల వద్ద సత్యాగ్రహం చేస్తున్న ప్రజలు జంటలుగా పోలీసుల ముందుకెళ్ళి బుర్ర బ్రద్దలు కొట్టించుకొంటారు, కాళ్ళూ చేతులూ విరగ్గొట్టించుకుంటారు. వాళ్ళకి కట్టుకట్టడానికి స్త్రీలు (వాలంటీర్లు) దూడీ, టించరూతో సిద్ధమయివుంటారు. గాంధీజీ, మౌలానాకి యిలా ప్రజలచేత చేయించడం ఎలా సాధ్యమయింది? కన్నబిడ్డలకన్నా తుపాకీనే మిన్నగా జూసే పఠానుల్ని, గాంధీ, గఫార్ ఖానూ ఒక దశలో సత్యాగ్రహులుగా ఎలా చేయగల్గారు? అంచేత ఆకర్షణ చేసే వింతలూ, పుట్టించే నిర్హేతుక విశ్వాసాలు ఖూనీల్ని ఆపగలవు, శాంతిని తాత్కాలికంగానైనా నెలకొల్పగలవు.

నాయుడు రాకముందు సుందరపాలెంలో రాజకీయపార్టీలులేవు. 1950 కి ముం దున్నవి అస్పష్టరూపంలోవున్న వర్గపోరాటాలు కూడా కాదు. అవి కేవలం వ్యక్తిగత తగాదాలయి వుంటాయి, లేదా ముఠా తగాదాలు. ఆ గ్రామంలో ప్రధాన వ్యావసాయిక కులం ఒక్క కాపులే. మిగతావారు కొద్దిగా బ్రాహ్మణకుటుంబాలు, సాలీలు, యాదవులు, హరిజనులు. గ్రామనాయకత్వం గురించి కూడా తగాదాలున్నట్లు లేదు. ఎందుకంటే నాయుడు ఆ వూరు రాకముందు ఆ వూర్ని ఏలింది రాఘవయ్య "పంతులు"గారట బ్బాయి. అంటే ఆ గ్రామానికి నాయకత్వం వహించింది (మునసబుని మినహాయించి) కాపుల్లో ఎవ్వరూ గాదన్నమాట. బియ్యే పాసయి లా కూడా పూర్తిచేయబోయిన వాళ్ళలో కాపులనుండి బహుశా శ్రీరాములునాయుడే ప్రథముడై వుంటాడు. సామా న్యంగా మన గ్రామాలలో నాయకత్వం అనేది ప్రధాన వ్యావసాయిక కులం చేతుల్లో వుంటుంది— విద్య విస్తారంగా వున్న కాలంలో మినహా. అయితే స్వాతంత్ర్యా నంతరం ప్రాథమిక విద్య బాగా విస్తృతమైనపుడు ఆర్థిక వనరులు ఎక్కువగావున్న కులాలనుండి గ్రామ నాయకత్వం పుట్టుకొచ్చింది. ఒకప్పుడు కమ్యూనిస్టుపార్టీ ప్రజ

లంగా వున్న దక్షిణ కోస్తా ఆంధ్ర గ్రామాల్లోకూడా - పార్టీ నాయకత్వం సర్వసాధారణంగా కమ్మ, కాపు, వెలమ, రెడ్డి యువకుల చేతుల్లో వుండేది. ఈమధ్య మార్క్సిస్టు సామాజికశాస్త్రవేత్తలు ఈ విషయాన్ని ఒక సిద్ధాంతంగా మలచి రైతుల వుద్యమాలు బలపడాలంటే మధ్యతరగతి, పెద్దరైతుల ప్రోత్సాహ సహకారాలు చాలా అవసరం అని చెబుతున్నారు. ఎందుకు చెబుతున్నానంటే శ్రీరాములు నాయుడు సుందరపాలేనికి నాయకుడై పార్టీ రాజకీయాలులేని ఆ గ్రామాన్ని ఒక్కతాటిమీద నడపగలిగాడన్నా, ఖూనీలు లేకుండా చేసి గ్రామంలో శాంతి నెలకొల్పగలిగాడన్నా ఆదొక సహజక్రమంగానే కన్పిస్తుంది తప్ప, విడ్డూరం ఏమీలేదు.

iii) ఫ్యూడల్ దోపిడీ ?

"గ్రామంలో పేదప్రజలపై జరిగే హత్యలకీ అత్యాచారాలకీ మానభంగాలకీ ఫ్యూడల్ దోపిడీయే కారణమని చెప్పుకుంటున్నాంగదా యిప్పటిదాకా. శ్రీరాములు వచ్చి ఆ ఫ్యూడల్ దోపిడీని అరికట్టగలిగాడా ?" — రంగనాయకమ్మ.

సుందరపాలెంలో "ఫ్యూడల్ దోపిడీ" జరిగిందా అనేది మొదటిప్రశ్న. అప్పల్రాముడి కథనం ప్రకారం సుందరపాలెంలో పూర్వం కంబార్లు బహు తక్కువ. దాదాపు ప్రతివాడికి అంతోయింతో పొలం వుండేది. భూమి కౌలు వున్నట్లు చెప్పలేదు. హరిజనులుకూడా రైతులే — పేదరైతులు. బట్టాపాతా సరిగ్గా లేకపోయినా తింటానికి కడుపునిండా కూడుండేది. హరిజన కుటుంబాల్లో కూడా ఆడంగులకి వెండినగలుండేవి. వస్తు మార్పిడే ఎక్కువగా వుండేది. ఒకవిధంగా అది కుంటుపడిన వినియోగ వ్యవసాయం (subsistence agriculture). వ్యవసాయంలో వచ్చిన మిగుళ్ళు తిరిగి వ్యవసాయానికి వెళ్ళేవిగావు.

ముసలాళ్ళకి గతం ఎప్పుడూ "మేలుకాలం"గా కనిపిస్తుంది. అంచేత అతను ఆ కాలాన్ని కొంత స్వప్నీకరించి చెప్పి వుంటాడనుకున్నా, కటికదరిద్రమూ, ఆవేశకావేశాలూ, స్పర్థలూ వున్నట్లు తెలియడంలేదు. ఇది c. 1910 కాలం సంగతి. భూమి కౌలూ లేక, కంబారితనమూ అంతగా లేకపోతే వుత్పత్తిరంగలో "ఫ్యూడల్" దోపిడీకి అవకాశం తక్కువకదా ! ఆ వ్యవస్థని సమర్థించడంగాదు. "ఫ్యూడల్" దోపిడీ వుండేదా లేదా అనేది ప్రశ్న. లేదని నేననుకుంటాను. అయితే ఆ వ్యవస్థలో సాంఘిక దోపిడీకి అవకాశం లేదా ? వుంది. కర్రపెత్తనం, కుల విశృంఖలత్వం వుండే వుండాలి. 1962 లోనే మాలలంటే లక్ష్మంనాయుడూ, అన్నమయ్యలు చూపిన

అసహనమూ, కులపొగరూ చూస్తే యాభై ఏళ్ళ క్రిందట 'కులంగాడి బలం' ఎక్కువే వుండివుండాలనిపిస్తుంది. అయితే వుత్పత్తి సాధనాల పంపిణీదృష్ట్యా చూస్తే 1910 నాటి సుందరపాలెం గ్రామీణ ఆర్థిక జీవనాన్ని రైతు యాజమాన్యంగా చెప్పవచ్చు, కౌలులేని, కంబార్లు పెద్దగాలేని, రైతు యాజమాన్యం. అంచేత ఆ సమయంలో 'ఫ్యూడల్' దోపిడి వుండివుందని నేననుకోను. అయితే 1920 - 1950 మధ్యకాలం మాటేమిటి ? రైతులు భూమిని కోల్పోవడం వల్ల షావుకార్లకిగాని భూస్వాములకుగాని సన్నకారు రైతుల నుండి భూమి చేరిందా లేదా అనే ప్రశ్నకి జవాబు కావాలి. ఈ జవాబు యజ్ఞం కథలో కన్పించదు. భూస్వామ్యం మీద, కౌలుమీద యితర వ్యవసాయ సంబంధాలమీద సుందరపాలెం సృష్టికి జీవం పోసిన శ్రీకాకుళం జిల్లాలోని గ్రామాలమీద పరిశోధన చేసి చారిత్రక విషయాల్ని వెలుగులోకి లాగాలి. అప్పుడే ఈ ఫ్యూడల్ దోపిడీ గూర్చి సరైన సమాధానం దొరుకుతుంది. 1950 నాటికి కంబార్ల సంఖ్య పెరిగివుండాలి. కౌలు సంగతి ఎవరూ ప్రస్తావించ లేదు. వేతన కూలీలు కొంత దోపిడీకి గురై వుంటారు. అయితే ముఖ్యమైన దోపిడీ వస్తువు మారకంలో — రైతునుండి వ్యాపారికి — జరిగిన దోపిడీ. దీన్నయినా "ఫ్యూడల్" దోపిడీ అనవచ్చునా ? కాదేమో ! 1950 నాటి సుందరపాలెం వ్యవసాయం కలగూర గంపలా తయారయింది.

పోతే మానభంగాలు మొదలుకొని పేద ప్రజలమీద జరిగే అత్యాచారాలు అన్నిచోట్లా ఒకే మూసలో సీహారులోలాగా, తెలంగాణాలో లాగ దారుణంగా వుండవు. దీనర్థం ఈ రెండుచోట్ల మాత్రమే ఫ్యూడల్ దోపిడీ వుందని నేననడం లేదు. అనూచానంగా వస్తున్న గ్రామధర్మాలమీద ప్రజాభిప్రాయాలమీద, పీడితవర్గాల చైతన్యంమీద, కులాల సమతుల్యంమీద, అన్నిటినీ మించి ప్రతిప్రాంతానికి ప్రత్యేకంగా వుండే సామాజిక సంస్కారంమీద యీ దోపిడీయొక్క తీవ్రత, రూపం ఆధారపడి వుంటాయి. దారుణమైన అత్యాచారాలు సుందరపాలెంలో జరిగాయంటానికి ఆధారాలు కథలో లభించవు. కాని, పూర్వోని వైషమ్యాలూ, ఆవేశకావేశాలూ పేదలమీదనే జరిగివుండాలంటే కొంత సందేహం కల్గుతుంది. సామాన్యంగా ఈ రైతు యాజమాన్యం చారిత్రక పునాదిగా వున్న గ్రామాల్లో, పొలాలు సరిహద్దుల దగ్గర, నీటిదగ్గర, ఆస్థుల పంపకంలో, మాటల పట్టింపుల్లో అసూయవల్ల, అక్రమ సంబంధాలవల్ల దొమ్మీలూ, తలలు నరుక్కోవడాలూ జరుగుతూంటాయి. 1950 ఆ ప్రాంతంలో సుందరపాలెంలో యిలాంటి అరాచకమే వుండివుండాలి. అంతేగాని

యివన్నీ "ఫ్యూడల్" దోపిడీవల్లనే అనడం అంటే కా. రా. గారిచ్చిన గ్రామీణ ఆర్థిక వ్యవస్థా చిత్రణని మరచిపోవడం అవుతుంది. ఇలా అంటున్నానంటే ఆంధ్రదేశంలో ఎక్కడా భూస్వామ్య దోపిడీ వుండేది గాదని నా భావం గాదు. ఆంధ్రదేశపు వ్యవసాయ చరిత్రమీద, యిప్పుడిప్పుడే పరిశోధనలు మొదలయ్యాయి. 'ఫ్యూడలిజ' మనో 'పెట్టుబడిదారీతన' మనో 'సంధియుగ' మనో తేలిగ్గా అనేయ కూడదు. రంగనాయకమ్మగారు "ఫ్యూడల్ దోపిడీ" అని మరో యోచన లేకుండా అనేరు. ఈ భావనలను వాడగూడదని నా వుద్దేశం గాదు. వాడబోయేముందు వుత్పత్తి సంబంధాలను, (surplus - appropriation నీ) అదనపుఉత్పత్తి దోపిడీనీ ఒకసారి గమనంలోకి తీసికోవాలనే నా మనవి. దీన్ని గురించియిక్కడ యింతకంటే ఎక్కువ చర్చించడం వీలుపడదు.

iv) "ప్రజలు"

రంగనాయకమ్మగారి నాలుగోపాయింటు తీసికొందాం.

తెలుగుదేశంలో మార్క్సిస్టు ఆలోచనాపరులు "ప్రజలు" అనే పదాన్ని రెండర్థాలలో వాడుతూంటారు. ఒకటి : ఉమ్మడి అర్థంలో సందర్భాన్నిబట్టి మొత్తం జనాభా అనే అర్థం వచ్చేట్లు, రెండు : శ్రమజీవులు అనే అర్థంలో. ఈ ఉమ్మడి "పదార్థాని"కి దోపిడీ లక్షణాలు అంటగట్టారు. బహుశ పచ్చి తిరోగామివాదుల్ని మినహాయించి మిగతావార్ని యిందులో చేర్చుతారనుకుంటాను.

"ఈ వూళ్ళో మార్పులవల్ల పేద ప్రజలకి లాభించకపోతే యితరవూళ్ళో ప్రజలు ఎందుకు ఈర్ష్య పడతారు ?" — రంగనాయకమ్మ.

సుందరపాలెంలో వచ్చిన మార్పులవల్ల పేదప్రజలకి - ముఖ్యంగా హరిజనులకి — లాభించకపోయిన మాట నిజం. అంటే మార్పులవల్ల పేదలు కానివారు లాభపడ్డారు. మరి యితర వూళ్ళో "పేద ప్రజలు" అనకుండా "ప్రజలు" అంటారేం రంగనాయకమ్మగారు ? ఈ పేద అనే క్వాలిఫికేషన్ మధ్యలో గల్లంతయిందేం ? ఎందుకంటే ఈర్ష్య పడేది పేదలుగాని యితర "ప్రజ"లు వడం కల్ల. అయితే కా. రా. గారు ఏం వ్రాసివుండాల్సింది ?

"ఇతర వూళ్ళో హరిజనేతరులు ఈర్ష్యపడతారు" అని. కా. రా. అలా ఎందుకని రాసివుండరు. నా వుద్దేశ్యంలో రెండు కారణాలవల్ల : ఒకటి ;

"అలా తిని ఏడుస్తారే గాని అందుకెంత యజ్ఞం జరిగిందో చూడరు" అని, కథ చివరలో యజ్ఞఫలితాన్ని చూపిస్తూ ఎంతో సున్నితమైన వ్యంగ్యం చూపారు. ఈ వ్యంగం పైకి తేల్తూ లోపలికి మునుగుతూ కథ అంకటా వుంది.

రెండు : ప్రతి గ్రామానికి ఒక కలెక్టివ్ - ఈథాస్ / కలెక్టివ్ కాన్షెస్‌నెస్ వుంటాయి. అలాగే ప్రతి గ్రామానికీ తోటి గ్రామాల యెడల అంతర్లీనంగా అప్పుడప్పుడూ మాత్రమే పైకొచ్చే వైవరీకూడా వుంటుంది. శ్రమజీవుల చైతన్యం అంతంత మాత్రంగా వున్నప్పుడు, గ్రామంలోని సవర్ణకులాల లేక పెత్తందారీవర్గాల చైతన్యమే గ్రామచైతన్యంగా కలెక్టివ్ - కాన్షస్‌నెస్‌గా చెలామణీ అవుతుంది. అందుచేత సుందరపాలెంని చూసి అసూయపడేది ప్రక్కవూళ్ళో వున్న శ్రమజీవులు గాదు, మిగతావారు. అదే ఆ గ్రామాల ఈర్ష్యగా పైకొచ్చింది.

[ముగింపు వచ్చే సంచికలో]

సృ జ న

1983 జూలై సంచిక

చెరబండరాజు సంస్మరణ

సంచికగా వెలువడుతుంది

చెరబండరాజు ప్రధమ వర్ధంతిని పురస్కరించుకొని జూలై సృజన ఆయన వ్యక్తిత్వ, జీవిత, సాంస్కృతిక సమాలోచనగా, జ్ఞాపకంగా, సంస్మరణగా వెలువడుతుంది. నక్సల్బరీ సాంస్కృతికోద్యమానికి, విరసం సాహిత్యోద్యమానికి ప్రతినిధిగా పదిహేను సంవత్సరాలు పోరాడిన యోధుడు కామ్రేడ్ చెరబండరాజు స్మృతిలో ఈ సంచిక జూలై 2 నాటికి వెలువడుతుంది.

ఆ కళ్ళు చూస్తున్నాయి ఆ పిడికిళ్ళు బిగిస్తున్నాయి

—ఘాయల్

ఊరికి ఎడంగా వున్న ఆ గూడెంలో గుడిసెలన్నీ కిక్కిరిసినట్టు కుప్పగా వున్నాయి అన్నీ తాటాకు కప్పుగుడిసెలు. మట్టిగోడలు. ఒకటీ అరా ఇటిక గోడల పెంకుటిళ్ళు వున్నా అవీ ఆ గుడిసెలతోపాటే వున్నాయి.

గుడిసెముందు అరుగుమీద మాసిన గోచిపాత కట్టుకొని గోడకాని కూర్చుని చుట్ట పీలుస్తున్నాడు ఐలయ్య. ఇంటి ముందున్న మురుగ్గుంట మీదినించి గంతేసి ఎవరో వాకిట్లోకి వచ్చారు.

వచ్చినతడు గోగుపుల్ల లా ఎండి బొగ్గుముక్క లా మాడివున్నాడు. అతడి ఒంటిమీద గోచిపాతా, ముతకబనీనూ తప్ప మరేం లేదు. తలకిమాత్రం బారెడుగుడ్డ తలపాగా చుట్టాడు. అతన్ని చూడగానే చుట్ట నోట్లోనించి తీసి ఆశ్చర్యంగా అన్నాడు ఐలయ్య.

"ఎవరుల్లో! ముత్తన్నా ?"

వచ్చినతడు చూరు కిందికి చేరి తలపాగా తొలగిస్తూ ఇస్సురని నిట్టూర్చి "బా! ముత్తయ్యనే ?" అని అరుగుమీద కూచుని "అందరు బాగున్నరా ?" అన్నాడు.

"మా బాగు కేమయిందిగని, ఎప్పుడొస్తివి ఎటొస్తివి ఏం కత ?" అన్నాడు ఐలయ్య ఇంకా ఆశ్చర్యంగానే.

"పక్కూరుకు వచ్చిన. మా బామ్మరిదికి తొల్సూరు మొగపిలగాడు పుట్టిండంటె సూశెటానికి వచ్చిన" అన్నాడు ముత్తయ్య.

"అట్లనా ? బాలిగాడికి కొడుకు బుట్టిండా ? ఎన్నడూ ? తెల్వకపాయె" అని జవాబుకోసం ఆగకుండా "ఎండల బడొచ్చినవు. మంచినీల్లు దాగుతవా ?" అన్నాడు ఐలయ్య లేస్తూ. పోబోయి ఆగి "బువ్వ దిన్నవా ?" అన్నాడు.

"ఆఁ. జరన్ని నీల్లు తీస్కరా," అని ముత్తయ్య తలపాగాతో ముఖం తుడుచుకున్నాడు. "ఇంట్ల ఎవలు లేనట్టున్నది ?" అన్నాడు.

"ఆఁ. తల్లి బిడ్డలు పనికి పొయిన్రు" అంటూ అల్యూమినియం చెంబుతో ఐలయ్య మంచినీళ్ళు తెచ్చిఇచ్చాడు. చెంబు ఎత్తి గటగటా తాగి మిగిలిన నీళ్ళు మొహంమీద చిలకరించుకున్నాడు ముత్తయ్య. చెంబు పక్కనపెట్టి కాళ్ళు చాపుకుని జారగిలబడి బీడీ అంటించాడు.

ఐలయ్యగూడా చుట్ట అంటించుకుని "మరైతె ప్యాటకు బొయ్యి ఏం జేత్తానవే ?" అన్నాడు.

"ఏమున్నది ? ప్యాటల తీరుతీరు పనులు దొరుకుతయి. అవన్ని జేసుడు మనతోటి ఏమైద్దిగని ఐండి గొడ్తాన." అన్నాడు ముత్తయ్య.

"అట్లనా ? అడ్డాని ఏపాటుంటది ? ఇల్లు ఎల్లదీయంగ ఏమన్న మిగులుతదా ?"

"అడ్డాని ముచ్చటా అడిగేది ? గంజి మెతుకు లెల్లుతె అదే ఎక్కువ" అన్నాడు ముత్తయ్య బీడీని పీలుస్తూ. బీడీ చివర్ల చేదు నోట్లోకి రావటంతో తుప్పున వుమ్మి మూతి తుడుచుకున్నాడు.

"ఎక్కడికి బొయినా గివే బతుకులు. ఎంతకు మారయి." ఐలయ్య విచారంగా వ్యాఖ్యానించాడు.

"ఈడ ఎట్లున్నది ? సీతయ్య దొర సంగతి జెప్పవైతివి ? అట్లనే వున్నదా యవారం ! ఐనా దొరోడు మారుతాడు ? వాన్ని గోశినాగూడ మారడు." ముత్తయ్య అన్నాడు.

"అబ్బో ! వాని ముచ్చటడుగుతానావు ? మాలమాదుగు లందరిమీద వాని కెందుకింత కండ్లకుట్టో అర్తమైతలేదు. ఇప్పటిగ్గూడ జులుం సాగిస్తనే వున్నడు గని సాగుతలేదు. మనోడు గిరి బూశనం లేదయ్య ! జొప్పుతాండు. మనకాలంల అడిగెటానికి బయపడే ముచ్చట్లన్ని అడుగుడేగాదు. ఇప్పుడు ముప్పయి నల్బై ఎకురాలల్ల మనోల్లు జెండాలు పాతి దున్నుడు మొదలుబెట్టిండ్రు ఎరికేనా ?"

"ఆఁ. గిన్ని జరిగినయా ? మరి దొరోడు ఊకున్నాడే ? వాడసలే పగబట్టిన పాము గాదు !" ముత్తయ్య ఆశ్చర్యంగా అడిగాడు.

"ఊకుంటాడు ? ఎవడు జెప్పిండు ! వాడు అమీనోన్ని తీసుకోని ఊర్లెకు పట్టుకచ్చిండు. ఆగమాగం జేపిచ్చిండు" ఐలయ్య అన్నాడు.

"చెప్పవు మరీ! దొరోని సంగతి ఎవని కెర్కలే. ఐలన్నా? వీస్దెటు పంటి పుటుకోగని రెడ్డోడు, ఎలుమోడు ఇసుమంటి కలిగోరాలు జెయ్యంగ జెయ్యంగ జూసినంగని బావనోడై వీడు గింతకు ఎట్ల తయారైండే! రావునాసురుని అంశల బుట్టిండు లుచ్ఛ ముండకొడుకు!" ముత్తయ్య బీడీ ఆఖరి పీల్పు పీల్చిపారేసి తుపుక్కున ఉమ్మి మూలి తుడుచుకున్నాడు.

"దానిదేమున్నదే? అస్తులు రాంగనె దాన్ని కాపాడుకోవాల్ననే సోయి గూడ అత్తది. అందుకోసం ఎంతకైన తయారైతరు" అంటూ ఐలయ్య వీధివైపు చూశాడు.

"పొద్దు వాలిపోతాంది. రాకరాక అచ్చినవు. లేశి జరంత అటు బోదాం పారాదు!" అన్నాడు.

"ఎందుకు తియ్యరాదె! కరువుకాలంల అదో కర్సు" నిరాకరించాడు ముత్తయ్య.

"ఏహెః. పారాదు! ఊకె నువ్వు రాబోతవా? నేను జెయ్యబోతనా! నాల్రూపాల కల్లుకోసం మునిగిందేందట?" ఐలయ్య ముత్తయ్య చెయ్యిబట్టి లేవదీశాడు.

గుడిసె తడక లాగి తాడు ముడివేసి ఇద్దరూ బయల్దేరారు. వాళ్ళు గుడిసెల్ని దాటుతూంటే ఒకరిద్దరు వృద్ధస్త్రీలు తల బయటకుపెట్టి చూశారు. ఒకామె పిలిచింది.

"ఎవరే ఐలయ్యా! నీతోని ఉన్నాయినెవలు?"

ఐలయ్య ఆగాడు. "మన ముత్తిగాడే! యాదికి లేదానే ఆరేండ్ల కింద ప్యాటకు బతుక బొయిండు. గ వాడే!"

ముసిల్ది గుడిసెలోంచి పరిగెత్తినట్టుగా వచ్చింది. ఆమె ఒంటిమీద పీలికల చీరా, అతుకుల రవికా ఉన్నాయి. చర్మం సంచుల్లాగా వేలాడుతోంది. గోనె పుల్లల్లాంటి వేళ్ళతో ముత్తయ్య ఒంటి నిమిరింది. ఆమె కళ్ళలో నీళ్ళు నిండాయి.

"నువ్వానే! లచ్చక్కా! శీ, యెదవజల్మ నాకు నీ సంగతే యాదికి రాలే! బాగున్నావే! ఎట్ల బతుకుతానవే!" అన్నాడు ముత్తయ్య తనని తను తిట్టుకుంటూ.

ముసిల్ది రాగాలు మొదలెట్టింది ముత్తయ్యని కావలించుకుని. "ఎట్లునోన్నెల్లి ఎట్లయిపోతిర్రో కొడుకో!.... అప్పుడు నీకు రెండు నాగండ్ల యవసాయం ఉండే దిరో నాయినో.... దొరోని కండ్లల్ల బడితివో నాయినో.... అంత అయిపోయిందిరో బిడ్డో.... వాని కండ్లల్ల జిల్లేడు బూశిందిరో అయ్యో.... వాని తలపండు పలుగ గదరో బిడ్డో.... మిమ్ముల నిట్ల జేశిండు గదర బిడ్డో.... ఊరొదిలి పోతివిగదరో అయ్యో! నేను లేననుకున్నావుర నాయినో....వద్దని ఎంత బతిలాడితిరో నాయినో.... నీ పట్టు నీదేనాయె బిడ్డో.... అడి పోరగాల్లు పచ్చులసొంటోల్లు బిడ్డో.... ఎట్ల ఎల్ల దీత్తాండ్రో నాయినో.... నాకు సావన్న రాదాయె దేవుడో...."

ముత్తయ్య ముసలిదాన్ని ఓదార్చాడు. "ఊకోవె! అయిపోయిందానికి ఏడిశేం లాబం?"

ముసిల్ది ఆగి బ్రురువచేది మళ్ళీసాగించింది. "ఊరుగాని ఊరుదోలివి బిడ్డో! .... ఎట్ల బతుకుతాండ్రో నాయినో.... పోరగాల్లు ఆగమైరి దేవుడో.... దొరోనింట్ల మన్ను బొయ్య గదరో.... వానింట్ల గడ్డిమొలువ గదరో.... వాని కూళ్లై పురుగులు బడ గదరో...."

ఈ రాగాలకి గుడిసెల్లోని ఆడంగులు పదిమందీ చేరారు. అందరూ ముత్తయ్యని పరకాయించి చూసి "బాగున్నావె ముత్తన్నా!" అని పలకరించి ముసలిదాన్ని ఓదార్చారు.

"ఊకో ఊకో. ఇగ అంతయిపాయె. ఏడుత్తె అత్తదానె!"

ముసిల్ది ఆగి ముక్కు మళ్ళీ ఓసారి చీది కొంగుతో కళ్ళు తుడుచుకుంది. "ఎటువంటోడు ఎట్లయిండు?" అని ఆడాళ్ళంతా ముత్తయ్యని చూసి నోళ్ళు నొక్కుకున్నారు.

"అందరు బాగున్నారే! పిల్లలు గిట్ల మంచిగున్నరా?" ఒకావిడ అడిగింది.

"ఆఁ. అందరం మంచిగనే ఉన్నం. ఏదో ఇంత కూటికి ఎల్లుతాంది. సావలేము. బతుకలేము. మన బతుకుల తీరే అంత" ముత్తయ్య నిట్టూర్చాడు. ఆడాళ్ళ నలుగురైదుగురు కళ్ళు తుడుచుకున్నారు.

"పెద్దాని పెండ్లి జేసినావె?" అందొకావిడ.

"మిమ్ముల బిలువకుంటనే జేత్తనా ?" అన్నాడు ముత్తయ్య.

"సరె. దా ! మనం మల్లత్తం గద. అచ్చినంక కూసోని అన్ని మాట్లాడు దుదు తీయిర్రి." అని ఐలయ్య ముందుకు కదిలాడు.

ముత్తయ్య అతన్ననుసరించాడు.

× × ×

వాళ్ళు మళ్ళీ వచ్చేసరికి పూర్తి చీకటి పడింది. గుడిసెల్లో చమురుదీపాలు వెలుగుతున్నాయి. వాటి చూరుల్లోంచి పొగ పైకి లేస్తోంది. పిల్లలు వాకిళ్ళ ముందు దిగంబరంగా దుమ్ములో ఎగురుతున్నారు. పనులకు వెళ్ళొచ్చిన ఆడవాళ్ళు లోపల వంట ప్రయత్నాలలో వున్నారు. చంటిపిల్లల ఏడుపులా, బిడ్డతల్లుల గద్దింపులా వినిపిస్తున్నాయి. ఎవడో కుక్కిమంచంలో పడుకుని ఏదో లొల్లాయిపదం పాడుతున్నాడు. ఎవరో స్త్రీ భర్త స్నానం చేస్తుంటే బండమీద నిలబడి వీపురాస్తోంది.

చీకట్లో గుడిసెల్ని దాటుతూ ఐలయ్య గుడిసె దగ్గరికి వచ్చేసరికి అక్కడో పదిమంది దాకా చేరివున్నారు. వీళ్ళని చూడగానే "అగో వచ్చిన్రు" అన్నా డొకడు.

ఐలయ్య భార్య వీరమ్మ గుమ్మంలోంచి లేచివచ్చి ముత్తయ్యని కౌగలించుకుని "మామీద ఎన్నిరోజులకు దయగలిగిందే అన్నో ! ఐనోల్లకు దూరం బోతివి గదనే తంద్రో ?" అని ఏడుస్తూ పరామర్శించింది.

"ఊకో. ఊకో శెల్లె ఊకో ! ఏదో బతికుండబట్టి ఈమాత్రం అందర్ని జూత్తాన. ఆనాడె పిడాత జస్తె అందరికి దూరమవుదు" ముత్తయ్య వీరమ్మని ఓదార్చాడు.

ఈ గోలకి ఆడా మగా అందరూ వచ్చి చేరారు. "అయ్యొ ? కూసో నిత్తరా లేదా." అని ఐలయ్య దారితీసి లోపల్నించి నులకమంచం తెచ్చి బయట వేశాడు.

ఐలయ్యా ముత్తయ్యా మరికొందరు ఆ మంచంమీద కూచున్నారు. మిగతా వాళ్ళు అరుగుమీదా, పెద్దరోలు మీదా కూచున్నారు. ఆడవాళ్ళు గుమ్మం పక్కగా నీడలో నిలబడ్డారు.

లోపల వంటపనుల్లో వున్న ఐలయ్య కూతురు లక్ష్మి గుడ్డిదీపం తెచ్చి వాకిట్లొ వుంచింది.

"బాగున్నవా బిడ్డా!" ముత్తయ్య అడిగాడు. లక్ష్మి తలవూపి లోపలికి వెళ్ళి తలుపు పక్కన కూచుంది. గుడిసెలలోంచి పిల్లల గోల వినిపిస్తోంది.

"రాజవ్వగిన బాగున్నారె! ఎట్ల ఎల్లదీత్తాన్రో ఏందో?"

"ఏం బాగుండుడు? ఏమంట వూరొదిలి పోయినమో దయిద్రం జుట్టుకున్నది. ఉన్నజాగ పోగొట్టుకోని ప్యాటకుబోతె ఉండ ఇల్లా, తిన తిండా? పక్కోన్ని పావుశేరు గింజలడుగుతెగూడ బుట్టయి. మాగోస ఎవనికి జెప్పేదిగాదు. ఒకడు దీర్చేది గాదు." ముత్తయ్య మాటలకి పక్కనే కూచున్న వెంకటేశ్వర్లు అన్నాడు.

"నువ్వంటె ఊరు వదిలిపెట్టి పోబట్టి అయింత ప్రానబయం లేకుంట ఉన్నవు. ఈడ పొలాలు బోగొట్టుకున్నోల్లం మేమంత ఇండ్లున్నయి గదాని ఉండుడే ఎప్పుడేమయిద్దో ఎవడేం జేత్తడో తెల్లారి లేశెవరకు ఏ శిక్కులు నోరుతెర్సుకోని కూకున్నాయోని బయమేనాయె."

"అదె! అంత తిప్ప లేమొచ్చెనే!"

"ఏ మచ్చెనా? నీకెర్కలేని దున్నదా జెప్పరాదు. ఇప్పుడంటే ప్యాటకు బోతివిగని అంతకుముందు ఇక్కడోనివి గాదా. సీతయ్య దొర పంచాయితి పశిడెంటు గున్నప్పుడు గౌర్మెంటు రేడియ తీస్కబోయి ఇంట్ల బెట్టుకోని ఏమన్నడు? 'మీ కెందుకురా రేడియ? మీ మొకాలకు ఇంక అదోటా?' అన్లే? గప్పుడు మన వీరయ్య గిట్ల ఎదురుదిరిగిన్రు సూడు, గక్కన్నుంచి ఇగ మొదలనుకోరాదు! అంతకు ముందుగూడ ఉన్నయిగని ఇంతబాగ అడిగినోడు లేడాయె. వీడడిగెవరకు వీనిమీద కన్నుబడ్డది." నేను చెప్పేది నిజమేనా అన్నట్టు, ఆగి ఇతర్ల మొహాలు చూశాడు వెంకటేశ్వర్లు. అందరూ బాగుంది అన్నట్టు తలూపారు.

"అంతటితోటి పోతె బాగుండు. మన నరేందర్, ఏలిషా, గిరిబాళవం అందరు ఎదురుతిరుగుడు మొదలుబెట్టిన్రుగద. మల్ల వీల్లంత అన్నదమ్ములై పోయిరి. గదాన్తోటి ఇంకింత కచ్చబెట్టుకున్నడు దొరోడు." అన్నాడు వెంకటేశ్వర్లు.

"అంటె అన్నాలం జరుగుతాంటె అడిగినోడు శెడ్డోడా?" ముత్తయ్య వెటకారంగా అని బీడీ తీసి ముట్టించాడు.

"అన్నట్టేగద మరి! లేకుంటె వాడేమంటడు ? మీదే నాయం ధర్మం అంటడా ?"

"అవురా బిడ్డా ! ఈ దొరలందరిది పులిజాతి. వాల్లకు మందిబూములు దొబ్బేడు రుశి దొరుకనేవద్దు. దొరికిందా మనిసి నెత్తురు మరిగిన పులితీర్గ ఇగ ఆగరు. కుటుంబాలు, వాడలు, ఊల్లు, తాలూకలు, జిల్లలు మొత్తం బూమండలం గూడ వాని ఆకలికి సాలది." ముత్తయ్య నిట్టూర్చాడు. బీడీ పీల్చి గుండెలనిండా పొగ వదిలి క్షణంసేపు కళ్ల మూసుకున్నాడు.

ఆ చీకట్లో తదియ చంద్రుడు గుడ్డి వెన్నెల్ని వెదజల్లుతున్నాడు. గుడ్డి దీపం వెలుతురు ముత్తయ్య మొహంమీద పడి అరవై ఏళ్ళ శరీరపు ముడతలలోంచి జారిపోతోంది.అతడి ముఖంలో వికృతపు నవ్వొకటి ద్వేషంగా వెలిగి ఇలా అన్నాడు.

"నా పొలం ఎట్ల బొయిందో మీ కందరికీ ఎరికే. అసలు ఆ పొలం నా కెట్ల వచ్చిందో మీ కెర్కలే.

ఇప్పుడు మన దొరోడు సీతరాంరావు ఉన్నడు సూడుర్రి వాడెట్ల ఇల్లుటపు అల్లుడో వాని మామ రాజేస్రావు గూడ ఈ వూరికి ఇల్లటం అచ్చినోడే. అయితె వాని మామ పూర్వీకులు మన ఎర్రబెల్లి, తుప్పరపెల్లి, రంగెం, ఇనుమంటి వూల్లను- ఏంది వూల్లనే - పంచుకున్నరు. పచ్చి ఊల్లల్ల జేరి గీన్నుంచి గీడిదాక బూమంత నాది అనుకున్నరు.

బూమిని కబ్జజేసోక్కంగనె ఏమైద్ది ? దున్నేడు, పండిచ్చేడు రావద్దా ? బాపని మొకాలకు నాగలి సంగతేమెరిక ? ఇగప్పుడు మనటువంటి సుద్దరి జాతులకు కౌలుకిచ్చిర్రు.

తరాలు గడిశినయి. మన నెత్తురంత మట్టినింద అలుకుజల్లి పంటలు పండిచ్చినం. గరిశెలు నిండెటోనియి నిండినయి. ఎండినోని కడుపు ఎండేపొయినయి.

ఇంతలకు మన రాజేస్రావు బూమిమీద అతికారంల కచ్చిండు. ఊరికి పట్వారి పటేలు ఆమెనే. కమినిస్టోల్ల విద్దం తర్వాత గౌర్మెంటు ఏదో పచ్చపారాలు కౌలుదార్లకిత్తె, ఆమెనె దాన్ని ఎట్లనో సవరిచ్చుకున్నడు. ఆ యెన్క నెహ్రుసాబ్ సచ్చిపోక ముందు ఏదో సట్టం తయారు జేసి దాన్ని గట్టిగ అమలు జెయ్యాల్ననే టాల్లకు - వూరి పట్వారి అయినేగద —. పాణీలల్ల ఒక తీర్గ, సైసీలు రికాట్లల్ల ఒక తీర్గ ఇగ ఎట్లనోగని మొత్తం మల్ల వాల్లకే ఉండెటట్టు జేస్కున్నరు.

ఇగ రాజేసర్రావుకు ఒక్కతే బిడ్డ అదొటాల్లకు సీతయ్యను ఇల్లటం దెచ్చుకున్నడు. అయినె రాంగనె సిచ్చు మొదలైంది"

ఆగి ముత్తయ్య బీడీ వెలిగించుకున్నాడు. వింటున్నవాళ్ళు మాట్లాడితే విషయం మారిపోతుందని నిశ్శబ్దంగా ఉన్నారు. ఆడా మగా అందరూ ఉత్సాహంగా వింటున్నారు. కుర్రకారయితే మరీ జాగ్రత్తగా వింటున్నారు.

ముత్తయ్య బీడీ అంటించుకునేలోపల తోడుగా ఐదారు బీడీలు, రెండు మూడు చుట్టలు వెలిగాయి. ముత్తయ్య మళ్ళీ అన్నాడు.

"సీతయ్యదొర రాంగనే నాగండ్లు బాయి టాక్టల్గచ్చినయి. మోటబావులు బొయి కరంటు ఇంజన్లచ్చినయి. కూలోల్లు దప్ప కౌలుదార్లు అక్కెర లేకుంట అయిర్రు. ఇగప్పుడు మా అసుమంటి ముసలి ముండకొడుకులం ఏం గావాలె? తాతలు తండ్రుల కాన్నుంచి బూమిని సాగుజేస్తుంటిమి. ఇయ్యాల ఏకోదమ్మన 'దూశ్ పోర్రి' అంటె ఎటుబోదుము? ఏదో సంతానికి మిగిలిందున్నది దాన్నిబెట్టి మల్ల గొందాం బూమిని అంటె - అసలు పైసలు మిగిలిందేడ? సరె అప్పోసప్పో జేసి గొందామంటె అసలు బూమి ఉన్నదేడ? ఊరి బూమంత వాల్లదేనాయె. ఏదో ఏరే కులాలున్నయి, వాల్ల బూమున్నదాంటె అదిగూడ లేదాయె. కాపులు గిట్ల ఉన్నరుగని వాల్లకున్నదే ఐదు పదెకురాలు. అవి వాల్లకే సాలయి. అమ్మేదు ముచ్చటెక్కడిది? దొరోడు అమ్మతె గొనాలె లేకుంటెలేదు. గది పరిస్తితి.

ఇగ ఇండ్లనే లొల్లిల లొల్లని సీతయ్యదొర పంచాయితి సర్పంచు అయిండు, ఇగ గౌర్మెంటు రేడియ వానిదే. బడి వానిదే. ఏమన్న అడుగబోతె మాదిగ్గాడిది కొడుకులాల! మీ మొకాలకు సదువు గావాలె రేడ్య గావాల్నార?' అనుడు!

ఏమన్నంటె వానికి మినిష్టర్లతోటి గిట్ల సంబంధాలున్నయి. ఏం జెయ్య కుంట అడుగకుంట అయింది ముచ్చట. అటువంటి టయింల నా అటువంటి రక్తం జచ్చినోడేమొ ఇల్లు వాకిలమ్ముకోని దేశాలుబట్టి పొయిండు. ఇగ మీ అసొంటి వయ సునోల్లేమొ తెగబడి ఎదురుదిరిగిర్రు.

అసలు వాడు ఈ బూమి నాది అనేదాక ఎవనికన్న ఇది పరాయినేల, దీంట్ల మనం పంజేత్తానం అన్న సోయి ఉన్నదా? సంత బూమి తీర్గ దాన్ని సవర చ్చన జేసిరి."

ముత్తయ్య ఆపగానే అందరూ ఒక్కసారి ఊపిరి పీల్చారు. "గింత కతున్నదా ఐతె!" అనుకున్నారు.

వెన్నెల వెలుగు గుడిసెలమీదా జనాలమీదా సన్నగా పడుతోంది. అందరూ ఏదో ఆలోచనలలో మునిగివున్నారు. ముసలాళ్ళు తాగుతున్న చుట్టలు ఆరిపోయిన సంగతిగూడా చూసుకోలేదు. వాళ్ళని పూర్వపు జ్ఞాపకాలు ఎటో తీసుకెళ్ళాయి.

ఐలయ్య అన్నాడు. "కని పరిస్తితి అప్పటితీర్గ లేదే? ఇప్పుడు మన గిరిబూశనం గట్టిగ తయారైండు. ఇసుమంటియన్ని వాడు సైసుతలేడు. ఒగసారి ఏమైందెరికేనా ?" అని ఆగి వెంకటేశ్వర్లుకేసి చూసి "ఆనాడురా !" అన్నాడు.

వెంకటేశ్వర్లు అవునన్నట్టు తలాడించాడు.

"సీలింగుల మిగిల్న బూములమీద అతికారం మనదేనని మన గిరిబూశనం ముప్పై నలబై ఎకురాలల్ల దున్నుడు మొదలుపెట్టిచ్చిండు. గిది సీతయ్య దొరకు మండుకచ్చింది.

ఇగ ఆనాడు అమీన్ను తీస్కచ్చిండు సీతయ్యదొర ఊల్లెకు. ఆని పేరు ఏందో ఉన్నది. ఆడు అచ్చి సైకిల్ మోటరు దొరోని ఇంటి ముంగల ఆపిండు. సీతయ్య దొరున్ను, ఆడు ఇద్దరు గల్సి అచ్చి మన గిరిబూశనం ఇంటికి కాసంత దూరంల ఆగిండ్రు. సీతయ్య దొర ఏం జేశిం డెరికేనా ? గిరిబూశనం ఇల్లుజూపి ఎన్కకు బోయిండు. అమీనోడేమొ ఇల్లు వాకిలి గొట్టి గిరిబూశనాన్ని పిల్సిండు.

లోపలికెల్లి గిరిబూశన మచ్చిండు. రాంగనె పోలీసోడు వాని చెయ్యి బట్టుకోని నడువ మంటడు! ఎందుకయా అంటె నడువు నడువు! అంటడు. నేనేం తప్పు జేసిన్నయా అంటె తప్పులేదు గిప్పులేదు నడువుబే! అన్నడు. గిరిబూశనం గానికి లిక్కదొచ్చి నేన్రాను పో అన్నడు. రమ్మని వీడు గుంజిండు. ఇద్దరు జరంత కలెబడ్డట్టు జేసిన్రు. గుంజులాటల గిరిబూశనం అమీనోన్ని కిందబడేసి తొక్కిండు. ఇగ అమీనోడు అది మనసుల కచ్చబెట్టుకున్న డనుకోరాదు! బూముల కేసొగటి, అమీన్ను గొట్టిండని ఒగటి రెండుకేసులు ఒక్కసారే బెట్టిండు. అయింత గిరిబూశనం తప్పిచ్చుకోని ఉరికిండు.

ఇగజూడు షురువైంది కత. ఊల్లోలందరిమీద దొంగకేసులు బెట్టిన్రు. మన ఎంకటేసర్లు గాని మీద గూడ బెట్టిన్రు. ఈడు గిరిబూశనం గానికి సుట్టం అయితడు గద!

గరిబూశనం గాడేమొ వూళ్లె సంగం బెట్టిండు. దాంతోటి పెద్దపెద్ద యవారాలు నడిశినయి. ఎన్ని వూళ్లల్ల ఎంతమంది మనోని మాటమీద నిలబడుతరో ఎరికేనా ? అందర్ని కూడగట్టిండు. ఈ సుట్టుపక్కల వాని పేరు తెల్వని పేదోడు ఉన్నాడే? దొర్లకైతే ఇగ ఉచ్చే పడుతది. సీతయ్య దొరైతె ఊరొదిలి ప్యాటల మకాం బెట్టిండు. ఎరికేగద!"

ఐలయ్య ఆగాడు.

"అయ్యొ! నడుమ ముచ్చట మరిశేపోతివి!" అన్నాడు వెంకటేశ్వర్లు.

"ఏందిర అదో!" అన్నాడు ఐలయ్య.

"సరె! నేనేం జేసిన గదాంటె, దసర దీపాలిరోజుల్ల ఒక అరెకురం పొలం గొందామని సీతయ్య దొర దగ్గెరికి పోయిన. ఆయినె అప్పటికె పొలాలన్ని అమ్ముకుంటాండు. ప్యాటల ఉంటాడుగద! సరె బేరమైంది. ఎనిమిది వందలు బయాన ఇచ్చిన. మిగిల్ని పైసలు రొండు మూడు నెల్లల్ల ఇత్తనన్న. వాడు సరె నన్నడు. అప్పుడే రజిష్ట్రేషను గిట్ల అయిద్ది.

ఇంతల ఐలయ్య జెప్పినట్లు ఆమీను వచ్చి డు. గిరిబూశనంగాన్ని గుంజితాంటె నేను, ఇంక శానమందిమి అడ గూడినం. కూడినం గని ఎవలం ఏమనలే. కని తర్వాత ఏమైందెరికేనా ? ఆ దొంగ కేసుల్ల నా పేరుగూడ సీతయ్య పెట్టిచ్చిండు. గిదెక్కడి కతరో అని నేను ఊరు వదిలి తిరుగుడు బెట్టిన. ఇంతల పొలం బేరానికి పెట్టిన వాయిద దాటిపోవచ్చింది. సరె. పోలీసు మాములాల ఇరికినగద. టైమియ్యక పోతడా అని మరిగీర్ధ ఉన్నదిగద యవారం, ఇది అటో ఇటో తేలేదాక ఇంకో రొండు నెల్లు ఎక్కువ టైమియ్యి అని మనుషుల బంపిన సీతయ్యదొర దగ్గెరికి. వాడు ఎసుమంటోడో గని సప్పుడులేదు సడిలేదు. అరె ఏందిరా అని పరీషానై తాంటె పోలీసులే నామీద కేసు తీసేసిన్రు. ఇగ అప్పుడు బొయ్యి ఏంది ముచ్చట అంటె, గడువు దాటినంక అచ్చినవు గద! ఇంకేంది? నీ బయాన జప్తయింది పో! అన్నడువాడు.

మరికేసుల నాపేరు ఇరికిచ్చింది నువ్వేగదయ్య అంటెగదంత నాకేమెరిక ? అంటడు. "నాగ్గూడ గిట్ల దోకాయిచ్చి ఎనిమిది వందలు దొబ్బిండు." అన్నాడు వెంకటేశ్వర్లు.

"వానికి గీ ఎనిమిది వందలు కరువైనయటనా? " అందొక స్త్రీ.

"ఎనిమిది వందలాబాయె! ఇన్నిరోజులు ఇట్ల బట్టకుంట పెండ్లాం పిల్లల కానకుంట తిరిగితి" అన్నాడు వెంకటేశ్వర్లు.

"వీని మొల్తాడుతెగ! వీనికి నాశన గాలం రాదేందో!" ఇద్దరు ముగ్గురు స్త్రీలు ఆశీర్వచన వచనలు చదివారు.

"ఇది వానికి నాశనగాలం గాకుండె మంచి కాలమా" అన్నాడు వెంకటేశ్వర్లు.

"యేం నాశనగాలం, అందర్ని గొట్టెయ్యబట్టె పోలీసుల కప్పజెప్పబట్టె మన గిరిభూషణాన్నయితె రొండుసార్ల సంపుదామనె సూసిరి. ఒగసారి పోలీసు టేశన్ల కర్ధీకాల్చి నడుంమీద వాతలుబెట్టిరి. ఇగ నాశనకాలం మనకా వానికా" యెవరో ఒక స్త్రీ అంది.

వెంకటేశ్వర్లు నవ్వాడు- "గట్లనే వుంటదే- నువ్వు మీదికి గనబడేదాన్ని సూత్తానవు - వాడిప్పుడు ఈ పొలాలన్ని యెందుకు అమ్మక దొబ్బుతాండంటవ్. ఊల్లె వుండకుంట ప్యాట కెందుకు బోయిండంటవ్ - పోలీసులు పటేలు పట్వారి అందరు వాని మనుసులేనాయె - ఇగమరి వానికి బయమెందుకు? వాడందర్ని తిప్పల బెడతాండు నిజమే కని వానికి గూడ యెరికే గిది యెక్కువకాలం నడువదని - మనం ఇన్నిగోసల బడితిమి. పోలీసుటేషన్ల బడితిమి - అయినగూడ వూకున్నమా చేసేది జెయ్యనే బడితిమి - అందుకే వాడు ఒక్కొక్కటి దాటిత్తాండు - అసలు గిది మనం పెరిగే కాలం, వాడు తరిగే కాలం - కొద్దిగ యిచారించి సూత్తె అర్ధమయితది" అన్నాడు.

అక్కడున్నవాళ్ళంతా తలలూపారు.

ముత్తయ్య బండ పెదాలు సాగదీసి నవ్వాడు-

"మంచిగ జెప్పినవుర బిడ్డ - మీదికి జూత్తె వాన్దే పైచెయి అనిపిత్తది గని గెల్సింది మనమేరా - నూరోజుల్లనే యిట్ల జేసుందుముగద గిప్పుడు ఈ సీతయ్యలు, రాజేస్రావులు ఈపాటికి వుండకపోదురు. మీ ముచ్చట్లన్నింటాంటె నామనుసుల ఆశబుడుతాంది" అన్నాడు.

"గంతేమరి - ఎన్నడోనాడు ఎవడో వాగడు యేన్నోవోకాడ మొదలు బెట్టకపోతె ఇగ దానికి అంతెక్కడిది - అపని మన గిరిబూశనం జేసిండు - ఒక్క-

మన తాలూకల్నేగాదు సుట్టుపక్కల తాలూకల్ల గూడ పేదోడనెటోన్నల్ల కూడ గట్టిండు - సంగంబెట్టి వుల్ల మీద తండలమీద ఎర్రజెండ లెగరేసిండు - దండుగలని ఇదువరకు వసూల్జేసిన పైసలన్ని పల్ల యెవనియి వానికి యిప్పిచ్చిండు.

దొంగ బాకీల కింద జప్తయిన బూములన్ని యెవనియి వాన్ని దున్నుకో మన్నడు - బూసాముల మనుసులత్తె ఎదురు నిలబడ్డడు - వాని సపోటుగ మంది అందరు నిలబడ్డరు - యిగ యెవన్తోటి యేమైతది - తోకదీకిగ్రను". అయిలయ్య తన విజయాల తాలూకు గర్వం మొహంలో వెలుగుతుండగా అన్నాడు.

తదియ చంద్రుడు అస్తమించడానికి సిద్ధంగా వున్నాడు. గుడిసెల మీది నుంచి వీస్తున్న గాలి వేపపూల వాసనను వరిగడ్డి పరిమళాన్ని మోసుకొస్తోంది.

జనాల్లో ఒకరిద్దరు మళ్ళీ చుట్టలు బీడీలు వెలిగించారు-

"యింక యినవ్వా, భూసాము లెంబడే గాదు, పోరముస్తాజర్ల యెంబడి గూడ దగిలిండు - వాల్లు వూకె మోటర్లల్ల రాకడ, గుడిసెల్ల సొర్రుడు, మొగోల్ల కొట్టుడు, ఆడోల్ల గుంజుడు, సొమ్మేదన్న దొరుకుతె ఎత్తుకపోకడ, మందిని పట్టుక బోయి జుల్మానా లేసుడు. గివన్ని జరిగెటాల్లకు మనోడు ఆ రంగంలగూడ దిగిండు - దాంతోటి పోరముస్తాజర్ల మనుసులు ఊల్లల్లకు వచ్చెటానికి బయపత్తాండ్రు - యిగ గప్పుడేమయిం దెరికేనా. యిటు బూసాముల వాల్ల మనుసులు, అటు పోరముస్తాజర్ల వాల్ల మనుసులు వీల్లిద్దరు గల్సి యెగేసిన పోలీసులు మనోని యెంబడిబడ్డరు. వాడు తెడ్డుగూడ దొరుకలే - ఊల్లకూల్ల తండలకుతండలు వానెనుక నిలబడ్డయి. వానికి బయమే లేదు - యెర్రజెండ బట్టోక్కని యిదే మన బలం అంటడు. నా పానం బోతేంది! మనం మొదలుబెట్టిన యిద్దం ఆగుద్దా? అంటడు - గనుమంటోన్ని యెవడేం జేత్తడే" అన్నాడు అయిలయ్య.

అతడి ముఖంలో రాబోయే విజయంమీద విశ్వాసం కనిపించింది.

ముత్తయ్య ఆశ్చర్యపోయాడు.

"అరె, గి వీడు యింతటోడెట్లయిండె- గీ తెలివంత యేన్నుంచి వచ్చింది వానికి" అన్నాడు.

అయిలయ్య చెవిలోంచి చుట్టతీసి నోట్లో పెట్టుకోబోతూ ఆగి "యిదంత సంగం చెయ్యబట్టే జరిగింది - వాల్లొక్కటే ముచ్చట జెప్పిగ్రను - 'కలిసుంటె గెలు

త్తరు' - దాంతోటి యిగ జాతి బేదం లేకుంట మాలమాదుగులు, లంబాడోల్లు, కాపులు, కమ్మోల్లు అందరు గల్సింద్రు - గంతే యిండ్లున్న ముచ్చట" అన్నాడు.

"సూడబోతె శిన్న ముచ్చటే" అన్నాడు ముత్తయ్య.

"గదే మరి సంగం గొప్పదనం" అన్నాడు వెంకటేశ్వర్లు.

జనాల్లో కదలికలు మొదలయ్యాయి. కొంతమంది అటూ యిటూ శరీరాల్ని కదిలించారు. మరికొందరు చేతులు పైకెత్తి ఆవులిస్తూ ఒళ్ళు విరుచుకున్నారు. ఆపాటికి దాదాపు గూడెం మొత్తం అంతా అక్కడే వుంది. గుడ్డిదీపంలో కిరసనాయిలు అయిపోవచ్చిందేమో రెండుసార్లు భగ్ భగ్‌న మండి మరింత గుడ్డిగా వెలగసాగింది.

"యిగ లేవ్రి. శాన రాత్రయింది - మల్ల తెల్లారి పనులల్లకు బోవాలె గద" అని అయిలయ్య భార్య వీరమ్మ అన్నది.

అందరూ ఒక్కసారే లేచారు.

× × ×

ఆ పెద్ద కాంపౌండులో రెండు వ్యాన్లు, ఒక జీపూ, రెండు పెద్ద టాంకర్లూ, నాలుగైదు మోటారు సైకిళ్ళూ వున్నాయి. వాటి పక్కగా ఓ రేకులషెడ్డు కింద యాభయి అరవైమంది మొద్దుల్లాంటి మనుషులు బీడీలు కాలుస్తూ హస్కు కొడుతూ పాతటైర్లమీదా చెక్కడబ్బాల మీద ఎక్కడ వీలైతే అక్కడ కూచుని వున్నారు. మరికాస్త లోపల ఇరవై అడుగుల ఎత్తున రేకులషెడ్డొకటి వుంది. దాన్లో రెండు పెద్ద చెక్క వ్యాట్లు (Vatts) పదిహేనడుగుల ఎత్తూ ఇరవై అడుగుల కైవారంతో వున్నాయి. వాటినిండా సారా వుంది. ఆ వ్యాట్లకి రెండు ఇత్తడి కుళాయిలూ వాటికి ఇనుప తాళాలూ ఉన్నాయి. వాటి తాళంచెవులు జేబులో పెట్టుకున్నాయన కాస్త ఎడంగా ఓ టేబిలు ముందు కూచుని వున్నాడు. అతనిముందు ఒక టెలిఫోనూ, దానికో తాళం, ఓ లావుపాటి కాతాపుస్తకమూ, మరో పక్కగా టేబిలుకే బిగించిన చిన్న ఇనప్పెట్టె దానికి రెండు తాళాలూ వున్నాయి. అంతేగాక అతని బుర్రలో ఏదో ఆలోచనా, పొట్టలో అరకిలో కుందేలుమాంసమూ అరసీసా విస్కీద్రవమూ ఉన్నాయి. అతడి ఒంటిమీద ఖద్దరు కమీజూ, ఆకుపచ్చ అంచున్న ఖద్దరు ధోవతీ ఉన్నాయి. ఆయన అరమోడ్పు కళ్ళతో షెడ్డు కింది మనుషుల్ని గమనిస్తున్నాడు. వాళ్ళ బూతు కూతలూ బోడి పరాచికాలూ అతనికి వినిపిస్తున్నా విననట్టే వున్నాడు.

అతడి వెనగ్గా ఒక మూలకు వరసగా ఐదుగదులు కట్టిన పెంకుటిల్లొకటి వుంది. ఐదు గదులకి ఐదు ఫాన్లూ, ఐదు మంచాలు, ఐదు బాత్రూం లెవెట్రీలూ ఉన్నాయి.

వాటి ఎదురుగా చీకటి కొట్టాంలాంటి పాతగది ఒకటి వుంది. దాన్లో ఒళ్ళంతా చితకొట్టబడి శూన్యదృక్కులతో పైకప్పుకేసి చూస్తూ వెల్లకిలా అర్ధనగ్నంగా పడుకున్న నలుగురు మనుషులున్నారు. వాళ్ళు లంబాడీలు. వాళ్ళని కొట్టడానికుపయోగించిన లాఠీకర్రలూ, బెల్టూ, లారీ ఇంజన్ల ఫ్యాను బెల్టులూ ఓ మూల కుప్పగా ఉన్నాయి. వాళ్ళ తాలూకు ఆడవాళ్ళు ఏడుస్తూ గేటు బయట ఉన్నారు. గేటుకి కాపలాగా ఒక కుక్కా, సింహంలాకన్పించినా విశ్వాసమున్న ఇద్దరు మనుషులూ వున్నారు.

ఆ సారాడిపో వంటగది మరీ చివర్న వుంది. అక్కడ సకల పాకరీతులు తెలిసిన మగవాడు, వాడు వండే కోడి బొచ్చు పీకటానికి ఓ ఆడమనిషీ వుంది. ఆ ఆడమనిషికి మగాళ్ళంతా బావలూ, ఆడాళ్ళంతా అక్కలూ. ప్రస్తుతం ఆమె తన కుక్క బావతో కలిసి అడవిపంది మాంసాన్ని ముక్కలు కోస్తోంది.

ఆ కాంపౌండంతా ఒక వాటికన్ సిటీలాంటి ప్రత్యేక రాజ్యం. అక్కడికి ఏ ప్రభుత్వమూ, చట్టాలూ రావు. అక్కడి రాజు సారా కాంట్రాక్టరు. అతడికి ప్రత్యేక సైన్యం, మంత్రి, రెయిడ్లు చెయ్యటమనే దండయాత్రలు నిర్వహించటానికో రెయిడ్ ఇన్‌ఛార్జి అనే సేనాధిపతీ, సేవకులూ అందరూ వుంటారు. వీళ్ళుగాక ఎక్సైజు పోలీసులూ, పోలీసులూ చేసే సహాయం ఎలాగూ వుండి తీరుతుంది. దొంగసారా అమ్మే వాణ్ని కోర్టులో విచారించాలంటుంది ఎక్సైజుచట్టం. సారాసర్కారులు వాణ్ని చిత్రవధచేస్తే, చంపితే ఆ చట్టానికి, దాన్ని రక్షించే వాడికీ ఏమీపట్టదు. నేరం ఆరోపించ బడ్డవాడు దోషా కాదా అనేది నిర్ణయించేది చట్టం కాదు. సారా సర్కారులే. వాడు దోషి కానప్పటికీ!

× × ×

సారాడిపో గేట్లు భళ్ళున తెరుచుకున్నాయి. ఎర్రరంగు మోటారు సైకిలొకటి కొంపలు మునిగినట్టు అరుస్తూ వచ్చి ఆగింది. దాని పై నించి ఒంటె ఎత్తూ పంది బలుపూ వున్న మనిషొకడు దూకాడు. స్టాండు వేసి దూకుడుగా వ్యాట్లు ఉన్న షెడ్డు దగ్గరికి నడిచాడు.

అక్కడ టేబిలు ముందు కూచున్న మనిషి "అయ్యగారొచ్చేరు ఇంచే పణ్ణించీ ఎటెళ్యావ్ ?" అన్నాడు అతన్నిచూస్తూ. వచ్చినతడు శాంతారావు. అతడు ఆ డిపోలో కా స్తంత వాటాకియజమాని. అతనింతకుముందు ఇంకో సారాకాంట్రాక్టరు దగ్గర పనిజేసిన రోజుల్లో అతనినెత్తిన చెయ్యి పెట్టి సంపాదించిన డబ్బుతో దీన్లో భాగస్వామి అయాడు. ఇంకా ఎంతో పైకి ఎదగాలని అతడి ఆశ.

అందుకని "ఏరీ అయ్యగారెక్కడా ?" అన్నాడు.

"అదో, ఆ మూడో నెంబ్రురూంలో వున్నారు" అన్నాడు టేబిలు దగ్గరి మనిషి.

శాంతారావు మూడోనెంబరు రూందగ్గరికి దూసుకుపోయాడు. తలుపులువేసి వున్నాయి. మెల్లిగా తట్టాడు.

"ఎవడ్రా నా కొడుకు ?" లోపల్నించి గర్జన వినిపించింది.

"నేనండయ్యా, శాంతారావుని ?"

"నువ్వాట్రా ! లోపలికి రా ముందు"

శాంతారావు తలుపు తోసుకుని గదిలోకి తొంగిచూసాడు. గదిలో చిన్న జింక పిల్లని పక్కన కూచోపెట్టుకుని నిమురుతూ విస్కీతాగుతూ కూచున్న చిన్నబ్బాయి కన్పించాడు.

"దండాలండయ్యా !" శాంతారావునమస్కరించాడు.

"దా, దా ! ఏట్నీకత ? ఏందీయవారం ? నీకోసం రెండు గంటల్నించి సూ త్తన్నాన్రొరే. డిపోనడిపేదా మానేదా ?" అన్నాడు చిన్నబ్బాయి. శంఖుమార్కు లుంగీ, కట్ బనీనూ వేసుకుని ఉన్నాడు.

"అయ్, మీరలాగంటే ఎలాగండే ! నేను మన యవారం మీదే తిరుగుతున్నా. అయ్ బాబయ్ బాబు ! ఏటండీ ఈడు ? పెట్రేగి పోతున్నాడు. మనకి ముప్పు తెచ్చేత్తన్నాడు" అన్నాడు శాంతారావు.

"ఎవడా కొడుకు ?"

"ఆడేనండి గిరిబూశనం గాడు ! ఆడమ్మా శిగదరిగిన పార్టీ అదేదో నక్సలైట్నాకొడుకుల పార్టీలోజేరి తెగ శికాకు పెట్టేత్తన్నాడండి !"

"ఎవుడా గిరిభూషణం ?"

"అహ, తమరికి తెల్దు గదండీ . ఇక్కడోగుడు ఉన్నాడండి. ఆడే గిరి భూషణమండి ! ఆడు యమాడేంజరస్సండి ! బంజార్నా కొడుకుల్ని కూడగీసి తెగల్లరి పెట్టేత్తన్నాడండి. రెయిడ్లు శెయ్యబోతె ఆడు ఆల్లందరితోగూడి అడ్డుగొడ్తున్నాడండి ఆడో పెద్ద కేట్నాకొడుకండి ! ఆడి మాటందరూ ఇంటారండి, అదే మా శెడ్డ శిక్కండి !" శాంతారావు చెపుతూంటే చిన్నబ్బాయి జింకపిల్లకి మాంసంముక్కలు, జీడి పప్పులూ అందిస్తూన్నాడు. జింకపిల్ల జీడిపప్పులు మాత్రమే తింటూ తన ఆటలు తాను ఆడుకుంటోంది.

"ఓరి ఎఱ్ఱినాయాలా ! ఏట్రా ఇందాకన్నావు ? ఆడు కేట్నాకొడుకా ? నువ్విలగాలోచిత్తన్నావు గాబట్టే ఆడు పెరిగిపోతన్నాడు. ఆడిమాట ఇనే జనంవుండా రంటే ఏమన్న మాటా ! ఆడో లీడరన్నమాట ! అంటే ఆడికో పార్టీ వుందన్న మాట ! ఆ పారిటీగూడ బీదోల్ల పార్టీ అన్నమాట ! కాబట్టి ఏటి జరుగుతుందీ డబ్బు న్నోడిమీదికి ఆడుకూల్నాయాలందర్నీ ఎగదోస్తన్నాడన్నమాట! అంటేడబ్బునోల్లంత ఆడికి శత్రువులేగదా ! మరి ఆడి శత్రువులంతా మనమిత్రులేగదా ! డబ్బునోడు డబ్బునోడు కలిస్తే కానిదేముంది ? ఈ రూట్లో నీ ఆలోశనెందుకు పోలేదో ?"

"కాని బాబూ ! ఆడిదగ్గర తుపాకీలు, బాంబూలూ, జనం వున్నారండి" శాంతారావు చెప్పాడు.

"ఓరి ఓరి ఎఱ్ఱి పీనుగా ! తుపాకీలు మనకిలేవా ?" చిన్నబ్బాయి ప్రశ్నించాడు.

"ఏడండి ? ఏడున్నాయి ?"-

"లుచ్చానాయాల. నీకుయవారం నడపడం శాతవుట్రా నాకొడకా ? నీలాంటోళ్ళని నమ్ముకుంటే నేనూ నా సిండికేటూ కుడ్సిపోవాల్సిందేరా దేకార్నా కొడకా ! నీకాగిచే నేనిచ్చే ఇంటు. ఎవడైతే మనశత్తురువో అడి శత్తురులంతా మన మిత్తుర్లే-. ఇదీ సూత్తరం. ఇది గాక మనకీ కాత్తె దగిర్నం, తెగింపూ ఉండాల. అలకాప్పొతే సేయించే తెలివన్నా వుండాల. లేదంటే మన్నుగొట్టుకు పోడమే" అని ఆగి కాస్త విస్కీ చప్పరించి "మనకెంత దగిర్యముండాలంటే దానికో ఉదాగరణ యిను....

నేనో పాలి ఇలగే సారాడిపోయవారాలు సూత్తన్నా- అంటే నీలెపల్లో ఉన్నాన్నమాటప్పుడు ! సరిగది జరిగింతర్వాత కోయనాయాల్లు నా యేరియాలో సారా కాత్తున్నారని తెలిసి 'రైడు' కెలదామనుకున్నా. ఇంతలోకే డిపోలో జనాన్లెవరూ లేకుండయారు. ఆలంటా యేరేరయిడ్ల కెల్లేతలికి నాకు వోర్పు లేకుంటయింది. కోయ నాయాల్లు సారాకాత్తన్నారని ఇన్ఫరమేసనొచ్చేత ఊకోటం - ఏటి ?- ఊకోటం - పరువుదక్కువ పనని నా ఎర్ర ఎన్‌ఫెల్డు బండెక్కి ఇరవై మైళ్ళదూరాన ఉన్న గూడేనికి దూకిచ్చా బండి.

నేనా గూడానికి ఐయల్దేరే తలికి నా దగ్గిరో పిస్తోలు రెండు లీటర్ల పెట్రోలూ తప్ప మరేం లేవు. ఆకరికి నా కార్మినారు సిగరెట్లనీ వదిలి పరుగెత్తి నానన్నమాట.

సరి— యెల్లేతలికి గూడెం మద్దెన ఓపెద్దకుండలో సారాయెట్టుకుని సుట్టూ కోయ నా కొడుకులూ, గుంటముండలూ యెగుర్తూ డాన్సు సేత్తుంటే ఓ నా కొడుకు అలందరికీ గళాసుతో సారాముంచి పోత్తన్నాడు. అది ఆల పండుగే అవచ్చుగాక. కానీ ఆల సారా తాగటానికీ ఆలెవ్వరోంట ? గవుర్మెంట్నాకొడుకు ఈ యేరియాలో ఈ డిపో సారాతప్ప తాగ్గూడదన్చెప్పిన తర్వాత ఎవుడి సారా ఆడే తాగితే యేమిటర్థం? సట్టధిక్కారం. అదిగది గుర్తొచ్చి నా యెన్‌ఫేల్డ్ బండితో ఆ సారాకుండని ఏక్ దమ్మున గుద్దేసానంతే. ఎక్కడ్డాన్సులక్కడే ఆగిపోనాయి. ఎక్కడ్నాకొడుకులూ, ముండలూ అక్కడేఆగి మిటకరించి సూత్తన్నారంతే. పిస్తోలు తీసి 'ఢాం'మనిపించి-

'ఒరే నాయాల్లారా ! సక్కా లొంగిపోండి. లేదో మీ యమ్మ శిగతరుగుతానంతే' అన్నా—

ఒక్కసారి చూశారంతే మిటకరించి. తర్వాత జొయ్యిమని మగోళ్ళంతా నా మీదబడి దుమ్ములేపేశారనుకో, తలబద్దలైంది. కాళ్ళూ, ఒళ్ళూ చీరుకుపోయి రగతం- దానెమ్మా- రగతం కారుతోంటే ఎగిరి బండిమీద్దూకి స్టార్టు చేసి గేర్లు అడుగుదాకా తొక్కి క్లచ్చొదిలా. బండినడిపిన అర్ధగంటసేపూ బ్రేకుమీద కాలెయ్యలా. ఆక్సిలేటరు లూజొదిలిపెట్టలా.

డిపోజేరింతర్వాత సూస్కుంటే ఏటుంది. ఒంటిమీద పంచె ఏడబోయిందో కర్రాయరూ. చింపుల లాల్చి వున్నాయి. యెంటనే యెల్లి ఆమట్టున అరగ్లాసు విస్కీ దంచా !

ఇంతలో రైడింగు పార్టీ జవాన్లు వ్యాన్నిండా బిలబిలామని దిగారు. ఆల్లెంట ఎవురో దొంగసారా నాయాల్లున్నారు. ఆల్ల డన్లప్ షైరు ముక్కల్తో కసి దీరాబాదేశా."

అని చిన్నబ్బాయి ఓ విస్కీ గుటకేశాడు.

ఈ లోపల శాంతారావ్ ప్రశ్నవేశాడు.

"రైడింగు పార్టీ రాంగానే ఆ మట్టున మీరా గూడెంమీదికెందుకు పోలేదండి?" చిన్నబ్బాయి గ్లాసుని దభీమని టేబిల్‌మీద వదిలి "ఛ్ఛ! ఎంత ఎర్రి ఎదవైనా అలా పోతాండ్రా ? అప్పుడేటి జరిగింది? ఆలగూడెం మీదికి ఎల్లి దొమ్మి సేసొచ్చా. అప్పుడొగుణ్నే ఉన్నా గనక మళ్లీ ఎల్లి మందీ మార్బలం పట్టుకొత్తానని ఆల్లకి తెలీదా ? అందుకోసం ఏటన్నా జరిగితే కాసుకోటానికి ఆలు రెడీగుండరా ? అటువంటి టయంలో గూడెం మీదికి పోతే మన పని కాళీ అవుద్ది. అంచాత మరెంద్రోజుల్దాకా ఆణోలి కెల్లలా. తరవాతేం జరగాలో అజ్జరిగిందనుకో. ఇంతకీ ఈ కతలో నీతి ఏటంటే మన యెంట సపోర్టున్నా లేకపోయినా అన్యాయం జరుగుతుందని తెల్సిన యెంటనే సొరవతో దూకే దగిర్యం- కావ వుండాలన్నమాట. అది లేకపోతే మనం ఈ యాపాలా శెయ్యడాన్కి పనికిరావన్న మాట !"

మళ్ళీ ఓ గుటకేసి చిన్నబ్బాయి ఇలా అన్నాడు.

"ఒరే బుడ్డనాయాలా ! మనం జేసేదేటి ? యాపారం– ఐతే దీనికి యాపారంలా కనిపించే లచ్చనం లేదు. దీనికి అన్నియాపారాల్లాగా డబ్బు పెట్టుబడి కన్న తెగువుండాల. అది లేప్పోతే ఎంతడబ్బుండీ లాబంలేదు. అసలు బిజినెస్సంటే ఏట్రా ? ఎవుడి బలయీనత ఏదో దాని మీద యాపారం జెయ్యటం. అయితే సీర్లమ్మేవోడూ సిగిరెట్లమ్మేవోడూ గూడా బిజినెస్సే సేత్తన్నారు. కానీ మన్లాగా ఆడికి జనంతో తకరారు లేదు. ఏక్లాసు సిగిరెట్లోడికీ లోక్లాసు సిగిరెట్లోడికీ మద్దిన సట్టబద్దమైన పోటీ ! ఆడికీ లైసెన్సుంది ఈడికీ లైసెన్సుంది. కానీ మన్దేటి ? ఒక్క బ్రాండు వస్తువే. దీనికి పోటీ ఏటి ? దొంగసారా ! దానికి లైసెన్సు లేదు. మనకుంది. మనకు లైసెన్సుందంటే ఏటన్నమాట ? సట్టం, న్యాయం, పోలీసులు, కోర్టు, ఆఫీసర్లు ఇయ్యన్నీ మనకు అతికారాలిచ్చి ఈ యేరియాలో సారా అమ్ముకోండ్రా అన్నారన్నమాట ! దీనికి బదులు మనం ప్రెబుత్వానికి సాలుకి పది లక్షలు అంటే రోజుకి దగ్గిర్దగ్గిర మూడువేలరూపాయలు ఇత్తన్నామన్న మాట. ఏటి ? ఇంటన్నావా ?"

చిన్నబ్బాయి గద్దింపుకి శాంతారావు ఉలిక్కిపడి "అయ్‌బాబు, ఎంతమాటండే తమరు జెప్పేదినక పోడమే ?" అని చిన్నబ్బాయి ముందున్న ప్లేటుని గమనించి గుమ్మం దగ్గరికి గంతేసి

"ఒరే నాయుడూ, ఓరి వంటల్నాయుడూ, అనికేకేశాడు. వంటల్నాయుడు భూమిలోంచి పుట్టినట్టు ఎదురుగా క్షణంలోనిలిచాడు.

"అయ్‌గారికి మావసం తేరా ! గొర్రెమొకుం నాయాలా" అని గద్దించి పళ్లెం అందించాడు. వంటల్నాయుడు ఆ పళ్లెమందుకుని పరిగెత్తినట్టెళ్ళిపోయాడు.

శాంతారావు మళ్ళీ చిన్నబ్బాయి ముందునించుని వినయంగా చేతులు వెనక్కికట్టుకుని "ఆయ్", అన్నాడు.

చిన్నబ్బాయి జింకపిల్ల తలమీంచి మెడమీదిదాకా నిమురుతూ "ఇందాకేమిట్రా అన్నాను ? మనం గవుర్మెంటు కెంతిస్తున్నాం ? ఆఁ.... రోజుకి దగ్గిరగ్గిర మూడేల రూపాయిలు - ఆడికీ ఈడికీ ఇచ్చే మామూల్లు మరో యెయ్యి రూపాయిలు పోగా మన డిపో మెయింటెనెన్సుకి ఇంకో మూడేల రూపాయిలా మొత్తం ఏడు వేలరూపాయిల ఖర్చుపోగా మనకి అంతో ఇంతో మిగలాలి. ఏటి నేజెప్పేది సత్తెవా ? కాదా ?" అన్నాడు.

శాంతారావు ముక్కుమీద వేలేసుకుని నాలికని రెండు వరసల పళ్ళ మధ్య ఇరికించి 'ఎంతమాట !' అన్నట్టు తలాడించాడు. ఈలోగా వంటల్నాయుడు పళ్లెంలో మాంసం ఫ్రై ముక్కల్ని తెచ్చి టేబిలుమీద వుంచి వెళ్ళాడు. చిన్నబ్బాయి రెండు ముక్కలు నమిలి ఓ గుక్క చప్పరించి సిగరెటు అంటించాడు.

"అవునా ? ఇప్పుడ్నీకు 'స్టేటుస్టిక్సు' జెప్తాను. ఎల్లి ఓ కాయితం కలం అట్టుకురా" అన్నాడు చిన్నబ్బాయి.

శాంతారావు తలూపి షెడ్డు కిందికి వచ్చాడు. అక్కడ వున్నతన్ని అడిగి కాగితం, బాల్‌పెన్నూ తీసుకుని మళ్ళీ వచ్చాడు. లోపలికి రాబోయి మళ్ళీవెనక్కెళ్ళి ఓ సిగరెటు అంటించి గబగబా నాలుగు పీల్పులు పీల్చాడు.

పక్కనే వున్న 'లాకప్' రూంకేసి చూశాడు. దాన్లో వున్న లంబాడాల్ని వుద్దేశించి

"ఏరా నాయాల్లారా ! మీ తరుపు వాల్లెవురూ ఫైను కట్టడానికి రాలేదా ఇంకా ?" అన్నాడు.

"గన్నిపైసలు మాదగ్గరెక్కడియిదొరా ?" అన్నాడొకడు.

"అసలు ఫైను గట్టుడేంది ? పంపుతె జేలుకు పంపుండ్రి" అన్నాడు మరోడు.

ఒకడు తుప్పున ఉమ్మాడు.

శాంతారావుకి కోపం పొంగుకొచ్చింది. సిగరెట్టుని గబగబా పీల్చి కాలి కిందపడేసి నలిపాడు కోపంగా. విసురుగా నడుస్తూ చిన్నబ్బాయి గదిలోకి వెళ్ళాడు.

కళ్ళు మూసుకుని ఏదో ఆలోచిస్తున్న చిన్నబ్బాయి అడుగుల చప్పుడికి కళ్ళుతెరిచి "వచ్చేవా ? ఆఁ ఇలకూర్చో ?" అని స్టూలుచూపించేడు. శాంతారావు ఆ స్టూలుమీద నిలబడ్డట్టే కూచున్నాడు.

"అసలు మన యాపారం ఏటంటే శానాగొప్పదన్నమాట. దీన్లోవి కీలకం ఎవుడికి అసలంతు పట్టదు. పౌడర్లూ, స్నోలు యాపారం జేసేవోడు తన వాస్తువుని మడిసి సెర్మం మీదికి మాత్తరం పంపగల్డు. సినిమాస్టార్లయినా, శ్రోతలు ముండ్లయినా అనుబగించినంత సేపేగానీ తర్వాత మర్చిపోతాం. ఎన్ని సుఖాలయినా అనుబగించినప్పుడే ఆనందం. తర్వాతేం మిగల్దు. కానీ మనసాదావుందే - రగతంలో రగతంలా కల్సిపోయి ఆడినెత్తురు గొట్టాల్లో పారుద్ది. ఆడి శరీరమంతా పాకిపోద్ది. గుండెకి తాకుద్ది, మెదడు కెక్కుద్ది. కళ్ళూ సెవులూ నాలికా మొత్తం సెరీరమే దాని కంట్రోల్లోకి వొచ్చేత్తది. అంటే ఏటన్నమాటా ? మనయాపారంమొత్తం మడుసులందర్నీ మన కంట్రోల్లో ఉంచే యాపారమన్నమాట ! స్నోలు, సిల్కుగుడ్డలు, నగిషీ చెప్పులు వద్దనుకుంటే కొనకుండా వుండగలరు గానీ సారా వద్దనుకుని ఉండేవోడు అసల్లేడు. ఎంచేత ? మనం మనవస్తువుని మనిషిలోపలికి ఆడిమాంసకణాల్లోకి గూడా పంపుతాంగదా మరి ! అంచేత ఒరే, ఇలాంటి యాపారాన్ని ఎక్కడైనా సూసేవురా ?" చిన్నబ్బాయి అడిగాడు.

"ఇంతవరకూ మీరుజెప్పేదాకా ఇంత గోల వుందని తెలీదండే !" శాంతారావు బుర్రగోక్కున్నాడు.

"మీ యెదవ మొకాలకి ఇంత తెలివుంటే ఇలాగెందుకుంటారు ? సర్లే. నీకిప్పుడు "స్టాటుస్టిక్సు" జెప్పుతానన్నాగదూ !" అని ఓ క్షణం ఆగి విస్కీ చప్పరించి సిగరెటు అంటించాడు చిన్నబ్బాయి. రెండు నిమిషాలు ఆలోచించి

"ఇప్పుడు మనం మావఁలా తీసుకున్న యేరియాలో జనాభా ఎంత ?" అనడిగాడు.

శాంతారావు బుర్ర గోక్కున్నాడు.

"తెలీదండీ" అన్నాడు నెమ్మదిగా భయంగా.

"ఏం తెలివిరానీది బోడిముండా నాయాల. నీ యేరియాలో జనవేఁ నీకు తెలీక పోతే నీ యాపారం సంగతేం తెలుస్తుంది ? యవారం సంగతేం తెలుస్తుంది ? ఇలగైతే అడుక్కు తినిపోతావుకొరే !" అని చివాట్లేశాడు చిన్నబ్బాయి.

శాంతారావు మాట్లాడలేదు. "సరి. కాయితం మీద రాస్కో. మన యేరియాలో జనాబా మూడులచ్చలమంది." చెప్పాడు చిన్నబ్బాయి. శాంతారావు రాసుకున్నాడు.

"దాన్లో తాగనినాకొడుకులా, ముసిలీ, ముతకా అందర్నీ కలిపి యాభై ఏలమందిని తీసెయ్."

శాంతారావు తీసేశాడు.

"ఆడముండల్నీ పిల్లల్నీ కలిపి లచ్చమందినీ, బ్రాందీ, విస్కీమాత్తరమే తాగే నాయాల్లనీ, కల్లుదాగే దేకూఫ్ యెదవల్నీ మరో యాభై ఏలమందిని తీసెయ్."

శాంతారావు ఆపని చేశాడు

"మనకి మిగిలిందెవరూ ? లచ్చమంది సచ్చు పీనుగులు. మల్లీ ఈ నా కొడుకుల్లో రోజూ తాగేవోల్లూ, ఎప్పుడన్నా తాగేవోల్లు అని రెండ్రకాలువుంటారు. ఏటి అవునా ?"

"అవునండి"

"రోజూ తాగేవోల్లు యాభై ఏలమందనుకో. ఈల్లు మన రెగ్యులర్ కస్టమర్లన్నమాట. ఆల బలయీనత మీదే మన యాపారం. మనదేటి ? అసలేయాపారమైనా మడుసుల బలయీనతమీదే నడుసుద్ది. సరి. ఈ మందిలో మల్లీ సిక్కుండి."

"ఏటండే ? !"

"ఈలల్లో రోజూ వంద్రగాములు రెండొందలు ఐదొందలు తాగే వోలుంటారు. కాబట్టి మనం సగట్న ఒక్కోడికి రెండొందల గ్రాముల లెక్కేసుకోవాలి" చిన్నబ్బాయి చెప్పిన అంకెని శాంతారావు కాయితంమీదరాశాడు.

"సగటున ఒక్కోడు రెండొందల గ్రాములు తాగితే యాభైవేలమందికి పదేల లీటర్ల సారా రోజుకి కావాలన్నమాట. ఏటి ? అంతేనా ?"

"అంతేనండి" శాంతారావు తలాడించాడు.

చిన్నబ్బాయి చిన్నగానవ్వి

"ఈ పదేల లీటర్లూ మనం లీటరు ఆరురూపాయల సొప్పున గవర్మెంటు డిపోలో కొంటాం. ఎంతవుద్ది ? అరవై ఏలరూపాయలు. దాని ట్రాన్సుపోర్టేషను కర్సే మరో రెండేలు. మొత్తం అరవై రెండేల రూపాయిలకర్సు. ఔనా ! రాస్కో మరి—."

శాంతారావు రాశాడు.

"ఈ అరవై రెండేలకి మన రోజువారీ కర్సులు ఏడేలు కలుపు. మొత్తం ఎంతయిందీ ?"

"అరవై తొమ్మిదివేలండి !" శాంతారావు చెప్పేడు.

"మరిగ మనం లీటరు ఎంతకమ్ముతాం ?"

"ఇరవై రూపాయిలకండీ !"

"అంటే పదేల లీటర్ల కి ఎంతన్నమాటా ?"

శాంతారావులెక్కేశాడు. మొత్తంరెండు లక్షలు. రోజుకి రెండు లక్షలు !

"పదివేల లీటర్లకి రెండు లక్షలవుతుందండే !"

చిన్నబ్బాయి నవ్వాడు.

"ఆ రెండు లక్షల్లోంచీ మనకర్సులు అరవై తొమ్మిదేలు తీసేయి"

శాంతారావు తీసేశాడు.

"లక్షా ముప్పయ్యొక వేయి మిగిలిందండి"

"దాంట్లో మన యేజంట్ల కమీషనుపోగా మనకి నికరాదాయం లక్ష రూపాయలు. ఓరి నచ్చుమొగం నాయాలా ! ఇను మన డిపోకి రోజుకి లక్షరూపాయిల నికరాదాయం !"

చిన్నబ్బాయి విస్కీగ్లాసుని అమాంతం ఎత్తితాగి గట్టిగా నవ్వాడు.

శాంతారావు గుండె ఆగిపోయినట్టయింది. ఇదంతా నిజమేనా? రోజుకి లక్ష రూపాయల ఆదాయం ఏ వ్యాపారంలోనైనా ఉంటుందా? ఒకవేళ దీన్లో సగం, అంతెందుకు పావువంతు చూసుకున్నా రోజుకి పాతికవేల ఆదాయం ఎటో పోదుగదా! అతడు విభ్రమం నుంచి తేరుకోకముందే చిన్నబ్బాయి అన్నాడు.

"కలగంటన్నావేట్రా? ఓరి ఓరి నా కొడకా! ఎంత లాభం లేనిదే దేశం వొదిలి పెల్లాం బిడ్డల్నొదిలి ఈ పరప్రాంతం వొచ్చి ఇన్ని కష్టాలు పడతామనుకున్నావురా! రోజుకి లక్ష రూపాయిల లాభం అంటే పైసా వాటాగాడికి యెయ్యి రూపాయలు రోజు వాటా లాభం అన్నమాట. అంటే ఏటి? ఇంటన్నావురా శంత మొద్దునాయాలా! నీ వాటా లాభం రోజుకి యెయ్యిరూపాయిలు"

శాంతారావు అవాక్కైపోయాడు. సంవత్సరం పేరుమీద రెండో మూడో లక్షలు తీసుకోడమే గానీ ఈ లెక్కలు ఇవన్నీ తాను చూసుకోలే దెన్నడూ. అయితే పావలా వాటా వున్న చిన్నబ్బాయి కెంత ఆదాయం వుందో? ఇంత ఆదాయం వుండే వ్యాపారం ఇంకేదీలేదు. కాకపోతే కాస్త రిస్కు.

శాంతారావు ఆలోచిస్తుండగానే చిన్నబ్బాయి గ్లాసు ఖాళీ చేసి మళ్ళీ నింపుకుని

"ఏట్రారే ఆలోచిస్తన్నావు! నీ ఆలోచన కట్టిపెట్టు. నే జెప్పేది ఇను. దీన్లొ ఎంత లాబం వుందో జెప్పాగదా! ఈ లాబానికి అడ్డొచ్చేవోల్లూ వుంటారు. ఆలే దొంగసారా నాయాల్లు. ఆలవల్లే మన జాతకం తిరగబడిపోద్ది. అంచేత ఆల్లవల్ల మన కెంత నస్టమో, మేరే జెప్పాల్సిందేవీఁలేదు. అవుసరమైతే మడుసుల్ని ఎగరదీసేడవేఁ"

"దొంగసారా అంటే ఇంకో చిక్కుందండి. కోయనాయాల్లు, లంబాడి నా కొడుకులు ఆల సారా ఆల్లే కాసుకుతాగుతారండి. ఆ గూడేలలో మన సారా అవుసరమే పడదుగదా! అదెలాగండి?"

"ఆల్ల సారా ఆల్లు తాగడవేఁ గాక ఇతర్లకీ అమ్ముతున్నారని కేసు పెట్టడవేఁ. తెచ్చి బొక్కలో దోసి ఫైను వసూలు జెయ్యటమేః" చిన్నబ్బాయి వివరించాడు.

"ఆయ్. నేనాపన్జేస్తుంటేనే ఈ గిరిజనసంగాడు అడ్డు దగిలి నన్ను మట్టి కరిపిత్తున్నాడండి" శాంతారావు చెప్పాడు.

"ఏటంటాడు ఆడు ?"

"ఆడేటీ అనడండి. మన డూటీ మనం జేస్కో-కుండా చెయ్యడమే ఆడి పని. ఆడి పారిటీ ఏదో వుంది. దాంతో తెగ రేగిపోతున్నాడండి"

చిన్నబ్బాయి పెదాలు ఓసారి బిగించి వదిలి "పార్టీ కేమన్నా సందా లిత్తా ననలేక పొయ్యావా ?" అన్నాడు.

"అయ్‌బాబు, నా కంతమాత్తరం తెలీదండీ! కాని ఆడిది సందాలపారిటీ గాదండి, ఆ మాటంటే నాలిగ్గోత్తాడని జనం జెప్పారండి"

"మరాణ్ని ఏటి సెయడం ?" చిన్నబ్బాయి సాలోచనగా అన్నాడు.

"మనవేం జెయ్యక్క-ర్లేదండి. మొన్నో పారిటీలో ఎస్సై మనోడొగుడు గల్సి కుశల మడిగాడండి. అడికి ఈడి కతంతా జెప్పానండి. ఈడు నక్సలైటోడు గదా. ఎన్‌కౌంటర్ లిస్టులో ఆడి పేరుంచటండి. ఆడు కన్పిత్తే ఇగ కాల్సేడవేఁ ఆలీసెం" శాంతారావు వివరించాడు.

"అలాగా! అంతేలే మన చీఫ్ మినిష్టరుగూడా తుపాకిని తుపాకితో ఎదురుదెబ్బ దీత్తానని ఈ మద్దినేగా అన్నాడూ! గౌర్మెంటు సొరవతో పని జరిగి పోద్దిలే. ప్రమోషన్ల ఆశతో ఎస్సై నాకొడుకులు కాల్లువీకేలా తిరిగైనా ఆడి జాడ కనుక్కు-ని కాల్చిపారేత్తారు!" ఈ మాటలు అని చిన్నబ్బాయి ఏదో గుర్తొచ్చినట్టు.

"మరిదీన్లో మన యేలున్నట్టు తెలీగూడదురోరే! ఎవుడిమీదో తోసెయ్యాల! గౌర్మెంటు పూనుకున్నప్పుడు మనం బయట పడటం మంచిదిగాదు" అని ఏదో ఆలోచిస్తూ చిన్నబ్బాయి ఊరికే ఉండిపోయాడు. గ్లాసుడు విస్కీ- అమాంతంగా తాగేడు.

నిమిషం, ...

రెండూ, మూడూ, పదీ ....

పావుగంటయింది.

ఎడం శాత్తో జింకపిల్ల మెడని నిమురుతూ ఉండిపోయాడు చిన్నబ్బాయి.

"ఈ విషయంలో ఏం జెయ్యమని తమరి సలా?" శాంతారావు అడిగేడు.

చిన్నబ్బాయి ఒక్క- విసుర్న లేచేడు. అతడి ఎడం చేతిలో జింక పిల్ల మెడ వుంది. కుడిచేయి పిడికిలి బిగించి శాంతారావుని దవడమీద గుద్దేడు.

"లంజా కొడకా! తత్తవశాష్త్రం జెప్పొగ్గూడా ఎర్రిపెళ్ళ లేత్తావేరా పేకార్నా కొడకా!"

కాంతారావు దిమ్మెరపోయాడు.

చిన్నబ్బాయి ఉగ్రరూపం దాల్చాడు. అతడి కళ్ళు నిప్పులు చెరుగుతున్నాయి, పిడికిళ్ళు బిగుసుకున్నాయి. ఎడమచేతి పిడికిలిలోవున్న జింకపిల్ల ఊపిరాడక గిజగిజలాడి చచ్చిపోయింది.

చిన్నబ్బాయి జింకపిల్ల శవాన్ని మూలకి విసిరాడు,

"ఫో! లంజా కొడకా! తేరగా ఉందని తిని తాగడం, అవసరమైన డబ్బు అంకించుకోడం తప్ప ఏం తెలీదు నాయాళ్ళకి! నీ యమ్మా మొగుడిదా లేప్పోతే నీ పెళ్ళాం మొగుడిదా ఎవుడిదనుకున్నారా సొమ్ము? సోవిం(ఒ క్తి లేదు, యిశవాసం లేదు ...."

చిన్నబ్బాయి ఇంకా ఎన్ని తిట్టేవాడో గానీ గుమ్మంలో గులాంఖాన్ ప్రత్యక్షమయాడు. గదిలో అడుగుపెట్టిన గులాంఖాన్ కాంతారావునీ, మూలకి చచ్చి పడున్న జింకపిల్లనీ, చిన్నబ్బాయినీ చూసి జంకి వెనక్కి తిరగబోయాడు.

చిన్నబ్బాయి పిలిచాడు. "ఏట్రా! ఎలిపోతన్నావు?"

"అబ్బే.... ఏం లేదండి. రాగూడని టయాంలో వచ్చేనేమోనని...." నసిగాడు గులాంఖాన్.

గులాంఖాన్ వచ్చాడంటే వాడితోపాటు ఎవర్తో గుంటముండ వచ్చిందన్న మాటే అనుకుని కాంతారావు గుమ్మం దాటాడు. అతడు గుమ్మం దిగుతుంటే నీడలో వున్న ఎస్తర్ కన్పించింది.

"ఓ, నువ్వేనా?" అన్నాడు కాంతారావు.

"ఆఁ. మరే!" అని నవ్వింది ఎస్తర్. ఆమె రెడ్డి క్రైస్తవురాలనని చెప్పుకుంటుంది. హరిజన క్రైస్తవుల్ని దగ్గరికి రానీదు.

ఆమె మెట్లెక్కుతుంటే ఆమె హొయలునీ, సొగసుల్నీ చూసి కాంతారావు వేడెక్కిపోయాడు. ఆ పట్టున వెళ్ళి లాకప్‌రూంలో లైటు వేశాడు.

నిద్రపోతున్న లంబాడాలు ఉలిక్కిపడి లేచారు. చిన్నబ్బాయిమీది కోపమూ, తనకు దక్కని ఎస్తర్ అందమూ హృదయాన్ని రగిలిస్తుండగా సైరుబెల్టుని చేతిలోకి తీసుకున్నాడు శాంతారావు.

ఆ రాత్రంతా లంబాడాల రోదనలతో డిపో ప్రతిధ్వనించింది.

× × ×

తండాలోని ముప్పై గుడిసెల్లో అదో మూలగుడిసె.

లోపల గిరిభూషణం కూచుని వున్నాడు. అతని ముందు మరో ఇద్దరు మనుషులు కూచుని మాట్లాడుతున్నారు.

గిరిభూషణం బనీనూ, లుంగీ వేసుకుని వున్నాడు. మనిషి కాస్త విశ్రాంతిగా కూచుని ఎదుట వున్నవాళ్ళు చెప్పేది వింటూ తగిన సమాధానాలు ఇస్తూన్నాడు.

మధ్యాహ్న సమయం. రెండుగంటలు కాలేదు. బయట ఎండ నిప్పులు చెరుగుతోంది. ఏప్రిల్ సూర్యుడు తండామీదే ఆగి కదలటంలేదు. గాలి గూడా స్తంభించిపోయింది.

ఒక స్త్రీ గుడిసె లోపలికి వచ్చింది. "నీ కోసం ఎవలో వచ్చిన్రు" అందామె.

గిరిభూషణం తలతిప్పి "ఎవరు ?" అన్నాడు.

"ముగ్గురు ఆడోళ్ళు ఇక్కడోళ్ళే."

"ఏం పనట ?"

"ఏమో చెప్పలే గని ఇంటి పంచాయితులు చెప్పుకుంటరేమొ ?" అందామె.

కళ్ళకున్న అద్దాలు తీసి ముఖంమీది చెమట తుడుచుకుని "మంచిది. మాట్లాడుతున్నగద. కాసేపు బయట కూచోమను" అన్నాడు గిరిభూషణం. అతడి వయసు పాతికనుంచి ముప్పైలోపు వుంటుంది. కోరమీసాలున్నాయి. ఆ ప్రాంతంలో ప్రజలకి అతడు కొండంత అండ. అత్తాకోడళ్ళ తగువుల్నించి భూస్వాములు చేసే దౌర్జన్యాల దాకా అతడు తీర్పు చెప్పాల్సిందే.

అరగంట గడిచింది. గుడిసెలోపల మాట్లాడుతున్నవారి మాటలు తెమలడంలేదు. ఇంతకు ముందు వచ్చిన స్త్రీ మళ్ళీ గుడిసెలోకి తొంగిచూసింది. గిరి భూషణం ఎదురుగా వున్నవాళ్ళకి ఏదో వివరిస్తున్నాడు. అతడు మాట్లాడేదంతా వాళ్ళు శ్రద్ధగా వింటున్నారు. వాళ్ళని మధ్యలో పలకరించటం దేనికని ఆమె మళ్ళీ బయటికి పోయింది.

గుడిసె బయట ఎండ చిట చిట లాడుతూ వుంది. ఎండలో ఉండటం కష్టమనిపించి చూరువారన నిలబడిందామె. ఎదురుగా వేపచెట్టుకింద ముగ్గురు స్త్రీలు కూచుని వున్నారు. వాళ్ళు తమలో తామే ఏదో మాట్లాడుకుంటూ కూచున్నారు. మరీ వయస్సు తక్కువగా ఉన్న స్త్రీ కోడలు కాబోలు వృద్ధురాల్ని కొరకొరా చూస్తోంది.

ఆకు గూడా కదలటం లేదు: సూర్యుడు తండామీది నుంచి కదలడం ఇష్టంలేని వాడిలాగ మెల్లిగా పడమటికి కదులుతున్నాడు.

× × ×

తండాకు రెండు 'ఫర్లాంగుల దూరంలో ఓ చెట్టుకింద జీపు ఆగింది. దాన్నిండా కిక్కిరిసిట్టు మనుషులున్నారు. వాళ్ళు అంటీ నక్సలైట్స్ స్క్వాడ్‌వాళ్ళు. వాళ్ళలో కొందరు ప్యాంట్లు విప్పి లుంగీలు వేసుకున్నారు. మొలలో రివాల్వర్లు దోపుకున్నారు, చేతుల్లో రెండు పొట్టికర్రలు భుజాన పెద్ద సంచులు వేసుకున్నారు అయిదారుగురు కల్సి తండావైపు బయలుదేరారు.

ఇలా కప్పలు పట్టేవాళ్ళ వేషంలో బయలుదేరిన పోలీసులు నిమ్మలంగా సిగరెట్లు కాలుస్తూ తండాను సమీపించారు. మిగతావాళ్ళు జీపులో వెనకే వుండిపోయారు.

"ఇంతకు వాడు ఈ తండల్నే వున్నడంటరా" ఒక డడిగాడు.

ఆ స్క్వాడ్‌లో నాయకుడులా కన్పిస్తున్న వాడొకడు విసుక్కున్నాడు. "వాడిక్కన్నే వున్నడని మనకి ఇన్ఫర్మేషన్ రానే వచ్చె, యింకా అనుమాన మేందిర - జల్దీ నడువుర్రి - ఆలస్యం జేస్తె వాడవుతలబడ్తడు" అన్నాడు.

"నీయ్యమ్మ! యెం తొవ్వో యిది యేం రాళ్లు - ఎండకాలం గాబట్టి వత్తానంగని యింకో కాలంలయితె వచ్చేటానికి వీలుంటద"అని ఒకడు చికాకుపడ్డాడు

"ఈ తండ కసలు తొవ్వేలేదు. వీల్లు యెట్ల దిరుగుతరో యేందో - వీల్లెంబడి బడ్డందుకు మనం గూడ ఈ కంపల్ల కంచె తొవ్వల్ల తిరిగి సావాల్నాయె."

"ఔరా మరి, పని నెత్తిలేసుకున్నప్పుడు యెంత కష్టమయితేంది, తిరుగాలె - ప్రమోషన్లు వట్టిగనె వస్తాయి దే!"

× × ×

"అన్నం దిన్నంక మాట్లాడరాదు" అందామె గిరిభూషణంతో.

పక్కనున్నవాళ్ళు గూడ "నిజమె నిజమె తిన్నంక మాట్లాడుదాం, కాన పొద్దుబెయింది"

అతడు నవ్వుతూ లేచాడు

కుండలో అన్నం అల్యూమినియం ప్లేటులో వడ్డించింది.

ఎండాకాలం అన్ని పగళ్ళలాగె మధ్యాహ్నపు గాలి వేడిగా గూబల్ని అదరగొడుతోంది. నూర్చిన పొలాల్లో మట్టి సుడిగా పైకి లేస్తోంది. ఒక పెద్ద సుడి తండా వైపు దూసుకు వచ్చింది.

బయట చెట్టుకింద కూర్చున్న స్త్రీలు వడగాలికి కొంగులు చెవులమీదికి లాక్కున్నారు.

"యింకొంచెం తిన్రాదు" అందా స్త్రీ గిరిభూషణంతో.

"యిగ బొయ్యేటోన్నెగద, సాలదా తియ్" నవ్వుతూ చెయ్యి కడుక్కున్నాడు అతడు.

మూతి తుడుచుకుంటూ తనకోసం కూర్చున్నవాళ్ళ దగ్గరికివచ్చి మాటలు మళ్ళీ కొనసాగించాడు.

తండా ముందుభాగాన గుడిసెముందు ఆడుకుంటున్న కుర్రవాళ్ళు ఆటల్ని ఆపి తల తిప్పి చూశారు. వాళ్ళకి అయిదారుగురు కొత్త మనుషులు కనపడ్డారు. వాళ్ళ చేతుల్లో పొట్టి క్రరలు భుజాన సంచులు వాళ్ళకు చిత్రంగా తోచాయి. "యేంగావాలె" అన్నాడు కుర్రాళ్ళలోని కొంచెం పెద్దవాడు.

"అరేయ్ ఆ గుడిసెలకు బోయి గిరిభూషణంతోని యెనలో వచ్చిన్రు మాట్లాడాల్నట రమ్మంటాండ్లు అని చెప్పపో" అన్నాడు ఆ స్క్వాడ్‌లో నాయకుడి లాంటివాడు.

కుర్రవాడు గుడిసెలవేపు పరుగెత్తాడు.

"అయితె కుందేలు ఇక్కన్నే వున్నదిరో" అని రివాల్వరు తమిడి జూసు కొని ముందుకు కదిలాడు నాయకుడు- మిగతావారు అనుసరించారు.

కుర్రవాడు గుడిసెలోపటికి తొంగిచూసి "యెవరో వచ్చిన్రు, మాట్లాడా ల్నట" అన్నాడు గిరిభూషణంతో.

గిరిభూషణం ఉలిక్కిపడ్డాడు. యెవరా వచ్చింది, మిత్రులా శత్రులా తన దగ్గిర ఆయుధంగూడాలేదు. అనుమానపడుతూ గుడిసె గుమ్మందగ్గరకు వచ్చాడు. యెదురుగా వస్తున్న వాళ్ళను చూడగానె తెల్సిపోయింది. అంటే నక్సలైట్ స్క్వాడ్! తనని ఇదివరకు యెన్నోసార్లు చంపాలని ప్రయత్నించారు. కాని తాను వెంట్రుకవాసి లో తప్పించుకున్నాడు. ఇప్పుడు ఇక్కడికూడా నీడలా వెంటాడుతూ వచ్చారన్న మాట. యెవడో ద్రోహి సమాచార మిచ్చి వుంటాడు.

వెనక్కి గుడిసెలోకి వెళితె లాభంలేదు. గుడిసెదాటి ముందుకు పరుగె త్తాడు. పరుగెత్తటానిక్కూడా వీల్లేకుండా అడ్డదిడ్డంగా వున్నాయి గుడిసెలు. పది గజాలు పరుగెత్తాడోలేదో వెనక రివాల్వర్ పేలింది. గుండు కాలిలో దిగబడింది. బాధతో అరచి ముందుకి బోర్లాపడ్డాడు. కట్టుకున్న లుంగీ అస్తవ్యస్తంగా కాళ్ళకి అడ్డం పడుతోంది. గుండుదెబ్బ బాధిస్తోంది. అయినా శక్తిని కూడదీసుకొని తుప్ప ల్లోంచి డొంకల్లోంచి పరిగెడుతున్నాడు.

ఒకేసారి రెండుమూడు రివాల్వర్లు మొరిగాయి- చెట్టుకింద కూర్చున్న స్త్రీల్లో ఒకామె ఆ దృశ్యం చూసి భయంతో అరవబోయింది. రెండో ఆమె చేయిపట్టు కుని లాగి నోరుమూసింది.

గిరిభూషణం మట్టిలో బోర్లాబడిపోయాడు. అతని వీపులో డొక్కలో గుళ్ళు చేసిన గాయాలనుంచి రక్తం స్రవిస్తోంది. కళ్ళు సగం తెరుచుకొని తండాను చూస్తున్నాయి. బిగించిన పిడికిళ్ళ నిండా నల్లటి మట్టి వుంది.

O

డాక్యుమెంటరీ :

భవిష్యత్తు చిత్రపటం

వరవరరావు

కరీంనగర్ సభల గూర్చి
కథలు కథలు సెప్పుతున్రు
మనసు తప్ప కళ్ళు దీన్ని
మళ్ళి మళ్ళి సూడలేవు ॥కరీం॥

రైతుకూలి సభలంట
రాడికల్ల సపోర్టంట
ప్రజాయుద్ధ పంథాలో
ప్రజాస్వామ్య విప్లవమట ॥కరీం॥

జగిత్యాల జరిగి జరిగి
కరీంనగర్ కొచ్చెనంట
జగిత్యాల పెరిగి పెరిగి
కరీంనగర్ కొచ్చెనంట ॥కరీం॥

జగిత్యాల ఒదిగి ఒదిగి
కరీంనగర్ కొచ్చెనంట
జగిత్యాల ఎదిగి ఎదిగి
కరీంనగర్ కొచ్చెనంట ॥కరీం॥

నక్సల్బరి తిరిగి తిరిగి
కరీంనగర్ కొచ్చెనంట
కరీంనగర్ కలలుపండి
కరీంనగర్ కొచ్చెనంట ॥కరీం॥

జగిత్యాల జైత్రయాత్ర
తొలి మజిలీ చేసెనంట
శ్రీకాకుళ కమ్యూను
శిరమెత్తి చూసెనంట ॥కరీం॥

ఊరు వాడ వరదలయ్యి
ఊరేగింపులో కలిసె
ఎగసిన అలలై ప్రజలు
ఎర్రసముద్రం కదిలె ॥కరీం॥

నేల ఈనినట్లు జనం
నాలుగు దిక్కులనుంచి
నాగేటి చాళ్ళవెంట
నడిచి వచ్చినారంట ॥కరీం॥

భూమయ్య కిష్టగౌడు
పొంగించిన గోదావరి
మృతవీరుల స్వప్నాలను
పండించగ సాగిందట ॥కరీం॥

కమ్యూన్

అది చెరువుషికం
అక్కడ ఒక కమ్యూన్ నిర్మించవచ్చని
కమ్యూనిస్టులు చూపేదాకా కరీంనగర్‌కు తోచనేలేదు
పెద్ద పెద్ద నిర్మాణాలు అజమాయిషీ చేసే వాళ్ళందరూ
నిద్రలేచి చూసేవరకు
అక్కడ శిరమెత్తి నిల్చున్నది శ్రీకాకుళ కమ్యూన్
చెట్లులేనిచోట చెమటే గూడై నీడనిస్తుందని
ప్రజలు పోగుపోగుగా తాడై బారచాచితే
పాతాళం నుంచి నీళ్ళు పైకొస్తాయని
ప్రజలకు సేవచేసే కథలు
పుస్తకాల్లోకాదు కళ్ళముందు చూపుతూ కమ్యూన్

వాళ్ళు వలంటీర్లు
'భూమిని తలకిందుచేసి
బువ్వపంచి' యిచ్చేటోళ్ళు
వాళ్ళ చేతుల్లో
మైలుదూరంనుంచి నీళ్ళుతేవడానికి కుండలు
బావి వాళ్ళచేతుల మీదగా
కాలువై ప్రవహించి దప్పికనోళ్ళను చేరుకుంటున్నది.
మృతవీరుల పోరాట స్వప్నాలను చూపేచిత్రాల
'హరిభూషణ్ ఎగ్జిబిషన్' ముందు వలంటీరు
రెండురోజులుగా ఎండవచ్చినా ఎన్నివచ్చినా కదలకుండా.
దారిచూపుతూ వలంటీర్లు
వాళ్ళ సంచుల్లో కడుపునొప్పికీ నెత్తినొప్పికీ మందులు
వాళ్ళ చంకల్లో కర్రలకు ఎర్రజెండాలు

పద్మాక్షిగుట్టలో ఆయుధాల తయారీ కథలు సృష్టించే బద్మాషులు
మండుటెండను మంచినీడగా మార్చిన
ఈ సృష్టికర్తల నిర్మాణానికి దివాంధులు

వంటలు చేసింది వాళ్ళు వడ్డన చేసింది వాళ్ళు
క్రమశిక్షణ గేటుదాటి పాఠం చెప్పింది వాళ్ళు
పాటలు కట్టింది వాళ్ళు పాటలు పాడింది వాళ్ళు
పాట పాట పదాల్లో పోరాట పథాలు వాళ్ళు.

ఎవరూ ప్రేక్షకులు కారు
ఎవరూ శ్రోతలుకారు
ఎవరి కాళ్ళతో వాళ్ళే ప్రయాణించివచ్చినోళ్ళు
ఎవరి కాళ్ళతో వాళ్ళే పోరాడుతు నిలిచినోళ్ళు

టిక్కెట్ గొని రైలు దిగి
మక్కెలిరుగ తన్నులు బడి
బస్సులో ప్రయాణంజేస్తే
దింపబడి దోచబడి
హింసకు గురియైన వాళ్ళు

సభకూడా పోరాటపు రూపంగా ఎంచినోళ్ళు
సభకోసం పోరాటపు సందేశం తెచ్చినోళ్ళు
నిర్బంధం మధ్య సభల నిగ్గుదేల్చవచ్చినోళ్ళు

సంజయ్ ర్యాలీకాదు
చరణ్‌సింగ్ సభకాదు
మహానాడు కాదు తెలుసు
రైలు లేదు లారిలేదు
అడుగడుగున నిర్బంధం
కోటిరూపాయల ఖర్చులేదు
కోటికి పడగెత్తినోళ్ళ నీడలేదు
గుడారాలే తప్ప 'కుటీరాలు' లేవు

సభకోసం పోరాటపు సందేశం తెచ్చినోళ్ళు
ఎవరూ ప్రేక్షకులు కారు
ఎవరూ అతిథులు కారు
ప్రతి ఒక్కరు పోరాటపు
చరిత్ర రచియించినోళ్ళు

ఏలూరులో వేగిపొలం
సాగుజేసి వచ్చినోళ్ళు
ఉయ్యూరులో లంకపొలం
వంక తీర్చి తెచ్చినోళ్ళు
చిత్తూరులో భూస్వాముల
చిత్తుజేసి వచ్చినోళ్ళు

శ్రీకాకుళ సీమనుంచి
సత్యం తమ్ములు వచ్చిరి
కోయజూడు నెమలివోలె
కోరన్నను నెమరేసెను
గోండుజూడు 'రాంరాం'అని
కొమరంభీమును తలచెను
అల్లూరి వారసులు
అడ్డతీగల గిరిజనులు
గోదావరి కెదురెక్కి-
ఏటికి ఎదురీదినారు
సిరొంచ అడవుల నుంచి
శంకరన్న తమ్ములంత
సిరులు పండే అడవి మాదని
చాటి చెపుతూ వచ్చిరంట
ఇందూరు నుంచి
రాంచందర్ జండా బట్టుక
లంబాడి తండలు వచ్చెను
వరంగల్లు బందుజేసి
హరిభూషణ్ వారసులు
భద్రాచలం అడవి నుంచి
భవిష్యత్తు వారధులు
రాయలసీమ నుంచి
శ్రీరాములు హరి అన్నలు
దుక్కికి చాలయినోళ్ళు
చాలు వెంట సాగినోళ్ళు
నాటు వేసి కోత కోసి
నారి మోగించి నోళ్ళు
రణభేరీ మోగించినోళ్ళు
స్త్రీలా పురుషులు వచ్చిరి

ఎవరూ ప్రేక్షకులు కారు
ఎవరూ అతిథులు కారు
ప్రతి ఒక్కరు పోరాటపు
చరిత్ర పుట తిప్పినోళ్ళు

పతాకావిష్కరణ

'శ్రమజీవుల రక్తంతో
జెండా నెగరేశాము
మృత వీరుల ఆశలతో
మును ముందుకె పోతాము'

సంస్మరణ

ఇక్కడ కడుపుశోకం లేదా ?
అది పంచుకునే కడలి ఉన్నది
ఆ జ్ఞాపకాలు కన్నీళ్ళు కావా ?
అవి చిందిన నేలలో పోరాటాలైనవి
వాళ్ళు తమ రక్తబంధాన్ని
వర్గపోరాట జెండాగా మన కందించడమే కాదు
తామూ అందుకొని వచ్చారు
పదిమందికోసం చావు పెళ్ళిగా
మన ముందు ఆనంద బాష్పాలతో
మననం చేసుకుంటున్నారు
'తియ్యని బాధ'ను వెనుదియ్యని
వర్గచైతన్యంగా తెలుసుకుంటున్నారు
తీరని బాధను కసిదీరని
వర్గపోరాటంగా మలచుకుంటున్నారు.
తమ నెత్తుటి సోగలను పోగొట్టుకున్న వాళ్ళు

సహచరుల్ని త్యాగం చేసిన వాళ్ళ
బతుకు దుక్కిలో తోడయిన రెక్కలిరిగిన వాళ్ళ
మొక్కలోనే కనురెప్పలు కత్తిరించబడ్డ కనుపాపలు
అసహాయులు అనాథలు నిరాశ్రితులు
అందరూ వసుధైక కుటుంబీకులై
తమ బలగంలో కొచ్చారు
తమ రక్తం పరిమళిస్తున్న ఎర్రపూలవనంలో కొచ్చారు
తమ రక్తం అందించిన సందేశాన్ని అందుకొని
మునుముందుకు గాలిలా వ్యాపించడాని కొచ్చారు
వీరుల సంస్మరణ విషాదాన్ని శేదు
విప్లవోత్తేజాన్ని వెలిగిస్తుంది

పల్లవి

మోట కడుతూ నాటు పెడుతూ
కలుపు తీస్తూ కల్లు గీస్తూ
బీళ్ళు దున్నుతు నీళ్ళు కడుతూ
కోత కోస్తూ కుప్ప గొడుతూ
పశుల గాస్తూ పెండ దీస్తూ
మగ్గమేస్తూ పగ్గమేస్తూ
కంపవెలుగుతు గంపలెత్తుతు
కుమ్మరాముకాడ సాముకాడ
కొలిమి కాడ దొర కొలువుకాడ
సహస్ర వృత్తుల
సమస్త బాధలూ గాథలూ మాత్రమే కాదు
చైతన్యాన్ని స్పందించే పాటలు
ఆటలూ నాటకాలు
రూపాలూ రూపకాలు

ఈ నాగేటి చాళ్ళవెంట
నూతన ప్రజాస్వామ్యమే కాదు

సంస్కృతిని కూడ విత్తుతూ
సాగుతున్న నక్సల్బరి
మంచెమీది రైతు వడిసెల పాట
గ్రామాలకు తరలిన
రాడికల్స్ చంక సంచిలో
జె ఎన్ ఎం పాటలే చేతిబాంబులు
ఊళ్ళోకి పోరాటపు
ప్రవేశపు పాస్‌పోర్టు పాట
ప్రజల పర్మిషన్ పాట
పోలీస్ పర్మిషన్ నిషేధం పాట
కాడి పట్టినోనికి కూడు పెట్టేది
పోరాటమైతే
కాడి మేడి పట్టినోళ్ళను
కూడగట్టేది పాట
జననాట్యమండలి డప్పుమోత
జనం గుండెల మోత
జననాట్యమండలి గజ్జెల రవళి
జనం సంకెళ్ళు విరుగుతున్న సవ్వడి

'గోచి పేల్క గట్టుకోని
గొంగడి భుజానేసుకోని
బిరబిర' నడుస్తున్న పీడితులంతా
తమ కలల్నే కాదు
కళల్ని పండించే
పోరాటం చేస్తున్నారు
వ్యవసాయ విప్లవమే కాదు
సాహిత్య వ్యవసాయ విప్లవం తెస్తున్నారు

ఎవరు కట్టిన పాటలు !
ఎవరు నేర్పిన ఆటలు ?

'ఏ శిల్పం ? ఏ గాంధర్వం ?
ఏ వెలుగులకీ ప్రస్థానం ?'
పాట పోరాటపు పొత్తిళ్ళలోని కేరింత
పాట ఉద్యమం నెలబాలుని పులకరింత
పాట నెత్తుటి మడుగులోంచి పాలపుంత
పాట కర్షక- కార్మిక కళాకారుల కౌగిలింత
పాట పురి పాట దరి
పాట పోరాటపు ఊపిరి

పాట దమ్ము తీసుకొని పోరాటం సాగింది
పోరాటం నేపథ్యంలో పథ్యంలో విరామంలో
అవిరామంగా పాట ఉద్రూత లాగింది

కర్తవ్యం

రైతుకూలీ సంఘం స్వభావాన్నీ
విశాల ఐక్య సంఘటన లక్ష్యాన్నీ
నలుగురు కలసి మెలిసి
నడవ వలసిన అవసరాన్నీ
పోగుపోగు దారమయ్యే తీరును
చుక్క-చుక్క- సముద్రమయ్యే నీరును
గడ్డిపోచలు ఏనుగును కట్టేసే రీతిని
చిన్నపామునైనా పెద్దకర్రతో కొట్టాలనే నీతిని
ఆ సభ చర్చించింది
తన గురించి తెలిపే ప్రణాళికను
తన అవగాహనకు అద్దం పట్టే
రాజకీయ తీర్మానాన్ని
సభ సమీక్షించింది
నడచి వచ్చిన దూరాన్ని
నష్టాలతో కష్టాలతో కొలిచింది
త్యాగాలు సాధించిన విజయాలతో తలచింది

నడవవలసిన దూరాన్ని
దీక్షతో లక్ష్యంగా నిలిపింది
తుడుచుకున్న కన్నీళ్ళతో
సాధించిన ఫలితాల సూర్యకిరణాల
ప్రతిఫలనాన్ని పసిగట్టింది
త్యాగాలు జ్ఞాపకాలు కావు
పోరాట సోపానాలనీ
తిరుగుబాటు అరాచకం కాదు
చీకటి తెర తొలగే వేళ అనీ
తెలంగాణ నుంచి నక్సల్బరీ దాక
శ్రీకాకుళం నుంచి కరీంనగర్ దాక
శ్రీకాకుళం కమ్యూన్
దినమూ రాత్రీ
తన కరడాలు తాను దిద్దుకున్నది
వేసిన ఎరడాలు వానగుర్తని
వాన వాసన వేస్తున్నదని చెప్పింది
రోహిణి కార్తె సూర్యుణ్ని చూడు
చంద్రుని చుట్టూ వానగూడు చూడు

'నాగేటి చాళ్ళలో....' నాటకం ఆడుతూ ఉంటే
నిజంగానే సింబాలిక్‌గా
ఆరోజు రాత్రి వాన కురిసింది.
నాటకం ఆగింది కానీ
నాగేటి చాళ్ళు సాగినయి
నాగేటి చాళ్ళలో సాగిన
రైతాంగ పోరాటం సాగుతుంది

ఊరేగింపు

అడుగులు నడకలు గడచి
ఉరుకులు పరుగులుగ సాగే ఊరేగింపు

చూపు పరుగెత్తాలె
మనసు పరుగెత్తాలె
అక్షరంలో పెట్టబోతె
భావమే అక్కడ ఫ్రీజ్ అవుతుంది
కెమెరాలూ మూవీలూ అందుకోలేని
ఆ ఎర్రజెండాల నడకల్ని
జగిత్యాల రోడ్డు మలుపున
లంబకోణం దగ్గర నిలబడి చూడు
ఇనుపలాఠి గట్టమీద
ఎండాకాలం మండే చెట్లు
హిమాలయ శిఖరాల మీద
ఎల్ల కాలమూ దిగే మబ్బులు
కరీంనగర్ భూస్వాముల గుండెల్ని
ఆవరించిన భయమూ
కష్టజీవుల కళ్ళలో
కళలు తేరిన ఉత్సాహమూ
ప్రజా దృక్కోణం నుంచి చూడు
ఇది జానకితాడా చీమల బారా
ప్రవాహమా దావానలమా
ఏదైనా ఇది భవిష్యత్తు చిత్రపటం
బీళ్ళువదిలి ఊళ్ళు వదిలి
పట్నాలకు పరుగెత్తు కొచ్చిన
దొరల బార్లనుందు నుంచి
బార్లు కట్టి ఊరేగింపు
గాజుల, దుకాణం నుంచి
క్యాసెట్ల గ్యాజెట్ల షాపుల దాకా
భూమిని పెట్టుబడిగా మార్చుకున్న
హిరణ్యాక్షుల వలస ముందునుంచి
రైతు కూలీల వరస

ఎవరినీ భూమి చంకన బెట్టుక పోనివ్వమని
భూమిమీద సాగుతూ
నినదిస్తున్న ప్రభంజనం

ఇది రైతుకూలీ సంఘం
ఇది రైతుకూలీల సంఘం
రౌతుల సైసుల సంఘం
ఇది గుర్రం ఇది మైదానం
దున్నేవానికే భూమికావాలి
కష్టంచేసే వానికి సంపదకావాలి
రెక్కాడకుండా ఎవరికీ డొక్కాడగూడదు
ఇది దోపిడీని ఏకాకిని చేసే సంఘం
ఇది పీడనను ఏకాకిని చేసే సంఘం
ఇది దొరలనూ పెత్తందార్లనూ
ఏకాకులను చేసి
సాంఘికంగా బహిష్కరించే సంఘం
గ్రామాలకు తరలిన రాడికల్స్
గ్రామాలను మేల్కొలిపినట్లు
ఎగసిన జెండాలు
గ్రామాల్లో క్యాంపెయిన్ చేసిన రాడికల్స్
కరీంనగర్‌లో క్యాంపు చేసినట్లు
వెలగిన జెండాలు
'అమరవీరులకు జోహార్లు'
'అమరవీరుల ఆశయాన్ని కొనసాగిస్తాం'
ఈ బాట మృతవీరుల రక్తంలో తడిసినబాట
మృతవీరుల ఆశలు మైలు రాళ్ళుగా
దారి చూపుతున్న చోట
ఇది కన్నీళ్ళ బాట
ఇది కష్టాల బాట
ఇది తుది విజయం పాట

యూనిఫారాలు
కుట్టిన వాణ్ణి కడక్ ఇస్త్రీ కొట్టిన వాణ్ణి
తలచుకొని చెమటలు కారిపోతున్నాయి
ఆయుధాలు
చేసినవాణ్ణి తలచుకొని పట్టిన వాణ్ణి నమ్మక
అదిరి పోతున్నాయి
శత్రువాహనాలు
ప్రవాహం ముందర ఆగిపోతున్నాయి
భూమిమీద బూట్లు
కాళ్ళకింద నేల కరిగిపోతున్నట్లు
'భూమి మనదీ భుక్తిమనది
శక్తి మనదిరా'
అని మోగుతున్న కంఠాల ప్రకటనలకు
వణికి పోతున్నాయి
మోదుగులు మల్లెలు మందారాలు
కలిపి కుచ్చిన మాలలాగున్నది ఊరేగింపు
తొలకరి చినుకులో చాళ్ళలో
పులపుల పుట్టకొచ్చే ఆరుద్ర పురుగుల్లాగ
నేల ఈనినట్లు జనం రణ న్నినాదాలు
'పుడమి తల్లి పురుటి నొప్పుల చప్పుడు'
'పుడమికి నేడే పుట్టిన రోజట'

ప్రతిధ్వని

ఊరేగింపు వసంత మేఘమయితే
సభ తొలకరి చినుకు
చెరువు సరస్సయినట్లు
చెరువు సముద్రమయినట్లు
చెరువు నిండినట్లు జనం

'కల్లోలిత ప్రాంతాల' గాలంపడి
అడుగునీళ్ళు పైకొచ్చినట్లు
లాఠీల దెబ్బలకు కదుం కట్టిన నెత్తురు
పిడికిళ్ళలో బిగుసుకున్నట్లు
పోలీసు క్యాంపుల దురంతాలతో
ఖాకీ భయం తేలిపోయినట్లు
అయితే బీళ్ళు కాకపోతే జైళ్ళు
అరెస్టులే ఎట్టికన్న మేలని ఎంచుకున్నట్లు
అగ్నిపర్వతం బద్దలై లావా ఎగజిమ్మినట్లు
అణచివేత అనివార్యంగా తెచ్చేది
ప్రతిఘటన అని ప్రకటిస్తూ ప్రజలు

తమ రక్తమాంసాలు కరిగించి
మట్టికెలికి ప్రాణులకు అన్నంపెట్టినవాళ్ళు
తమ రెక్కలే కొమ్మలుగా
జీవాలకు నీడనిచ్చిన వాళ్ళు
తమ పేగులే వస్త్రాలుగా
మనుషులకు నాగరికత నేర్పినవాళ్ళు
కాలుతూ చల్లారుతున్న
నిప్పు ముద్ద నేలమీద
నోళ్ళకు పొలాలకు
నీళ్ళు అందించిన వాళ్ళు
తాము తీగలయి
విద్యుత్తు ప్రసరించిన వాళ్ళు
తాము అణువులై
అణుశక్తిని ఛేదించిన వాళ్ళు
తమ శక్తిని తెలుసుకొని వచ్చారు
జనశక్తిని చాటుతూ వచ్చారు
ప్రజలంటే ఉత్పత్తి శక్తులని

ప్రజలంటే ఉత్పత్తి సాధనాలని
ప్రజలకే ఉత్పత్తి చెందాలని
ప్రజలు చరిత్ర నిర్మాతలని
ప్రకటిస్తూ వచ్చారు

అరే కపట ధర్మవేషధారీ !
ఇక్కడ ఎవరికిరా హింస గురించి బుకాయిస్తావు
హింస దోపిడీ రూపం
హింస పీడన స్వభావం
హింసంటే అణచివేత
హింసను విప్లవ హింసతో
రూపుమాపుతున్న అహింసామూర్తుల
పాద ధూళిని తలదాల్చేవాడురా అసలు అహింసావాది
'ఎన్‌కౌంటర్' చేసేవాడు ఎవడు మరి ?
కాషాయాంబరాలు కాదు
రక్తకళ్ళల కపట వేషధారి రాజయోగి
ప్రజలు మోసాల్ని చవిచూస్తున్నారు
ప్రజలు వేషాల్ని కనిపెడుతున్నారు
ఇంతకన్న చెడేది లేదని ప్రజలు
ఎంతకైనా తెగబడుతున్నారు
దెబ్బైమంది దొరలు
చెయిజారిన జగిత్యాల సిరిసిల్లలను
మళ్ళా కబళించ జూస్తే
తెలంగాణమంతా విప్లవ మాగాణమైంది
ఎన్నడూ రైలయినా చూడని
'బైల్‌గాళ్ళ'(ఎద్దుమనుషులు)చంద్రపూర్‌ను, ధర్మపురిని
రగిలించి సెగలు గక్కుతున్న
అస్సాంను ఆవేశిస్తున్నారు
ఈశాన్యానికి తూర్పు ఎరుపుదారి చూపుతున్నారు.

పల్లెల్లో వేర్ల దగ్గర గొడ్డలి పెట్టుతో
ఢిల్లీ విషవృక్షాన్ని పెకలిస్తున్నారు
ఇందులో కూలీలు ఉన్నారు
రైతులూ ఉన్నారు
విద్యార్థులూ, కార్మికులూ, మేధావులూ
దోపిడీ పీడనలకు గురయ్యే
వివిధ వర్గాలు ఉన్నాయి
సామ్రాజ్యవాదం ఊడలమర్రి క్రింద
భూస్వామ్య పడగనీడలో
బతుకొక బరువుగా
ప్రతిక్షణం గండంగా
గడుపుతున్న ప్రతిఒక్కరు
పలుగూపారా తిరగేసారు
సుత్తె కొడవలి అర్థం తెలుసుకున్నారు
'దున్నేవానిదే భూమి కావాలి !'
'వ్యవసాయ విప్లవం వర్థిల్లాలి !'
'నూతన ప్రజాస్వామిక విప్లవం వర్థిల్లాలి !'
'రైతుకూలీ సంఘం జిందాబాద్ ?'
'అమర వీరులకు జోహార్లు !'
'అమర వీరుల ఆశయాన్ని కొనసాగిస్తాం !'

ప్ర తి జ్ఞ

పోరాటంలో భాగమైన సభ ముగిసింది
పోరాటం కొనసాగుతుంది

లాటిన్ అమెరికా ఒంటరితనం

—గాబ్రియెల్ గార్షియా మార్క్వెజ్

[ప్రపంచంలో అత్యున్నత గౌరవంగా భావింపబడే నోబెల్ సాహిత్య బహుమతి 1982వ సంవత్సరానికి గాబ్రియెల్ గార్షియా మార్క్వెజ్ అనే కొలంబియన్ రచయితకు ఆయన రాసిన 'వందేళ్ళ ఒంటరి తనం' అనే నవలకు గాను ఇవ్వబడింది. ఆబహుమతి తీసుకునేసందర్భంలో స్టాక్‌హోంలోజరిగిన సమావేశంలో మార్క్వెజ్ ఇచ్చిన ఉపన్యాసం ఇంగ్లీషులోకి అనువదించబడి ఇంటర్నేషనల్ హెరాల్డ్‌ట్రిబ్యూన్, ఫిబ్రవరి 23. 1983 సంచికలో ప్రచురితమైంది. ఆ ఉపన్యాసానికి ఇది సంక్షిప్త స్వేచ్ఛానువాదం]

మన కాలపు మహాకవి పాబ్లోనెరూడా పదకొండేళ్ళ కింద తన గళంతో పాఠక లోకాన్ని జాగృతం చేశాడు. అప్పటినుంచి లాటిన్ అమెరికన్ అలౌకిక సంచలనం సదుద్దేశ్యపూరితులైన యూరపియన్లను (అప్పుడప్పుడు దురుద్దేశ్య పూరితులైన యూరపియన్లను కూడా) కదిలిస్తూనే ఉంది. వేటాడబడిన పురుషులతో. చారిత్రక స్త్రీలతో నిండిన ఎల్లలులేని లాటిన్ అమెరికా, అక్కడి జనాల అనంత మూర్ఖత్వం ఇక ఒక అభూతకల్పనగా మారిపోయింది.

మాకింక ఒక్కక్షణం విశ్రాంతిలేదు. ఓ పెద్దసైన్యంతో ఒంటరిగా పోరాడుతూ, జ్వలిస్తోన్న తన ప్రాసాదంలో చిక్కుబడిపోయి సాహసి అయిన ఒక అధ్యక్షుడు చనిపోయాడు. రెండు అనుమానాస్పద విమాన ప్రమాదాలు ఇంకా వివరించబడవలసే ఉన్నవి. ఈ ప్రమాదాలలో విశాల హృదయం కల ఓ అధ్యక్షుడు ప్రాణాలు పోగొట్టుకున్నాడు. తన ప్రజానీకపు ప్రతిష్టను పునరుద్ధరించిన ఓ ప్రజాస్వామిక సైనికుడు బలయిపోయాడు.

అయిదు యుద్ధాలు జరిగాయి. పదిహేడు సైనిక తిరుగుబాట్లు జరిగాయి. దేవుని పేరుమీద ఒక జాతి జాతంతటినీ భూమ్మీది నుంచి తుడిచేసే రాక్షస నియంత లాటిన్ అమెరికన్ చరిత్రలో మొదటిసారిగా తలెత్తాడు. ఈ లోగా, రెండుకోట్లమంది లాటిన్ అమెరికన్ శిశువులు ఏడాది నిండకుండానే చనిపోయారు. నిర్బంధం కారణంగా దాదాపు ఒక లక్ష ఇరవై వేలమంది అదృశ్యమైపోయారు.

గర్భిణులుగా ఉన్నప్పుడు నిర్బంధించబడిన ఎంతోమంది స్త్రీలు అర్జెంటీనా జైళ్ళలో ప్రసవించారు. ఐతే ఆ శిశువులందరూ ఏమయిపోయారో, ఎక్కడున్నారో ఎవరికీ తెలియదు. బహుశా కొందరు పిల్లల్ని రహస్యంగా ఎవరో దత్తత తీసుకొని ఉంటారు. మరికొందరిని సైనికాధికారులు ఏ అనాథ శరణాలయానికో పంపించి ఉంటారు. ఈ పరిస్థితి ఇంకా, ఇకపై సాగదు అన్నందుకు, మార్చ ప్రయత్నించినందుకు రెండు లక్షల మంది స్త్రీ పురుషులు ప్రాణాలు బలిపెట్టవలసి వచ్చింది. మధ్య అమెరికాలోని నికరాగువా, ఎల్‌సాల్వడార్, గౌటెమాలా అనే మూడు చిన్న, దురదృష్టకరమైన దేశాలలోనే లక్షమందికిపైగా చావును స్వీకరించవలసి వచ్చింది.

ఆతిథ్యానికి మారుపేరయిన చిలీదేశం నుంచి దాని జనాభాలో పదిశాతం మంది, పది లక్షలమంది పారిపోవలసి వచ్చింది. ఖండంలో అత్యంత నాగరిక దేశంగా తనను తాను అభివర్ణించుకునే ఇరవై ఐదు లక్షల జనాభాగల ఉరుగ్వేలో ప్రతి అయిదుగురిలో ఒకరు అజ్ఞాతవాసంలో ఉన్నారు. 1979 నుంచి ఎల్‌సాల్వడార్‌లో జరుగుతున్న అంతర్యుద్ధం ప్రతి ఇరవై నిమిషాలకు ఒక కాందిశీకుణ్ని తయారు చేస్తున్నది. లాటిన్ అమెరికా నుంచి అజ్ఞాతవాసానికి వెళ్ళినవాళ్ళతో, బలవంతంగా వెళ్ళగొట్టబడ్డ వాళ్ళతో ఓ దేశాన్ని నిర్మిస్తే దాని జనాభా నార్వే జనాభాకన్న ఎక్కువవుతుంది.

కనుక నేను నమ్ముకోవడానికి సాహసిస్తున్నానంటే - నిజంగా స్వీడిష్ సాహిత్య అకాడమీ దృష్టికి రాదగిన అర్హత గలిగినది ఈ పెరిగిపోయిన వాస్తవమే గాని, దాని కేవల సాహిత్య వ్యక్తీకరణ కాదు. ఒక కాగితం మీది అక్షరం కాదు, మాలో బతుకుతున్న వాస్తవం. ఆ వాస్తవం మా అసంఖ్యాక రోజువారీ మరణాలను నిర్ణయిస్తోంది. ఈ వాస్తవం ఒక అనంతమైన సృజనాత్మకతకు వనరు చేకూర్చి పెడుతున్నది. ఈ వాస్తవం నిండా కన్నీళ్ళు ఉన్నవి, సౌందర్యం ఉన్నది. ఈ వాస్తవానికే గతకాలం నెమరేసుకుంటూ దేశాలు తిరిగే కొలంబియన్ ఒకానొక వ్యక్తీకరణ, అదృష్టం వరించిన ఒకానొక ఉదాహరణ. కవులూ బిచ్చగాళ్ళూ, సంగీతకారులూ ప్రవక్తలూ, యోధులూ వెధవలూ- అందరూ ఆ నిగ్రహంలేని వాస్తవంలో బతుకుతున్నవాళ్ళే. స్వప్నాలు కుంచించుకుపోయిన మేం ఒక ప్రశ్న అడగదలిచాం. మా జీవితాల్ని నమ్మదగినవిగా మార్చుకోవడానికి తగిన సాంప్రదాయిక సాధనమేదీ లేకపోవడమే మా ప్రధాన సమస్యనా ? ఔను, మా ఒంటరితనానికి మూలం ఇదే ! మా అందరిలోనూ సారభూతమైన శంకలే మమ్మల్ని అడ్డుకుంటున్నాయి. మరోవైపు ప్రపంచానికి ఈ వైపున ఉన్న హేతుబద్ధ మేధస్సంతా తనను తాను పొగడుకోవడంలో

మునిగిపోయి మమ్మల్ని పివరించే సాధనం కనుక్కో లేకపోతున్నది. ఈ లోపాన్ని కూడా అర్థం చేసుకోవచ్చును.

జీవన శిథిలాలు అందరికీ ఒకేలాగ ఉండవనీ, మా అస్తిత్వం కోసం మేం పడే తపన వాళ్ళు వాళ్ళ అస్తిత్వం కోసం పడిన తపనంత కష్టదాయిష్టంగానూ రక్తసిక్తంగానూ ఉండక తప్పదని వాళ్ళు మరచిపోతున్నారు. తమను ఏ ప్రమాణాలతో కొలుచుకుంటారో, మమ్మల్నీ అదే ప్రమాణాలతో కొలుస్తామనడం అతిసహజం. కాని మావికాని పద్ధతుల్లో మా వాస్తవాన్ని వ్యక్తీకరించ బూనుకుంటే మేం మరింత అపరిచితులమైపోతాం, మేం మరింతగా స్వేచ్ఛపోగొట్టుకుంటాం. మేం మరింతగా ఒంటరులమై పోతాం.

గౌరవనీయమైన యూరప్ మమ్మల్ని తన గతం ద్వారా పరిశీలించి ఉంటే ఎంతో బావుండేది. లండన్ చుట్టూరా మొట్టమొదటి నగర కుడ్యాన్ని నిర్మించడానికి మూడువందల సంవత్సరాలు పట్టిందని అది గుర్తుతెచ్చుకొని ఉంటే, ఒక మతాధిపతిని నియమించుకోవడానికి మరొక మూడువందల సంవత్సరాలు పట్టిందని గుర్తు తెచ్చుకొని ఉంటే, ఎట్రుస్కన్ రాజు దాన్ని చరిత్రకు ముడేసే వరకూ ఇరవై చీకటి శతాబ్దాలపాటు అనిశ్చితలో కొట్టుమిట్టాడానని రోమ్ గుర్తు తెచ్చుకొని ఉంటే ఎంతో బావుండేది. ఇవాళ ప్రపంచాన్ని తన మధురమైన వెన్నలతో, ఔదాసీన్యపు గడియారాలతో ముంచెత్తే శాంతియుత స్విట్జర్లాండ్ పదహారో శతాబ్దం వరకుకూడ యూరప్‌లో తన సైనికులతో రక్తాలు ప్రవహింపజేసిందని గుర్తుతెచ్చుకొని ఉంటే ఎంతో బావుండేది. సాంస్కృతిక పునరుజ్జీవనపు రోజుల్లో కూడ సామ్రాజ్యవాద సైన్యాల మోచేతి నీళ్ళుతాగే పన్నెండువేలమంది మతసైనికులు రోమ్‌ను కొల్లగొట్టి, ధ్వంసం చేసి ఎనిమిదివేల మందిని తమ కత్తులకెరజేశారని గుర్తు తెచ్చుకోండి .... మరింత న్యాయమైన, మానవత నిండిన మాతృభూమికోసం పోరాడే ద్రష్టలైనయూరోపియన్లు మమ్మల్ని తాము చూస్తున్న పద్ధతి ఎలాఉందో పునరాలోచించుకుంటే మాకు మరింత సాయం చేయగలరని నేను విశ్వసిస్తున్నాను.

మాస్వప్నాలకు సంఘీభావం మాత్రమే ప్రకటించడం మమ్మల్ని ఒంటరితనం నుంచి దూరం చేయదు. ప్రపంచ జీవనంలో తమకూ భాగం ఉన్నదని అనుకునే మా ప్రజల విశ్వాసానికి నిర్దిష్టమైన చర్యలద్వారా మద్దతు ప్రకటించనంత వరకూ ఈ సంఘీభావం మాకేమీ ఉపయోగపడదు. తన స్వంతనిర్ణయంలేకుండా మరెవరి

చేతుల్లోనో పావుకావాలని లాటిన్ అమెరికా ఎన్నడూ ఆలోచించదు. అసలలా ఆలోచించే ఆస్కారమే లేదు. దాని స్వేచ్ఛా కాంక్ష, స్వయం నిర్ణయం కోసం తపన ఒక పాశ్చాత్య కోరిక కావాలనడం ఒట్టి ఉచిత సలహాకాదూ ? లాటిన్ అమెరికాకూ యూరప్‌కు మధ్య దూరాన్ని సముద్ర ప్రయాణంఅభివృద్ధి తగ్గించిన మాట నిజమే, కాని అదే మా సాంస్కృతిక పురాతనత్వాన్ని మరింత ఎక్కువ చేసింది.

సాహిత్యంలో చాల సులభంగా అంగీకరించబడుతున్న స్వయంచింతన, సాంఘిక పరిణామంకోసం మేం చేసిన వివిధప్రయత్నాలలో ఎందుకంత కుయుక్తితో అడ్డుకోబడుతోంది ? ప్రగతిశీల యూరోపియన్లు తమ స్వదేశాలకోసం సాధించుకున్న సాంఘిక న్యాయం లాటిన్అమెరికాకు కూడ లక్ష్యం ఎందుకు కాగూడదు ? కాకపోతే దేశకాల పరిస్థితులు వేరుగనుక పద్ధతులు మారవచ్చునేమో !

ఇంక వీల్లేదు. మా చరిత్రనిండా హింసా, వేదనా ఈ తరతరాల అసమానతల ఫలితమే. ఇదంతా బయటికి రాని కరుకుదనం. మా స్వస్థలానికి తొమ్మిది వేల మైళ్ళ దూరాన మామీద వేయబడిన కుట్రలెన్నని ?! ఐతే, ఇద్దరు ప్రపంచ మొనగాళ్ళ దయమీద ఆధారపడి బతకడం కన్న లాటిన్ అమెరికాకు మరొక గమ్యం అసాధ్యమని చాలమంది యూరపియన్ ఆలోచనాపరులు తలపోశారు. ఇది, ఇదే మా ఒంటరితనానికి ప్రమాణం.

అయితే ఇన్నిజరిగినా, మా పట్ల కొనసాగిన అణచివేతకు, మమ్మల్ని కొల్లగొట్టుకు పోవడానికీ, మమ్మల్ని వెలివేయడానికీ మాకొక జవాబు ఉంది. అది బతుకు, మాపై కొనసాగిన దౌర్జన్యానికంతటికీ మేం బతుకుతో జవాబిస్తాం. వరదలు గానీ, రోగాలు గానీ, కరువులు గానీ, ప్రళయాలుగానీ, శతాబ్దాల తరబడి సాగిన అనంత యుద్ధాలుగానీ చావుమీద బతుకు సాధించిన విజయాన్ని కాదనలేక పోయాయి. చావు మీద బతుకు గొప్పదనాన్ని తొలగించలేకపోయాయి.

ఈ విజయం ఇంకా పెరుగుతుంది. మరింత తీవ్రతరమవుతుంది. ప్రతి ఏటా మరణాలకన్న ఏడుకోట్ల నలభై లక్షల ఎక్కువ జననాలున్నాయి. బతుకులు మరింతగా పెరుగుతున్నాయి. ఈ జననాల్లో ఎక్కువ భాగం లాటిన్ అమెరికాతో సహా తక్కువ వనరులున్న దేశాలలోనే సంభవిస్తున్నాయి. దీనికి ప్రతిగా ధనిక దేశాలు వినాశకర శక్తుల్ని సమకూర్చుకుంటున్నాయి. చాల సుఖప్రదజీవనం గడుపుతున్న దేశాలు సాధించిన విజయం ఏమిటంటే- ఇప్పుడు బతుకుతున్న మనుషులకు వంద

రెట్ల మనుషులనేకాదు, ఈ దురదృష్ట గ్రహం మీద ఇప్పటిదాకా ఊపిరిపీల్చిన జీవ జాలాన్నంతటినీ నాశనం చేయగల శక్తుల్ని సంతరించుకోవడం.

ఈ రోజు లాంటి ఒకరోజుననే, ఇదే వేదికమీద, నోబెల్ బహుమతి తీసుకుంటూ నా గురువు విలియం ఫాక్నర్ 'మనిషి అంతరించిపోతాడనే మాట నేను అంగీకరించను. అంగీకరించడానికి నేను నిరాకరిస్తున్నాను' అన్నాడు. ముప్పై రెండు గ్రీష్మాలకింద ఆయన ఏ మానవమహావిషాదాన్ని గుర్తించి నిరాకరించాడో అది ఇవాళ మానవుని చరిత్రలో మొట్టమొదటిసారి ఒక సాధారణ సాంకేతిక సంభావ్యతగా మారిపోయింది. కనుక ఆయన నిలబడిన ఈ స్థానంలో నిలబడడానికి నాకు విచారంగా ఉన్నది.

మనం ఈ మిథ్యా ప్రపంచంలా కనబడే భయంకర వాస్తవం మధ్య నిలబడి ఉన్నాం. ఐనా మేం, కథలు సృష్టించేవాళ్ళం, ఏ విషయమైనా నమ్మేసేవాళ్ళం ఏం నమ్మడానికి సిద్ధ పడుతున్నామంటే ఈ భయానక వాస్తవానికి వ్యతిరేకమైన కాల్పనిక ప్రపంచాన్ని సృష్టించడానికి మనకింకా తగిన సమయం ఉంది. మనం సృష్టించబోయే ఆ ప్రపంచం ఒక నూత్న ప్రపంచం. అది జీవితాన్ని వివరించే ప్రపంచం. అక్కడ ఇతరుల చావును ఏ ఒక్కరూ శాసించడానికి వీలు ఉండదు. అక్కడ ప్రేమ నిజమని రుజువవుతుంది. అక్కడ ఆనందం సాధ్యమని ధ్రువపడుతుంది. అక్కడ వందేళ్ళ ఒంటరి తనానికి గురిచేయబడిన జాతులు చిట్టచివరికి, శాశ్వతంగా భూమి మీద తాము పొందదగిన అవకాశాల్ని పొందుతాయి.

మనవి

వరంగల్‌లో ప్రింటింగ్ ప్రెస్ కార్మికులు సమ్మె చేస్తున్నందువల్ల ఈ సంచిక ఆలస్యంగా వెలువడడమేగాక, ఖర్చుకూడా పెరగటంవల్ల ఈ సంచికకు రు. 3-00 పెట్టడం జరుగుతున్నది. ఈ మా ఇబ్బందులు గమనించి పాఠకులు సహకరిస్తారని ఆశిస్తున్నాం

—'సాహితీ మిత్రులు'

సినిమా సమీక్ష :

'గాంధీ'

కలడు కలండనెడు వాడు కలడో లేడో అని
లోగడ ఒక ఏనుగు ఆలోచనలో పడిందట

అని శ్రీశ్రీ అన్నట్టు, మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ అనే వ్యక్తి ఈ ధరాతలం మీద నడిచాడని చెప్తే భావితరాల వాళ్ళు నిజమో కాదో అని విస్మయంలో పడతారని ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ అన్నాడట. మానవజాతి మీద గాని ఆ జాతి భవితవ్యం మీద గాని విశ్వాసలేశం వుందన్న అనుమానానికి గూడ తావివ్వని ఆల్డస్ హక్స్లీ హిమశిఖల పేధస్సుకు గూడ, మోహన్‌దాస్ కరంచంద్‌గాంధీ 'మహాత్ముడే'నా అని అరడజను పేజీల పాటు తర్కించి చివరికి 'ఆయన మహాత్ముడు అయినా కాకున్నా, ఇతర సమకాలీన రాజకీయ నాయకులతో పోల్చిచూస్తే, ఆయన సుగంధాన్ని వెద జల్లుతూ నిష్క్రమించాడని చెప్పక తప్పదు' అని తీర్మానించక తప్పలేదు. (He left a clean smell behind అనే ఆంగ్ల నుడికారానికి ఇది స్వేచ్ఛానువాదమో వికట అనుసరణమో, ఉభయభాషజ్ఞులు తేల్చాలి). సుగంధాన్ని వెరజల్లడం అగరొత్తుల ధర్మమేగాని జాతినాయకుల పని కాదుకాబట్టి హక్స్లీ తీర్మానాన్ని ఒక విశేషంగా భావించకపోవచ్చు. అయినా, హక్స్లీ ఆంగ్లేయుడు కాబట్టి, మనమంతా ఆంగ్ల మానసపుత్రులం కాకున్నా చాలమంది ఆంగ్లభాషా పుత్రులం కాబట్టీ, చెప్పుకోక తప్పదు. కనీసం అందుకోసమే అయినా సర్ రిచర్డ్ అట్టెన్‌బరో తీసిన 'గాంధీ' అనే పొడి అక్షరాల పేరున్న సినిమా గురించి మాట్లాడుకోక తప్పదు.

సర్ రిచర్డ్ అట్టెన్‌బరో ఎవరన్నది మనకు అనవసరం. ఆయన పేరు ముందున్న సర్ అన్న అలంకరణ పిత్రార్జితమా లేక పైరవీ చేయగా వచ్చిందా అన్నది గూడ మనకు అనవసరం. అతను 'గాంధీ' సినిమా ఎందుకు తీశాడన్నది మాత్రమే ప్రస్తుతం. సినిమా చూడకముందే నేనొక అవగాహనకు వచ్చాను. ఏ భావితరాలవాళ్ళు గాంధీ కలడో లేడో అని ఖచ్చితంగా విస్మయం చెందుతారని ఐన్‌స్టీన్ అన్నాడో, ఆ తరానికి - అంటే ఈ తరానికి - సంశయ నివృత్తి చేసి, చచ్చి దహన సంస్కారాలు జరిగిన అహింసా సిద్ధాంతాన్నీ, సత్యాగ్రహ మంత్రాన్నీ, మళ్ళీ పునరుజ్జీవింపజేసే సామ్రాజ్యవాదపు కుట్ర ఈ సినిమా అనుకున్నాను. గాంధీ మార్గం పట్ల నేటి యువతరంలో మళ్ళీ అపోహాలు కల్గించి, ఆనాడు మనదేశ దళారీ బూర్జువా వర్గానికి అధికారం మార్పిడి చేయడానికి గాంధీ ఏవిధంగా తోడ్పడ్డాడో

అదేవిధంగా ఆ అధికారం కొనసాగేందుకు ఈ కల్లోల తరంలో ఒక సామ్రాజ్యవాద సినీ నిర్మాత చేస్తున్న ఉడుతాసాయం ఈ సినిమా అనుకున్నాను. ఆ సహాయం ఎందుకు అవసరమయిందంటే, గాంధీ మార్గాన్ని సమర్థించేవాళ్ళు, హింసామార్గం బెంగాల్ టెరరిస్టుల వంటి కొద్దిమంది ఉద్రిక్తులను మాత్రమే కదిలించగలదు, అహింసామార్గం ఒక్కటే స్త్రీ పురుష భేదం లేకుండ జనసామాన్యాన్ని కదిలించ గలదనీ, అట్లా జనసామాన్యాన్ని కదిలించగల కిటుకును కనిపెట్టడం గాంధీ గొప్పతన మనీ, ప్రచారం చేస్తున్నారు. అయితే చైనా విప్లవం, ఆ మార్గంలోనే పయనించి ఘనంగా విజయవంతమయిన వియత్నాం, లావోస్, కంపూచియా, జింబాబ్వే, తదితర జాతి విముక్తి పోరాటాలు, ఈ వాదాన్ని అర్థరహితం చేసి, ప్రజాపంథా గనక వుంటే సాయుధ పోరాటం లక్షలాది మంది ప్రజలను కదిలించగలదని ఋజువు చేసాయి.

సినిమా చూడడంతో ఆ అవగాహన తారుమారయింది. తారుమారు కావ డంతో ఒక మౌలికమయిన గతితార్కిక భౌతికవాద సూత్రం గూడ ఋజువయింది. వాస్తవాలకు తర్కాన్ని జోడించి సిద్ధాంతాన్ని నిరూపించి సంపన్నం చేయడం సరయిన పరిశీలనా పద్ధతి అవుతుంది గాని, ఆ క్రమాన్ని తలమీద నిలబెట్టి సిద్ధాంతం నుండీ తర్కం ద్వారా వాస్తవాలను నిర్ధారించే ప్రయత్నం అశాస్త్రీయం.

తారుమారు ఎందుకయిందంటే, ఈ సినిమా చూసిన వారెవ్వరికీ గాంధీ అన్నా, అహింసా మార్గమన్నా, కాంగ్రెస్ పార్టీ నడిపిన జాతీయ ఉద్యమమన్నా, గౌరవం కలగదు. ఇదెక్కడి ఉద్యమం, వీళ్ళేం నాయకులు, అనిపిస్తుంది. ఉప్పు సత్యాగ్రహాన్ని జాతీయ చైతన్యాన్ని మేల్కొలిపిన ఒక ఘనమయిన ఉద్యమంగా పొగడగా చిన్నప్పుడు స్కూల్లో చదువుకున్న వాళ్ళకు ఆ సత్యాగ్రహం సీను చూస్తే సిగ్గనిపిస్తుంది. బలిపశువుల్లాగా ఒక్కొక్కసారి అయిదేసిమంది పోలీసుల చేతులలోకి పోవడం, ప్రతిఘటించకుండా లాఠీదెబ్బలు తినడం, పక్కనే రెడీగావున్న వాళ్ళ భార్యలూ చెల్లెళ్లూ తల్లులూ (ఇక్కడ గూడ వాళ్ళు సేవికలే) వెంటనే పడిపోయిన వాళ్ళను లేవదీసి పక్కకు తీసుకపోయి కట్లు కట్టడం మళ్ళీ మరొక అయిదుమంది వధ్యస్థలానికి వెదురుతూ ముందుకు రావడం,...., చూస్తుంటే అహింస పేరిట ఆడుతున్న పార్సు అనిపిస్తుంది జట్లుజట్లుగా వెళ్ళి దెబ్బలుతిని కట్లు కట్టించుకోక పోతే, ఒక్కుమ్మడిగా అందరూ తిరగబడితే కాల్పులు జరిగి ఇద్దరు ముగ్గురు

ప్రాణాలు కోల్పోయినా లక్ష్యం నెరవేరుతుంది గదా అన్న సందేహం ఎటువంటి వారికైనా రాకమానదు.

మరి అహింసామార్గం పట్ల గౌరవం కలిగించలేకపోతె, అట్టెన్‌బరో ఈ సినిమా ఎందుకు తీసినట్టు ? సమాధానం కావాలంటే సినిమాలో ఏముందో ఏం లేదో ఒకసారి గమనిద్దాం. మొత్తం సినిమాలో భారతదేశస్థుల పాత్రచిత్రణ ప్రేక్షకులను ఆకర్షించేటట్టు లేదు. గాంధీ నుండి జిన్నా వరకు ఎవ్వరూ దీనికి మినహాయింపు కాదు. భారతదేశ చరిత్ర తెలియని వాళ్ళకు ఈ సినిమా చూపించి, అందరికంటే బలమయిన వ్యక్తిత్వం గల మనిషిగా కనబడ్డది ఎవ్వరంటే, గాంధీ కాదు, నెహ్రూ కాదు, 'ఉక్కు-మనిషి' సర్దార్ పటేల్ కాదు, చార్లెస్ ఆండ్రూస్ అని సమాధానం చెబుతాడు. గాంధీని ఒక మహాత్ముడిగా కాక 'మామూలు మనిషి'గా చూపించే ప్రయత్నంలో వెర్రిబాగులవాడిగా చూపించాడు. నెహ్రూను వర్ణించాలంటే, హైదరాబాదీ నుడికారంలో, 'హాలా' లాగా ఉన్నాడు. సర్దార్ పటేల్, పగలంతా ఆఫీసులో ఫ్యాను క్రింద శ్రమించి సాయంకాలం క్లబ్బులో టెన్నిసో పేకముక్కలో ఆడుకునే చీకూ చింతా లేని బ్యాంకు మానేజర్ లాగున్నాడు. ఆజాద్ నల్లకళ్ళద్దాలూ పిల్లి గడ్డమూ నోటినిండా నవ్వూ చూస్తే నవాబ్ ఖాన్‌దాన్‌లో పుట్టిన విలాస పురుషు డనిపిస్తుంది. మహమ్మద్ ఆలీ జిన్నా హిందీ సినిమా విలన్‌లాగున్నాడు (మొదటి 15 రీళ్ళూ ఘరానా వ్యాపారస్తుడిలా కనబడి, ఆఖరి రీలులో అసలు విలన్‌గా బయట పడతాడు చూడండి, ఆ రకం).

అయ్యో, మన జాతీయ నాయకులను ఇంతగా అగౌరవపరిచాడే అని బాధపడాల్సిన అవసరంలేదు. నిజానికి వీళ్లెవ్వరూ ఇంతకంటే గౌరవానికి అర్హులు కారు. కాని విషయం అది కాదు. అట్టెన్‌బరో ఈ సినిమాను ఎందుకు తీసాడన్నది విషయం.

సినిమాను ఇంకొంచెం లోతుగా పరిశీలిద్దాం. గాంధీ అనగానే మన కంద రికీ గుర్తుకొచ్చేది, ఆయనగారు చిన్నప్పుడు దొంగతనంగా తిన్న మేక మాంసం, కాల్చిన ఎంగిలి బీడీ. ఆ విషయాలు సినిమాలో లేవు. (ఇదేదో కుట్ర అని నా అభిప్రాయం కాదు, విషయం చెపుతున్నాను). సినిమా దక్షిణాఫ్రికాలో ప్రారంభ మవుతుంది. అక్కడి భారతీయుల మీద దక్షిణాఫ్రికా ప్రభుత్వం విధించిన ఆంక్ష లకు వ్యతిరేకంగా గాంధీ ఒక ఉద్యమం నడుపుతాడు. ప్రభుత్వం మంజూరు చేసిన పాసులను కాలబెడతాడు. కొడితే దెబ్బలు తింటాడు. మీటింగులు పెట్టి తడబడుతూ

మాట్లాడతాడు. పోలీసులు కొట్టినాసరే ఎదురుతిరగకూడదనీ, హింసకు ప్రతిహింస సమాధానం కాదనీ, చెప్తాడు. మీటింగు ఒక గ్యాలరీవున్న హాలులో జరుగుతుంది. ఉద్యమం స్వభావానికి అనుగుణంగానే, హాలు క్రింది భాగంలో పురానా వ్యక్తులు కూర్చుంటారు. గ్యాలరీలో కూలివాళ్ళు కూర్చుంటారు. ఒక్క కూలిఅతను మాత్రం కొంత అసంతృప్తి కనబరుస్తాడుగాని, త్వరలో అతనితోబాటు అక్కడున్న వాళ్ళంతా 'హిప్నొటైజ్' అయినట్టు గాంధీని అనుసరిస్తారు. గాంధీ తృప్తిగా గాలి పీల్చుకుంటాడు. గాంధీని మహాత్ముడిగా కాక ఒక మామూలు మనిషిగా, చాలా స్వాభావికంగా చిత్రీకరించాడని చాలమంది అట్టెన్‌బరోను మెచ్చుకున్నారు. అయితే ఈ క్రమంలో తక్కిన వాళ్ళందరినీ గూడ (తెల్లవాళ్ళను మినహాయిస్తే) స్వాభావికంగా గాని, మామూలు మనుషులగాగాని కాక, గాంధీచుట్టూ పరిభ్రమించే మరబొమ్మలుగా చిత్రీకరించాడన్న విషయం ఎవరికంటా పడలేదు. దక్షిణాఫ్రికా నుండి భారత దేశానికి గాంధీ తిరిగివచ్చే సీను గూడ దీనికి అనుగుణంగానే వుంది. దేశంలోని 'జాతీయ నాయకు' లందరూ గాంధీ పాదాల దగ్గర విల్లమ్ములు పడేసి అస్త్రసన్యాసం చేసి ఇక నీదే ఈ ఉద్యమ నాయకత్వం అని దండం పెట్టినంత పనిచేస్తారు. గాంధీకి మాత్రం ('మామూలు మనిషి' గనుక) ఎటూ పాలుబోదు, రైలెక్కి దేశమంతా తిరిగి వస్తాడు. ఎందుకంటే, 'అసలు' ప్రజల్ని కలవడం కోసం. (మొన్ననే గదా, గాంధేయ మాజీ సోషలిస్టు 'ఠాకూర్' చంద్రశేఖర్ అదే ఉద్దేశ్యంతో కన్యాకుమారి దగ్గర బయలుదేరి ఊరూరా తిరుగుతున్నాడు! పాత వాసన ఇంకా పోలేదు.) కలిసిన ప్రజలలో దైన్యమే తప్ప పోరాటం కనుపించలేదు కాబట్టి ధైర్యంచేసి సహాయనిరాకరణా, సత్యాగ్రహం, వగైరా ప్రకటిస్తాడు గాంధీ. హింస నైతికంగా తప్పనీ, అహింసే మన మార్గమనీ నిషేధం పెడతాడు. ప్రజలు ఆ నిషేధాన్ని పాటించక చౌరీచౌరాలో పోలీసుస్టేషన్‌ను కాలబెట్టి పోలీసులను చంపితే ఉద్యమాన్ని విరమింపుకుంటాడు. ఇది తెలిసిన కథే. ఉద్యమ విరమణ గురించి ఆనాడు తక్కిన కాంగ్రెస్ నాయకులు ఏమనుకున్నారో తెలీదుగాని, సినిమాలో మాత్రం 'కిం' అనరంటే అబద్ధమవుతుంది గానీ, అంతకంటె ఎక్కువమాత్రం అనరు. ఒక్క జిన్నా మాత్రమే గాంధీ వాదస్తాలపట్ల అసంతృప్తి కనబరుస్తాడు (విలన్ కదా మరి). మిగిలినవాళ్ళంతా సమ్మోహనాస్త్రం ప్రయోగించినట్టు గాంధీని అనుసరిస్తారు. అటు తరువాతి చరిత్ర అంతా (దండి, చంపారన్, సత్యాగ్రహాలను మినహాయిస్తే) గాంధీ రాట్నంతో నూలు వడకడం, ఆశ్రమంలో మేకపిల్లకు నాటువైద్యం చేయడం, తనను

దర్శించుకోవడానికి వచ్చిన పాశ్చాత్య పాత్రికేయులకు తన అహింసా సత్యాగ్రహాల సిద్ధాంతాన్ని వివరించడం, వెరసి ఒక వెర్రబాగులవాడిగా, చర్చిల్ మాటల్లో చెప్పాలంటే గోచిపాత సన్యాసిగా (half naked fakir), ప్రవర్తించడం. తక్కిన 'జాతి నాయకు'లంతా గాంధీ ఆశ్రమంలో ఆ మహాత్ముడి ఆజ్ఞలకోసం ఎదురుచూస్తూ పడిగాపులు కాస్తారు. మొదట్లో ఆశ్రమానికి రావడం బందరూ అదేదో వనభోజనానికన్నట్టు వస్తారు. వచ్చిన తరువాత రాజకీయాల సంగతి దేవుడెరుగు, నూలు వడకడం గూడ నేర్చుకున్నట్టు కనబడరు. గాంధీ వెర్రితనాన్ని వెర్రినవ్వులతో సహిస్తూ కూర్చుంటారు. చైనా వియత్నాం తదితర దేశాల విముక్తి పోరాట కథలతో పరిచయం ఉన్నవాళ్ళు, ఇది ఏ జాతి అయినా గర్వించదగ్గ జాతీయోద్యమమా అని ప్రశ్నించుకోక తప్పదు.

మరయితే మన ప్రశ్న ఇంకా అలాగే వుండిపోయింది. అటెన్‌బరో ఈ సినిమా ఎందుకు తీసినట్టు ? రెండుమూడేళ్ళ క్రితం ఆంగ్ల మానస పుత్రులయిన భారతీయులలో ఇంతకు సహంగా దుమారం రేపిన కొలిన్స్, లాపియర్ ల Freedom at midnight అనే పుస్తకాన్ని గుర్తు తెచ్చుకుంటే అర్థమవుతుంది. ఆ పుస్తకానికీ ఈ సినిమాకూ వెనకున్నది శ్వేతజాతి దురహంకారం కాకున్నా శ్వేత జాతి ఔన్నత్య భావం. ఆ ఔన్నత్య భావం నల్లవాళ్ళను ద్వేషించదు పురానా గృహిణులు పిల్లలనూ, బొచ్చుకుక్కలనూ ప్రేమించినట్టు ప్రేమిస్తుంది. వాత్సల్య భావం ఇంగ్లీషులో (patronising attitude) దాని స్వభావం. చూసారా ఈ నల్ల వెధవలు ఎంత తెలివయిన వాళ్ళో అని మురిసిపోతుంది. చర్చిల్ అహంకారంతో గాంధీని గోచిపాత సన్యాసి అన్నాడు. ఆ అహంకారం అటెన్‌బరోలో మురిపెంగా మారి సినిమాలో చార్లెస్ ఆండ్రూస్ రూపం తీసుకుంది. గాంధీని మహాత్ముడిగా కాక 'మామూలు మనిషి'గా చూపే ప్రయత్నం వెనక ఉన్నది అదే. తనకు ముచ్చటగా అనిపించిన ఈ నల్లవాళ్ళ నిర్వాకాన్ని చిత్రీకరించి సాటి తెల్లవాళ్ళ ముందు అటెన్‌బరో ప్రదర్శించదల్చుకున్నాడు. అమ్ముడుపోతోంది కాబట్టి మనదేశంలో గూడ అమ్ముతున్నాడుగాని, ఇది మనకు చూపించడానికి తీసిన సినిమా కాదు.

అయితే భారత జాతీయ ఉద్యమాన్ని ఇట్లా మురిపెంగా చిత్రించడంలో కొంత ఇబ్బంది వుంది. ప్రజలందరూ గోచిపాతరాయుళ్ళయితే కావచ్చుగాని గాంధీ లాగ బోగస్ ఫకీర్లు కారు. నాయకులలో గూడ నెహ్రూవంటి వాళ్ళు పాశ్చాత్యుల కళ్ళకు ముద్దొచ్చే మంచి బాలురగా కనబడవచ్చుగాని, అందరూ అట్లాంటి వాళ్ళుకారు.

అందుకే ఈ సినిమాలో నెహ్రూ, పటేల్, అజాద్‌లను చూపించాడుగాని సుభాష్ బోసునో, అంబేద్కర్‌నో, జయప్రకాశ్ నారాయణ్‌నో చూపించలేదు (కాంగ్రెస్ నాయకుల సంగతే మాట్లాడుకుందాం, ఇతరులను అటెన్‌బరో ఎట్లాగూ చూపించ బోడు). అహింసాత్మకంగా మొదలయి ముగిసిన దండి సత్యాగ్రహం, చంపారన్ సత్యాగ్రహం కనబడతాయి గాని, రైలుపట్టాలనూ కరెంటుతీగలనూ ఊడబీకి రోడ్లనూ బ్రిడ్జీలను ధ్వంసంచేసిన క్విట్ ఇండియా ఉద్యమం ప్రసక్తే లేదు. ప్రజలంటారా, 'మహాత్మాగాంధీకీ జై' అనడం తప్ప వారికి వేరే పాత్రలేదు. చివరికి పాత కాంగ్రెస్ నాయకులలో గూడ గోఖలే కనబడతాడుగాని తిలక్ కనబడడు. అహింస ముద్దొచ్చి నట్టు హింస ముద్దురాదు.

ఒక రకంగా ఇందులో అసంకల్పిత వ్యంగ్యం ఉంది. అటెన్‌బరో శ్వేతజాతి ఔన్నత్య భావానికి కాంగ్రెస్ ఉద్యమం లక్కపిడతల ఆటలాగా కనిపిం చింది. దానిపట్ల తనకున్న మురిపాన్ని వ్యక్తీకరించడానికి సినిమాలో ప్రతీసీనులోనూ ప్రేక్షక స్థానంలో ఒక తెల్లమనిషిని ప్రవేశపెడతాడు. మొదటి సగంవరకు చార్లెస్ ఆండ్రూస్, ఆ తరవాత మీరాబేన్, తరువాత ముగ్గురు పాశ్చాత్య పత్రికా విలేఖరులు, ఈ స్థానంలో వుండి శ్వేతజాతి ప్రతినిధులుగా ఆ ఆటను చూసి ఆనందిస్తారు. ఇందులో వ్యంగ్యం ఎక్కడుందంటే, ఇదంతా బహుశా న్యాయమే కావచ్చు. కాంగ్రెస్ ఉద్యమం నిజంగానే లక్కపిడతల ఆటలాగా నడిచి ఉండవచ్చు. అట్లాఅని అటెన్‌బరో సీరియస్‌గా వాదిస్తే మనకు అభ్యంతరం ఉండకపోవచ్చు. కాని మనం ఆ సత్యాన్ని శ్వేతజాతి దురహంకారంద్వారా తెలుసుకోవాల్సిరావడం బాధాకరం.

—బి. జి.

కొత్త పుస్తకాలు

అనామకుడి డైరీ

....కె. రాంమోహన్‌రాజు కథల సంపుటి రూ. 5/–

సముద్రం

....వరవరరావు రూ. 2/–

గ్రామాలు మేల్కొంటున్నాయి

....నాటకాలు - నాటికలు రూ. 8/–

రంగులవల - మరోకోణం - ఒక విమర్శ

సినిమా శక్తివంతమైన ఆయుధం - లెనిన్ పై నిర్వచనంతో మనమంతా పూర్తిగా ఏకీభవించాలి. సినిమా చాల శక్తివంతమైన సాధనం. అది విప్లవోద్యమాలకి ఎంతో ఉపయోగిస్తుంది. ప్రేక్షకులను ఉత్తేజితులను చేస్తుంది. కోస్టాగవరస్ నిర్మించిన ఓ చిత్రం ఫ్రాన్స్‌లో ఒక థియేటరులో చూచిన ప్రేక్షకులు బయటకు వచ్చి పోలీసులతో ఘర్షణకు దిగిన ఉదంతం దీనికి ఒక ఉదాహరణ.

అయితే ప్రస్తుత పరిస్థితులలో "సమకాలిక జీవితాన్ని ఆర్థిక రాజకీయ పునాదులతో సహా చిత్రించాలనుకొంటే స్వేచ్ఛ కుంచించుకుపోయింది" అని వివేక్‌గారి వాదన. "నూటికి నూరుపాళ్ళు విప్లవ సినిమా ప్రస్తుత వ్యవస్థలో సాధ్యం కాదు" అని వివేక్‌గారి మరో వాదన. అదేవిధంగా "పెట్టుబడిదారీ వర్గం తన లక్ష్యాన్ని, ఆదర్శాన్ని ప్రయోజనాన్ని క్షణం కూడా మరచిపోకుండా తనకు అనుకూలంగా ఉపయోగించుకుంటుంది" వివేక్‌గారి అభిప్రాయం.

1975 - 76 లో సమకాలిక జీవితాన్ని ఆర్థిక రాజకీయ పునాదులతో సహా స్వేచ్ఛ కోల్పోకుండా చిత్రీకరించిన చిత్రం ఒకటి వుంది. దాని నిర్మాత ప్రయుక్త రిత్విఘటక్ చిత్రంపేరు "జుక్తి తేకా ఆర్‌గప్పో" 35 mm లో B & W లో చిత్రీకరించబడిన ఈ చిత్రంలో భారత కమ్యూనిస్టు పార్టి పుట్టుక, పెరుగుదల CPI, CPI (M) ల చీలిక తర్వాత CPI (ML) పుట్టుకలను సమకాలిక ఆర్థిక, రాజకీయ, జాతుల. విశ్లేషణ. భావిలో ML ఎలా పురోగామిగ మారగలదో అని దర్పణం పట్టిన చిత్రం ఇది. ప్రస్తుత పరిస్థితులలో వివేక్‌గారు చెప్పిన "కాంప్రమైజ్" "రాజీ" కాకుండా చిత్రాలు తియ్యడానికి ముఖ్యమైన Primise నిర్మాత, దర్శకుల కథ కథనం, దీక్ష సిన్సియారిటి డిసిప్లిన్, అన్నిటినీ మించి ఆర్థిక పొదుపు, foresight. ప్రస్తుత ఆర్థిక పత్తిడుల వలయంలో పడకుండా తగిన వనరులను సమకూర్చుకొని అతి తక్కువ ఖర్చుతో 16 MM లో చిత్రాలు తియ్యవచ్చు. తియ్యాలి. స్థూలంగా చెప్పాలంటే నిర్మాణ దృక్పథంలలో మార్పు రావాలి.

దానికి ఉదాహరణగా మళయాళ భాషలో P. A. బక్కర్ తీసిన కబనీనది చువర్ణపోలె, మణిముళ్ళక్కం, సంఘగానం, పైచిత్రాలు 70 లలో 35 mm లో ఒకొక్క చిత్రం 1, 50 వేలు బడ్జెటు మించకుండా తీసినవి. ఏవిషయంలోనూ కాంప్రమైజ్ పడలేదు.

ప్రస్తుత పరిస్థితులలో ప్రచర్యన పంపిణీ బూర్జువా వర్గాల చేతిలో వుంది కాబట్టి ఈ రెండు విధులను నిర్మాత దర్శకులు తమ చేతిలోకి తీసుకొని బూర్జువా

వర్గాల ప్రమేయం లేకుండా ప్రదర్శించడం విప్లవ ఉద్యమంలో ఒక భాగమై వుండాలి.

పై విధులను ఆచరణలో పెట్టకలిగిన నిర్మాత దర్శకులు ప్రస్తుత పరిస్థితులలో కూడా ప్రజలను చైతన్యవంతులుగా చెయ్యగలిగిన చిత్రాలు తియ్యగలరు.

రెండవ ప్రపంచ యుద్ధజ్వాలలలో నిర్మితమైన 'బైసికిల్ తీవ్స్'ను చిలీలో అతి ఘోర పరిస్థితులలో నిర్మితమైన 'అవర్ ఆఫ్ ఫర్నెసెస్' చిత్రాల నిర్మాణ కథలను మనం మరువరాదు.

విప్లవాత్మక చిత్రాల నిర్మాణం ఎంత ముఖ్యమో అలాగే ప్రస్తుత మార్కెట్ వున్న విప్లవ చిత్రాలను గుర్తించి ప్రజలకు ఒక ఉద్యమ భాగంగా ప్రదర్శించడం అంతే ముఖ్యమని మిత్రులకు మనవి చేస్తున్నాను.

— వసుధ

—[4వ పేజీ తరువాయి]

హానికరమే. అప్పుడు ఈ ఎడిటర్ అనేవాడు మేనేజర్ కూడా అయి ఉపసంపాదకుల మీద చర్యతీసుకుంటాడు తర్వాత ఎప్పుడో పెట్టుబడి వాడి అహానికి తూట్లు పొడిచి, వాడి ప్రతిభని పీల్చి పిప్పిచేసి పనికిరాకుండా పోయింతరువాత పనిలోంచి తీసేస్తుంది. అప్పుడిక వాడు ఎవరూ చదవని ఏ ప్రభుత్వ పత్రికకో ఎడిటర్‌గా వెళ్ళిపోతాడు (ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లోనూ, ఈనాడులోనూ ఇందుకుగల ఉదాహరణలు పాఠకులు జ్ఞాపకం చేసుకోగలరు గాక!). తెలుగులో ప్రస్తుతం ఈ నేలరాలిన ప్రముఖుల జాబితా పెరిగేసూచనలు కనిపిస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి వారపత్రికనుంచి నవలాకారుడు, విమర్శకుడు, ఉపసంపాదకుడు పి. రామకృష్ణారెడ్డిగారిని ఆ పత్రిక సంపాదకులు, యాజమాన్యమూ కలిసి సస్పెండ్ చేశారు.

తా. క. 1974 మార్చ్ సృజనలో కొడవటిగంటి కుటుంబరావు 'ఎడిటర్ అనేవాడు' అని ఓ వ్యాసం రాశారు. సందర్భం, వ్యక్తులు మారినా ఆ భావాలలో కొన్నింటిని, అదే పత్రిక గురించి, ఇదే పేజీలలో తొమ్మిదేళ్ళతర్వాత మళ్ళీ చెప్పుకోవాల్సిరావడం ఎంత ఆశ్చర్యం, ఎంత అనాశ్చర్యం !!

—'సాహితీ మిత్రులు'

శ్రీశ్రీ వ్యాసాలు

విరసం ప్రచురణ

విప్లవ రచయితల సంఘం ఏర్పడినప్పటినుంచి ఇప్పటివరకు (1970-82) శ్రీశ్రీ రాసిన వ్యాసాలు, చేసిన ప్రసంగాలు, ఇచ్చిన ఇంటర్వ్యూలు మొదలైనవి, ఇతర ఏ సంపుటాలలోచేరని ఒకటి రెండువ్యాసాలు కలిసి సంకలనంగా ఈ నెలాఖరుకే వెలువడుతుంది.

సంపాదకుడు ; చలసాని ప్రసాద్

ప్రతులకు : సి. ఎస్. ఆర్. ప్రసాద్ వెల : 15 రు.
సి-108, శ్రీనివాసనగర్, గుంటూరు-522 006.

సృజన, హన్మకొండ - 506001

శ్రీ శ్రీ ప్రచురణలు

శ్రీశ్రీ తన సాహిత్యమంతా సంపుటాలుగా తానే స్వయంగా ప్రచురించు కోవాలని తలపెట్టి ఇటీవలే ప్రారంభించారు. శ్రీశ్రీ ప్రచురణలు తొలిసంపుటం

"పాడవోయి భారతీయుడా" (సినిమాపాటల సంకలనం) వెలువడిపూర్తిగా పంపిణీ జరగకుండానే ఆయన మరణించారు. 500కాపీలు మిగిలివున్నాయి. ఈ సంపుటి కావలసినవారు ఈ క్రింది అడ్రసుకు పద కొండు (11/-) రూపాయలు పంపవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను.

ఈ పుస్తకం కొనడంద్వారా శ్రీశ్రీ కుటుంబానికి ఆర్థికంగా తోడ్పడ వలసిందిగా కోరుతున్నాను.

కె. వి. రమణారెడ్డి

ఎస్. సరోజ, 1 సౌత్‌బ్యాంక్‌రోడ్, ఆర్.ఎ. పురం, మద్రాసు 600 028

S. Saroja, 1 South Bank Road, R. A. Puram,
MADRAS-600028

